అనుదినం... జనస్వరం
నవతెలంగాణ
ఆదివారం 15-01-2023
సమగ్ర తెలుగు దినపత్రిక



పాఠకులకు, ప్రకటనకర్తలకు, శ్రేయోభిలాషులకు సంక్రాంతి శుభాకాంక్షలు. పండుగ సందర్భంగా ఆదివారం పత్రికకు సెలవు, సోమవారం సంచిక వెలువడదు, పునర్దర్శనం మంగళవారం - చీఫ్ జనరల్ మేనేజర్, నవతెలంగాణ

సంపుటి : 9 | సంచిక : 15 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | www.navatelangana.com | 12 పేజీలు + అనుబంధం 8 పేజీలు + సోపతి (వెబ్‌లో) | వెల : 8.00

కేరళ యూనివర్సిటీ చారిత్రక నిర్ణయం..

'రుతుస్రావ' సెలవులు...

తిరువనంతపురం : దేశంలో విద్య, వైద్యం, టూరిజం వంటి రంగాల్లో ప్రత్యేకత చాటుకున్న కేరళ.. మరో చరిత్రాత్మక నిర్ణయానికి వేదికగా మారింది. పీరియడ్స్ సమయంలో విద్యార్థినులు లీవ్ తీసుకునేందుకు ప్రత్యేకంగా 'రుతుస్రావ సెలవు' పేరుతో హాజరు మినహాయింపు ఇస్తున్నట్టు ప్రకటించింది. కేరళలోని కొచ్చిన్ యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఈ మేరకు ప్రకటన చేసింది. ప్రతి సెమిస్టర్‌లోనూ విద్యార్థినులకు మెనిస్ట్రియేషన్ బెనిఫిట్ కింద ...5లో



పది లక్షలకు తగ్గొద్దు..

ఖమ్మం సభపై నేతలకు కేసీఆర్ ఆదేశాలు

- జన సమీకరణపై ప్రతి రోజూ దిశా నిర్దేశం
- మంత్రులు హరీశ్‌రావు, పువ్వాడ, ఎమ్మెల్సీ పల్లాకు పూర్తి బాధ్యతలు
- బీఆర్ఎస్ తొలి సభపై పూర్తిస్థాయి దృష్టి
- సభ తర్వాత మరింత ముమ్మరంగా కార్యాచరణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఖమ్మంలో నిర్వహించబోయే బీఆర్ఎస్ సభపై సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టిసారించారు. ఆ జిల్లాకు చెందిన కొందరు సీనియర్ నేతలు 'కాషాయ తీర్థం' పుచ్చుకోవటానికి రెడీ అవుతున్నారనే వార్తల నేపథ్యంలో ఆ పార్టీని ధీటుగా ఎదుర్కొనేందుకు వీలుగా ఆయన సంసిద్ధమవుతున్నారు. దీంతోపాటు బీజేపీ విధానాలను ఎండగట్టేందుకు రంగం సిద్ధం చేశారు. ఆ క్రమంలో ఖమ్మంలో ఈనెల 18న నిర్వహించబోయే బీఆర్ఎస్ బహిరంగ సభపై పూర్తిస్థాయిలో దృష్టి సారించారు. తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) పేరును భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)గా మార్చిన తర్వాత నిర్వహిస్తున్న మొట్ట మొదటి సభ కావటంతో ఆయన ఆ మీటింగ్‌పై ప్రత్యేక ఫోకస్ పెట్టారు. ఇప్పటిదాకా ప్లీనరీలు, బహిరంగ సభలు నిర్వహించిన సందర్భాల్లో లక్ష, రెండు లక్షలు, ఎక్కువలో ఎక్కువగా ఐదు లక్షల మంది జనాన్ని సమీకరించాలంటూ సీఎం పిలుపునివ్వటాన్ని గమనించాం. ఇప్పుడు అందుకు భిన్నంగా ఖమ్మం సభకు పది లక్షల మందిని సమీకరించాలంటూ ఆయన నేతలను ఆదేశించారు. ఇందుకనుగుణంగా మంత్రులు హరీశ్‌రావు, పువ్వాడ అజయ్‌కుమార్‌తోపాటు ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వరరెడ్డికి నిర్వహణా బాధ్యతలను ఆయన అప్పగించారు. ఇటీవల ఆ జిల్లాలో చంద్రబాబు బహిరంగ సభ నిర్వహించటం, వైఎస్ఆర్ టీపీ అధ్యక్షురాలు షర్మిల పాలేరు నియోజకవర్గంలో ఆఫీసును ఏర్పాటు చేయటం, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి రాజకీయ శిబిరాలను నిర్వహించటం తదతర పరిణామాల నేపథ్యంలో... వాటన్నింటికీ ధీటుగా 'తగ్గేదేలే...' అన్నట్టుగా బీఆర్ఎస్ సభను నిర్వహించాలని కేసీఆర్ నిర్ణయించారు. ఆ కోణంలో దాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని... నేతలతో రోజూ సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఆ సభ తర్వాత బీఆర్ఎస్ కార్యాచరణ, కార్యకలాపాలను మరింత ముమ్మరం చేయాలని ఆయన భావిస్తున్నారు.

మరోవైపు ఖమ్మంలో నిర్వహించబోయే సభకు నలుగురు ముఖ్యమంత్రులు పినరయి విజయన్ (కేరళ), స్టాలిన్ (తమిళనాడు), కేజ్రీవాల్ (ఢిల్లీ), భగవంత్‌మాన్ (పంజాబ్) హాజరు కానున్నారు. వీరితోపాటు యూపీ ...5లో

నూతన విద్యా విధానంతో దేశంలో అలజడి..

పేదలు విద్యకు దూరం

- విద్యా కేంద్రీకరణ,ప్రయివేటీకరణ, కాషాయీకరణ అత్యంత ప్రమాదం
- ఎన్ఈపీ వద్దే వద్దు.. ఓపీఎస్‌ను పునరుద్ధరించాలి
- అందుకోసం కేసీఆర్ దేశవ్యాప్త ఉద్యమం చేపట్టాలి
- 'మన ఊరు-మనబడి'కి నిధులు విడుదల చేయాలి
- టీఎస్‌యూటీఎఫ్ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు జంగయ్య, చావ రవి డిమాండ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చావ రవి, పక్కన జంగయ్య తదితరులు

నాగటి నారాయణ నగర్ (మన్నెగూడ) నుంచి బొల్లె జగదీశ్వర్

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తెచ్చిన నూతన విద్యావిధానం (ఎన్ఈపీ)-2020 అమల్లోకి వస్తే పేద విద్యార్థులు విద్యకు దూరమవుతారని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె జంగయ్య, చావ రవి ఆందోళన వ్యక్తం చేశారు. ఆ విధానాన్ని తీసుకురావటం ద్వారా బీజేపీ... దేశంలో అలజడిని సృష్టించిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా కేంద్రీకరణ, ప్రయివేటీకరణ, కాషాయీకరణ, కార్పొరేటీకరణ కోసమే ఎన్ఈపీని కేంద్రం తెచ్చిందని విమర్శించారు. దాన్ని రద్దు చేయాల్సిందేనని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లా మన్నెగూడలో ఉన్న సార్థ కన్వెన్షన్ సెంటర్(నాగటి నారాయణ నగర్)లో శుక్రవారం ప్రారంభమైన టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ఐదో మహాసభ రెండోరోజైన శనివారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో జంగయ్య చావ రవి మాట్లాడారు. విద్యారంగం, ఉపాధ్యాయుల సమస్యలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలపై మహాసభలో చర్చించామని వారు వివరించారు. ప్రజల మధ్య చిచ్చు పెట్టేలా, మెజార్టీ మత భావజాల ఉన్మాదాన్ని రెచ్చగొట్టేలా బీజేపీ వ్యవహరిస్తున్నదని చెప్పారు. ఎన్ఈపీతో డ్రాపౌట్స్ పెరుగుతాయని హెచ్చరించారు. దీన్ని వ్యతిరేకిస్తూ ఎస్టీఎఫ్ఐ ఆధ్వర్యంలో అనేక ఉద్యమాలు నిర్వహించామని వివరించారు. తెలంగాణలో ఎన్ఈపీని అమలు చేస్తారా..? లేదా..? అనే విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి ...2లో

టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కె జంగయ్య,చావ రవి

- 21 మంది ఆఫీస్ బేరర్లు,
- 151 మందితో రాష్ట్ర కమిట

నాగటి నారాయణ నగర్ (మన్నెగూడ) నుంచి బొల్లె జగదీశ్వర్

తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) రాష్ట్ర నూతన కమిటీని మహాసభ ...2లో



పారిశ్రామిక పురోగతికి సహకరించాలి

బడ్జెట్లో నిధులు కేటాయించాలి : కేంద్రానికి మంత్రి కేటీఆర్ లేఖ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర పారిశ్రామిక పురోగతికి సహకరించాలని పరిశ్రమలు, ఐటీ, మున్సిపల్ శాఖల మంత్రి కె.తారక రామారావు కేంద్రాన్ని కోరారు. ఈ మేరకు శనివారం ఆయన కేంద్రానికి లేఖ రాశారు. తెలంగాణ వంటి రాష్ట్రాలకు సహకరించడమంటే దేశానికి సహకరించినట్టేనని తెలిపారు. కేవలం ఎనిమిదేండ్ల ప్రగతి ప్రస్థానంతోనే దేశ పారిశ్రామిక రంగంలో తెలంగాణ కీలకంగా మారిందని చెప్పారు. అంతర్జాతీయ స్థాయి పారిశ్రామిక మౌలిక వసతులను తెలంగాణ అభివృద్ధి చేస్తున్నదనీ, వీటికి జాతీయ ప్రాధాన్యత ఉన్నదని తెలిపారు. పారిశ్రామిక రంగంలో చేపట్టిన కార్యక్రమాలకు ఈ ఏడాది బడ్జెట్లో నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రానికి ఇచ్చిన హామీలను అమలు చేయడానికి, నిబద్ధతను చాటుకోవడానికి ...5లో

బీజేపీకి ఎదురులేదనుకుంటే పొరబాటే..

- 2024లో ప్రాంతీయ పార్టీలే కీలకం : అమర్త్యసేన్

న్యూఢిల్లీ : అధికార బీజేపీకి ఎదురులేదని భావించటం పొరబాటని నోబెల్ గ్రహీత, ప్రముఖ ఆర్థికవేత్త అమర్త్యసేన్ అన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో (2024) ప్రాంతీయ పార్టీలు కీలకపాత్ర పోషిస్తాయన్నారు. శనివారం ఒక వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన దేశంలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై తన అభిప్రాయాలను వ్యక్తం చేశారు. "రానున్న సార్వత్రిక ...5లో

విద్యా కమిషన్‌ను నియమించాలి...

సర్కారు బడుల్లో ప్రీప్రైమరీని ప్రారంభించాలి

- కంప్యూటర్ విద్యను అమలు చేయాలి
- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఎస్, యూపీఎస్ టీచర్లకు ఓటు హక్కు కల్పించాలి
- టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర మహాసభలో 37 తీర్మానాలు ఆమోదం

నాగటి నారాయణ నగర్ (మన్నెగూడ) నుంచి బొల్లె జగదీశ్వర్



తీర్మానాలకు ఆమోదం తెలుపుతున్న ప్రతినిధులు

పాఠశాల విద్యలో సమస్యలను అధ్యయనం చేసేందుకు విద్యాకమిషన్‌ను నియమించాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతులను ప్రారంభించాలని కోరింది. రంగారెడ్డి జిల్లా మన్నెగూడలో ఉన్న బీఎంఆర్ సార్థ కన్వెన్షన్ సెంటర్(నాగటి నారాయణ నగర్)లో శుక్రవారం ప్రారంభమైన టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ఐదో మహాసభ శనివారం అత్యంత జయప్రదంగా ముగిసింది. విద్యారంగం, ఉపాధ్యాయుల సంక్షేమంతోపాటు పలు ఇతర సమస్యలపై 37 తీర్మానాలను మహాసభలో ఏకగ్రీవంగా ఆమోదించారు. జాతీయ విద్యావిధానం-2020ని రద్దు చేయాలని మహాసభ డిమాండ్ చేసింది. పాఠశాలల్లో స్వచ్ఛ కార్మికులను వెంటనే నియమించాలని కోరింది. స్వీపర్, అటెండర్, వాచ్‌మెన్, క్లరికల్ పోస్టులను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేసింది. మన ఊరు-మనబడి, మనబస్తీ-మనబడి కార్యక్రమానికి తగిన నిధులను విడుదల చేసి కాలపరిమితిలోగా పనులను పూర్తి చేయాలని సూచించింది. ఇంగ్లీష్ మీడియాన్ని బోధించేందుకు వీలుగా ఉపాధ్యాయులకు కావాల్సిన నైపుణ్యాలను పెంచాలనీ, అదనపు టీచర్లను నియమించాలని కోరింది. ఎఫ్ఎల్ఎన్ అమల్లో సమస్యలను పరిష్కరించాలని పేర్కొంది. మధ్యాహ్న భోజన పథకానికి నిధులు పెంచి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కోరింది. ఎయిడెడ్ విద్యాసంస్థలను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలనీ, అన్ని విధాలుగా వాటిని అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేసింది. రెగ్యులర్ డీఈవో, డిప్యూటీఈవో, ఎంఈవో పోస్టులను మంజూరుచేసి వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేసింది. ఎంఆర్సీ స్కూల్ కాంప్లెక్స్‌లను బలోపేతం చేయాలని పేర్కొంది. పాఠశాలల యాజమాన్య కమిటీలను బలోపేతం చేసి వాటి అభివృద్ధిలో సంపూర్ణ భాగస్వాములయ్యే విధంగా విధానాలు రూపొందించి అమలు చేయాలని కోరింది. పాఠశాలల్లో అన్ని స్థాయిల్లోనూ కంప్యూటర్ విద్యను అందించాలని సూచించింది. విద్యార్థులకు నాలుగు జతల బట్టలు, నోటుబుక్కులు, పెన్నులు, పెన్సిళ్లు, చెప్పులు, బెల్టు, బ్యాడ్జీ, ఐడీ కార్డులను ప్రభుత్వమే ఉచితంగా అందించాలని తెలిపింది. బాలికలకు హెల్త్ కిట్లను అందించాలని పేర్కొంది. గురుకులాలు, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లు, హాస్టళ్లు, సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులకు మెస్‌చార్జీలను కనీసం 30 శాతం మేర పెంచి పౌష్టికాహారం అందించాలని కోరింది. ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీల షెడ్యూల్‌ను వెంటనే ప్రకటించి అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేసింది. 317 జీవో కారణంగా ఏర్పడిన సమస్యలన్నింటినీ పరిష్కరించాలని కోరింది. ఈహెచ్ఎస్ పథకంలో నగదు రహిత వైద్యాన్ని సమగ్రంగా అమలు చేయాలని పేర్కొంది. జీపీఎఫ్ ఖాతాలను కొత్త జిల్లాలకు బదిలీ చేయాలని తెలిపింది. మెడికల్ రీయింబర్స్‌మెంట్ గరిష్ట మొత్తాన్ని రూ.ఐదు లక్షలకు పెంచాలని సూచించింది. పాఠశాల విద్యాశాఖలో పెండింగ్‌లో ఉన్న వ్యక్తిగత, ఇతర ఫైళ్లను వెంటనే పరిష్కరించాలని కోరింది. పారదర్శకత కోసం సిటిజన్ చార్టర్‌ను ప్రకటించి అమలు చేయాలని విజ్ఞప్తి చేసింది. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. వారికి ప్రతినెలా మొదటి తేదీన్నే జీతాలు చెల్లించాలని కోరింది. స్పెషల్ టీచర్లకు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని తెలిపింది. 2004, సెప్టెంబర్ ఒకటి కంటే ముందే ఎంపికై ఆ తర్వాత నియామకమైన డీఎస్సీ-2003 ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వుల కనుణంగా పాత పెన్షన్‌ను వర్తింపచేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు, కేజీబీవీ టీచర్లు, గురుకుల ఉపాధ్యాయులు, గిరిజన సంక్షేమ పాఠశాలలు, సింగరేణి పాఠశాలల్లోని సమస్యలను పరిష్కరించాలని కోరింది. క్లస్టర్ రిసోర్స్ పర్సన్లు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ బోధకుల సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేసింది. విద్యావైద్య రంగాలను పూర్తిగా ప్రభుత్వరంగంలోనే నిర్వహించి అందరికీ సమానమైన, నాణ్యమైన చదువును, వైద్యాన్ని ఉచితంగా అందించాలని పేర్కొంది. ప్రభుత్వ రంగంలోని అన్ని శాఖల్లోని కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, పార్ట్‌టైం ఉద్యోగులను రాష్ట్ర వెంటనే రెగ్యులరైజ్ చేయాలని కోరింది. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని పేర్కొంది. నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్ (ఎన్ఎంపీ)ని ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేసే టీచర్లందరికీ ఓటు హక్కు కల్పించాలని కోరింది. పాఠశాలల్లో ఉపాధ్యాయులపై మతోన్మాద మూకదాడులను అరికట్టాలని డిమాండ్ చేసింది.



వందే భారత్ ఛార్జీలివే...

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

సికింద్రాబాద్-విశాఖపట్నం (ట్రైన్ నెంబర్ 20834), విశాఖపట్నం-సికింద్రాబాద్ (ట్రైన్ నెంబర్ 20833) వందే భారత్ రైళ్లను ప్రధాని నరేంద్రమోడీ ఆన్‌లైన్ ద్వారా ఆదివారం ప్రారంభించనున్న విషయం తెలిసిందే. ఈ రైలు టైమింగ్స్, టిక్కెట్ ధరలను దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. ఈ ధరలను చూసిన ప్రయాణీకులు రైలులో ఎన్ని సౌకర్యాలు ఉన్నా, ఇంత ఖరీదా అంటూ ముక్కున వేలేసుకుంటున్నారు. వందేభారత్ పేరుతో వేల రూపాయలు వసూలు చేస్తున్నారని రైలు ప్రయాణీకులు ఆందోళన చెందుతున్నారు. ఈ రైలులో సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్లాలంటే చైర్‌కార్‌లో అయితే ఒక టిక్కెట్ ధర అక్షరాల రూ.1,720. ఎగ్జిక్యూటివ్ క్లాస్ టిక్కెట్ ధర రూ.3,170. ఈ రూట్‌లో ఇప్పటి వరకు ఏసీ బోగీల్లో ప్రయాణం చేసినా ఇంత చార్జీలు లేవని ప్రయాణీకులు చెప్తున్నారు. ఈ రైలు ఆదివారం మినహా మిగిలిన ఆరు రోజుల్లో నడుస్తుంది. ఈ రైలులో సికింద్రాబాద్ నుంచి విజయవాడకు ఒక్కరికి రూ.905 (ఛైర్ కార్), రూ.1775 (ఎగ్జిక్యూటివ్ క్లాస్), సికింద్రాబాద్ నుంచి రాజమహేంద్రవరానికి రూ.1,365 (ఛైర్ కార్), రూ.2,485 (ఎగ్జిక్యూటివ్ క్లాస్) టికెట్ ధరలను నిర్ణయించారు. ఈ ఛార్జీలతో టిక్కెట్ అడ్వాన్స్ బుకింగ్ సౌకర్యాన్ని శనివారం నుంచి ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. 15న ఈ రైలును ప్రధాని ప్రారంభించినా, సాధారణ ప్రయాణీకులకు ఈనెల 16 నుంచి అందుబాటులోకి వస్తుంది. విశాఖ నుంచి బయలుదేరే ఈ రైలు ఉదయం 5.45 గంటలకు అక్కడ బయల్దేరి, మధ్యాహ్నం 2.15 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. అలాగే సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి బయల్దేరే రైలు మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమై, రాత్రి 11.30 గంటలకు విశాఖ చేరుకుంటుంది. మార్గమధ్యంలో రాజమండ్రి, విజయవాడ, ఖమ్మం, వరంగల్ రైల్వేస్టేషన్లలో ఆగుతుంది.

ఢిల్లీలో పడిపోతున్న గాలి నాణ్యత...

న్యూఢిల్లీ: ఢిల్లీలో వాయుకాలుష్యం పెరుగుతూనే ఉంది. దేశ రాజధానిలో గాలి నాణ్యత తీవ్రస్థాయిలో పడిపోతున్నట్టు వాతావరణశాఖ వెల్లడించింది. తాజాగా ఢిల్లీలో శనివారం ఉదయం ఎయిర్ ఇండెక్స్ క్వాలిటీ (ఎక్యూఐ) 337గా నమోదైందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. ఇక సిస్టమ్ ఆఫ్ ఎయిర్ క్వాలిటీ అండ్ వెదర్ ఫోర్‌కాస్టింగ్ అండ్ రీసెర్చ్ (ఎస్ఎఎఫ్ఎఆర్) సమాచారం ప్రకారం ఢిల్లీ యూనివర్సిటీ ప్రాంతంలో 357, పూసా టెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్‌లో 329, ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో 326గా ఎక్యూఐ నమోదయ్యాయి. అలాగే ఢిల్లీ ఐఐటీ చుట్టుపక్కల ప్రాంతంలో 337, మధుర రోడ్‌లో 349, లోధి రోడ్ ప్రాంతంలో 327గా ఏక్యూఐ నమోదయ్యాయి. కాగా, ప్రస్తుతం ఢిల్లీలో శనివారం ఉదయం 11.6 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైనట్టు వాతావరణశాఖ వెల్లడించింది. దీంతో అక్కడ చలిగాలులు వీస్తున్నట్టు ఐఎండీ పేర్కొంది. రాబోయే రెండు రోజులు 15, 16 తేదీల్లో వాయువ్య భారతదేశంలో చలిగాలులు తీవ్రంగా వీచే అవకాశముందని, మరోసారి గరిష్టస్థాయికి ఉష్ణోగ్రతలు పడిపోయే అవకాశముందని వాతావరణశాఖ వెల్లడించింది. జనవరి 15న పంజాబ్, చండీగఢ్, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, మధ్యప్రదేశ్, బీహార్, ఉత్తరప్రదేశ్, ఢిల్లీలోని కొన్ని ప్రాంతాల్లో దట్టమైన పొగమంచు కురిసే అవకాశముందని ఐఎండీ అంచనా వేసింది.

టీఎస్ యూటీ ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కె జంగయ్య,చావ రవి

(మొదటిపేజీ తరువాయి)

ఏకగ్రీవంగా ఆమోదించింది. టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర నూతన అధ్యక్షులుగా కె జంగయ్య, ప్రధాన కార్యదర్శిగా చావ రవిని ప్రతినిధులు తిరిగి ఎన్నుకున్నారు. రెండురోజులపాటు నిర్వహించిన టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ఐదో మహాసభలు రంగారెడ్డి జిల్లా మన్నెగూడలోని సార్థ కన్వెన్షన్ సెంటర్‌లో శనివారం ముగిశాయి. ఎన్నికల అధికారులుగా ఎంఏ కే దత్తు, మస్తాన్ రావు, రాజన్ బాబు వ్యవహరించారు. 21 మంది ఆఫీస్ బేరర్లు, 151 మందితో రాష్ట్ర కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ప్రకటించారు. రాష్ట్ర ఉపాధ్యక్షులుగా సిహెచ్ రాములు, సిహెచ్ దుర్గా భవాని, కోశాధికారిగా టీ లక్ష్మా రెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు టీ సోమశేఖర్, ఏ వెంకటి, ఎం రాజశేఖరరెడ్డి, వి శాంతి కుమారి, జి సమ్మారావు, డి సత్యానంద్, జి నాగమణి, ఈ గాలయ్య, బి రాజు, కె రంజిత్ కుమార్, ఎస్ రవి ప్రసాద్ గౌడ్, కె రవి కుమార్, ఎస్ మల్లారెడ్డి, జి శ్రీధర్, వై జ్ఞాన మంజరి, ఏ సింహాచలం ఎన్నికయ్యారు. ఆడిట్ కమిటీ కన్వీనర్ గా మహబూబ్ అలీ ఆడిట్ కమిటీని ఏడుగురు సభ్యులతో ప్రతినిధులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆడిట్ కమిటీ కన్వీనర్ గా మహబూబ్ అలీ, సభ్యులు గా అవ్వారి శ్రీనివాస్, జె యాకయ్య, సి లక్ష్మణ్ రావు, పి శ్రీనివాస రావు, రఘుపాల్, కె శంకర్‌ను ఎన్నుకున్నారు.

కాంగ్రెస్ ఎంపీ సంతోఖ్ సింగ్ చౌదరి గుండెపోటుతో కన్నుమూత

లూధియానా : జోడోయాత్రలో విషాదం చోటు చేసుకుంది. శనివారం ఉదయం పంజాబ్‌లోని జోడోయాత్రలో పాల్గొన్న జలంధర్ ఎంపీ సంతోఖ్ సింగ్ చౌదరి (76) గుండెపోటుతో కన్నుమూశారు. వివరాల్లోకి వెళితే.. ఈరోజు ఉదయం పంజాబ్‌లోని ఫిలింనగర్‌లో జరుగుతున్న జోడోయాత్రలో ఎంపీ సంతోఖ్‌సింగ్ పాల్గొన్నారు. పాదయాత్రలో నడుస్తుండగా.. గుండెపోటుకు గురై కుప్పకూలారు. వెంటనే హుటాహుటిన కాంగ్రెస్ కార్యకర్తలు, నేతలు ఆయన్ని ఫగర్వాలోని ఆసుపత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్‌గాంధీ కూడా ఆస్పత్రికి చేరుకున్నారని ఆ పార్టీ సీనియర్ నేత ఒకరు తెలిపారు. సంతోఖ్‌సింగ్ ఆకస్మిక మృతి వల్ల జోడోయాత్రను ప్రస్తుతానికి నిలిపివేసినట్లు ఆ పార్టీ వర్గాలు వెల్లడించాయి. కాగా, సంతోఖ్‌సింగ్ మృతిపట్ల కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే సంతాపం తెలిపారు. చౌదరి మృతి కాంగ్రెస్ పార్టీకి తీరనిలోటు అని, కుటుంబ సభ్యులకు, స్నేహితులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ ఖర్గే ట్వీట్ చేశారు.

కేంద్ర నిధులపై చర్చకు సిద్ధం

- మంత్రి కేటీఆర్ రాజీనామా లేఖ రాసుకొని రావాలి : కేంద్రమంత్రి జీ కిషన్‌రెడ్డి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులపై చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని కేంద్రమంత్రి జీ కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. శనివారంనాడిక్కడి బీజేపీ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర నిధులపై చర్చకు రావాలంటూ మంత్రి కే తారకరామారావు చేసిన సవాలును తాను స్వీకరిస్తున్నట్టు చెప్పారు. అయితే ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావు రాజీనామా పత్రాన్ని తీసుకొని, మంత్రి కేటీఆర్ చర్చకు రావాలని షరతు విధించారు. భారతదేశం అఫ్ఘానిస్థాన్‌గా మారుతుందని సీఎం కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు దేశ ప్రతిష్ఠను దిగజార్చేలా ఉన్నాయని అన్నారు. రాజకీయంగా తమను తిడితే పడతామనీ, దేశాన్ని నిందిస్తే సహించబోమని హెచ్చరించారు.

నూతన విద్యావిధానంతో దేశంలో అలజడి



(మొదటిపేజీ తరువాయి)

కేసీఆర్ స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. కేరళ, తమిళనాడు, ఢిల్లీ ప్రభుత్వాలు ఎన్ఈపీని అమలు చేయబోమంటూ స్పష్టం చేశాయని గుర్తు చేశారు. దీనిపై స్పష్టమైన వైఖరి చెప్పని తెలంగాణ ప్రభుత్వం చాపకింద నీరులా ఆ విధానాన్ని అమలు చేస్తున్నదని అన్నారు. ఇప్పటికైనా దాన్ని నిర్ద్వంద్వంగా తిరస్కరించాలంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ అంశంపై ఒక ప్రత్యామ్నాయ నివేదికను రూపొందించి ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్)ని వాజ్‌పేయి ప్రభుత్వం అమల్లోకి తెచ్చిందన్నారు. పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ డెవలప్‌మెంట్ అథారిటీ (పీఎఫ్ఆర్డీఏ) చట్టాన్ని బీజేపీ మద్దతుతో యూపీఏ ప్రభుత్వం ఆమోదించిందని చెప్పారు. అయితే సీపీఎస్ ఉద్యోగులకు సామాజిక భద్రత లేదన్నారు. అది వర్తించే ఉద్యోగులు మరణిస్తే వారి కుటుంబానికి రూ.వెయ్యి, రూ.రెండు వేలు మాత్రమే పెన్షన్ వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. రాజస్థాన్, చత్తీస్‌ఘఢ్, పంజాబ్ ప్రభుత్వాలు సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాయని గుర్తు చేశారు. ఇప్పుడు హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వం కూడా ఓపీఎస్ అమలు చేసేందుకు వీలుగా క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకున్నదని గుర్తు చేశారు. అందువల్ల మన రాష్ట్రంలోనూ సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని కోరారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నేతృత్వంలో సీపీఎస్ రద్దు కోసం దేశవ్యాప్త ఉద్యమానికి శ్రీకారం చుట్టాలనీ, దానికి ఆయనే నాయకత్వం వహించాలనికోరారు.

ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలి..

రాష్ట్రంలో 17 ఏండ్లుగా పర్యవేక్షణ అధికారులు, ఏడేండ్లుగా పదోన్నతులు, ఐదేండ్లుగా బదిలీల్లేక ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారని జంగయ్య, చావ రవి ఈ సందర్భంగా చెప్పారు. 12 జిల్లాల్లో రెగ్యులర్ డీఈవో పోస్టులున్నా, వాటిలో ఐదింటిని ఇన్‌ఛార్జీలే నెట్టుకొస్తున్నారని వాపోయారు. మిగతా 20 జిల్లాలకు అసలు డీఈవో పోస్టులే మంజూరు కాలేదని తెలిపారు. ఎంఈవో పోస్టులకు సంబంధించి 16 పోస్టుల్లోనే రెగ్యులర్ ఎంఈవోలున్నాయనీ, మిగిలిన చోట్ల ఇన్‌ఛార్జీలు కొనసాగుతున్నారని వివరించారు. ఉపాధ్యాయ ఖాళీలు, పర్యవేక్షణ లేకుండా విద్యార్థులకు నాణ్యమైన విద్య ఎలా అందుతుందని ప్రశ్నించారు. ఆయా ఖాళీలను భర్తీ చేయాలనీ, బదిలీలు, పదోన్నతులను చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. త్వరలోనే పదోన్నతులంటూ విద్యామంత్రి పదేపదే చెప్తున్నారనీ, అది ఎప్పుడని ప్రశ్నించారు.

మాణిక్‌రెడ్డిని గెలిపించాలి..

హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి పోటీచేస్తున్న పాపన్నగారి మాణిక్‌రెడ్డిని గెలిపించాలని జంగయ్య, చావ రవి ఉపాధ్యాయు లకు విజ్ఞప్తి చేశారు. విద్యారంగం, ఉపాధ్యాయుల సమస్యలు, పీఆర్సీ, 317 జీవో బాధితులకు న్యాయం చేయాలంటూ తమ సంఘం ఆధ్వర్యంలో ఐక్య ఉద్యమాలు నిర్వహించామని గుర్తు చేశారు. 317 జీవో బాధిత ఉపాధ్యాయుల అప్పీళ్లను పరిష్కరించాలనీ, స్పౌజ్ టీచర్ల బదిలీలకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. మాణిక్‌రెడ్డిని గెలిపించుకునేందుకు అందరూ కృతనిశ్చయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

మన ఊరు-మనబడికి నిధుల కొరత..


మన ఊరు-మనబడి కార్యక్రమానికి సంబంధించి మూడేండ్లలో రూ.7,289 కోట్లతో 26,067 పాఠశాలలను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని వారు ఈ సందర్భంగా చెప్పారు. మొదటి విడతలో 9,123 స్కూళ్లలో రూ.3,497.62 కోట్లతో మౌలిక వసతులు కల్పిస్తామంటూ ప్రకటించిందన్నారు. అయితే ఇప్పటి వరకు నిధుల కొరత వల్ల పది శాతం బడుల్లోనే పనులు పూర్తయ్యాయని వివరించారు. 30 శాతం పాఠశాలల్లో పనులే ప్రారంభం కాలేదన్నారు. మిగిలిన 70 శాతం బడుల్లో పనులు కొనసాగుతున్నాయని అన్నారు. ఆ కార్యక్రమానికి నిధుల కొరత లేకుండా బడ్జెట్‌ను విడుదల చేసి ప్రస్తుత విద్యాసంవత్సరంలోనే పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాలల్లో స్వచ్ఛ కార్మికులను నియమించలేదనీ, ఈ నేపథ్యంలో పాఠశాలలను ఊడ్చెదెవరంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గ్రామ పంచాయతీ, మున్సిపాల్టీ సిబ్బందికి ఈ బాధ్యతను అప్పగించినా వారు పాఠశాల ఆవరణను మాత్రమే ఊడుస్తున్నారని అన్నారు. అంతే తప్ప తరగతి గదులు, టాయ్‌లెట్లను శుభ్రం చేయడం లేదన్నారు. అందువల్ల తక్షణం స్వచ్ఛ కార్మికులను నియమించాలని డిమాండ్ చేశారు. లేదంటే ఇది సామాజిక సమస్యగా మారుతుందని హెచ్చరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెట్టినా తెలుగు మీడియం టీచర్లే రెండు మాధ్యమాలనూ బోధిస్తున్నారని చెప్పారు. దీంతో వారిపై పని భారం పడుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంగ్లీష్ మీడియం బోధనకు అదనంగా ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు మూడు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయనీ, వాటిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

మతోన్మాదుల మూకదాడులను అరికట్టాలి...

నిజామాబాద్ జిల్లా కోటగిరిలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు మల్లిఖార్జున్‌పై దాడిని ఖండిస్తున్నామని జంగయ్య, చావ రవి చెప్పారు. టీచర్లపై మతోన్మాదుల మూకదాడులను అరికట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆర్టికల్ 51(హెచ్) ప్రకారం తరగతి గదిలో శాస్త్రీయ దృక్పథాన్ని ఉపాధ్యాయులు పెంపొందించాలని సూచించారు. హేతువాద భావాలను బోధించిన వారిపై దాడులు కొనసాగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేజీబీవీల్లో 12 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగులకు మినిమం బేసిక్ పే ఇవ్వాలని కోరారు. గురుకులాల్లో ఉపాధ్యాయులపై పనిభారాన్ని తగ్గించాలని సూచించారు. మోడల్ స్కూళ్లలో మూడు వేల మంది సిబ్బందికి పదోన్నతులు, బదిలీలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఆరోగ్య కార్డులు నిమ్స్‌లో తప్ప మరెక్కడా పనిచేయడం లేదన్నారు. ఈ క్రమంలో ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలనీ, కార్పొరేట్ ఆస్పతుల్లో సైతం అవి చెల్లుబాటయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విలేకర్ల సమావేశంలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర మహాసభల కార్యనిర్వాహక అధ్యక్షులు ఈ గాలయ్య రంగారెడ్డి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గోపాల్ నాయక్, వెంకటప్ప, కోశాధికారి జగన్నాథశర్మ, కార్యదర్శులు కిషన్‌చౌహాన్, గణేష్, రఘుపాల్, నర్సింహ్మా తదితరులు పాల్గొన్నారు.

'కత్తులు దగ్గర పెట్టుకోండి..'

- మీ మతాన్ని రక్షించుకోండి
- శ్రీరామసేన జాతీయ అధ్యక్షుడు ప్రమోద్ ముథాలిక్ రెచ్చగొట్టే ప్రసంగం



న్యూఢిల్లీ: మోడీ సర్కార్ అండదండల తో హిందుత్వ శక్తులు రెచ్చిపోతున్నాయి. మైనార్టీలను లక్ష్యంగా చేసుకొని హిందువుల్ని రెచ్చగొడుతున్నా యి. శ్రీరామసేన జాతీయ అధ్యక్షుడు ప్రమోద్ ముథాలిక్ హిందువులను రెచ్చ గొడుతూ వివాదా స్పద వ్యాఖ్యలు చేశారు. "హిందువులంతా తమ తమ ఇండ్లల్లో కత్తులు దగ్గర పెట్టుకోవాలి. మీ మతాన్ని రక్షించుకోవాలి. ఈ దేశాన్ని, సోదరీమణుల్ని రక్షించుకోవాలి" అంటూ కర్నాటకకు చెందిన హిందూత్వ నాయకుడు ప్రమోద్ ముథాలిక్ అన్నా రు. యడ్రావి పట్టణంలో జనవరి 13న జరిగిన ఒక కార్యక్రమంలో ప్రసం గిస్తూ ముథాలికా ఒక వర్గాన్ని రెచ్చగొట్టేవిధంగా ప్రసంగించారు. "చీరల మధ్య కత్తుల్ని దాచొద్దు. ఇంటిలో అందరికీ కనిపించేలా వేలాడదీయండి. మీ ఇంట ఇది కనిపిస్తే..మీ ఇంటి అమ్మాయిని ఎవడైనా టచ్ చేసే ధైర్యం ఉంటుందా?" అంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు ఫిర్యాదు నమోదు చేయలేదు. లోక్‌సభ ఎంపీ ప్రగ్యాసింగ్ ఠాకూర్ ఇటీవల ఇలాగే విద్వేషపూరిత వ్యాఖ్యలు చేశారు. తొలుత పోలీసులు ఎంపీపై ఫిర్యాదు నమోదు చేయలేదు. ప్రజల నుంచి ఆందోళన వ్యక్తం కావటం, సోషల్ మీడియాలో వైరల్ అయిన మూడు రోజుల తర్వాత ఎఫ్ఐఆర్ నమోదైంది. "పోలీస్ స్టేషన్‌లో పోలీసులు ఎఫ్ఐఆర్ బుక్‌కు ఆయుధ పూజ చేయటం లేదు. తుపాకులకు ఆయుధ పూజ చేస్తున్నారు. అలాంటప్పుడు మనం ఎందుకు కత్తులకు ఆయుధ పూజ చేయకూడదు. ఇండ్లల్లో కత్తులు ఎందుకు పెట్టుకోకూడదు? ట్రాక్టర్లకు, పుస్తకాలకు, పెన్నులకు ఆయుధ పూజ చేయటం కాకూండా, కత్తులకు చేయండి"అని సభకు వచ్చినవారిని రెచ్చగొట్టాడు. లవ్ జిహాద్‌ను దృష్టిలో ఉంచుకొని, మరొక మతాన్ని టార్గెట్ చేయాల్సిందిగా హిందువుల్ని రెచ్చగొడుతూ అతడి వ్యాఖ్యలున్నాయని ఆరోపణలు వెలువడ్డాయి. భజరంగ్ దళ్ మాజీ సభ్యుడైన ముథాలిక్ 2005లో శ్రీరామ్ సేనను ఏర్పాటుచేశాడు. మోరల్ పోలిసింగ్, పబ్‌లకు వెళ్లే యువతలపై, వాలంటైన్స్ డే జరుపుకొనే వారిపై దాడులు చేయటం ద్వారా నిత్యం వార్తల్లో ఉంటున్నాడు.

ఏపీలో బీఆర్ఎస్ శ్రేణుల సంక్రాంతి సంబరాలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సంక్రాంతి పండుగ సందర్భంగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో పండుగ వాతావరణం సంతరించుకున్నది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా సంబరాలు జరుపుకుంటున్నారు. బీఆర్ఎస్ నూతన జాతీయ పార్టీ ఏర్పాటైన నేపథ్యంలో సంక్రాంతి రావడం వారి ఉత్సాహాన్ని మరింతగా రెట్టింపు చేసింది. ఆ రాష్ట్రవ్యాప్తంగా తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, శ్రీకాకుళం, కృష్ణ, గుంటూరు విజయవాడ సహా యానాం, అవిడిరేవు, కొత్త పేట, కడియం, కాకినాడ, ముమ్మిడి వరం, ముక్కాముల వంటి ఆంధ్రాలోని పలు ముఖ్య పట్టణాలలో, జాతీయ రహదారుల వెంట, బిఆర్ఎస్ పార్టీ ఫ్లెక్సీలు భారీ ఎత్తున వెలిశాయి. పార్టీ అభిమానులు, నేతలు ఫ్లెక్సీల ద్వారా బీఆర్ఎస్ పార్టీపై తమ అభిమానాన్ని చాటుకుంటున్నారు. తెలంగాణ సీఎం కేసిఆర్ బీఆర్ఎస్ పార్టీని స్థాపించి ఆంధ్రాలో కూడా రాష్ట్ర శాఖను ఏర్పాటు చేయడం, పార్టీ కార్యకలాపాలను ఉధృతం చేస్తుండటం, పలువురు జాతీయ నేతలను ఆహ్వానించి వారు ముఖ్య అతిథులుగా ఈ నెల 1న తమ సరిహద్దు ఖమ్మం జిల్లాలో భారీ బహిరంగ సభను నిర్వహిస్తుండడం పట్ల ఆంధ్రా వ్యాప్తంగా ప్రజల్లో చర్చ ప్రారంభమైంది. హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి ఆంధ్రాకు సంక్రాంతికి వచ్చిన తమ బంధువులు స్నేహితులు, కేసిఆర్ పార్టీ ఆంధ్రాకు విస్తరిస్తున్న రాజకీయ పరిణామాలపై తమ వారి అభిప్రాయాలను ఆలోచనలను సేకరిస్తూ ఆసక్తికర చర్చ కొనసాగుతుండడం పలువురిని ఆలోచింపజేస్తున్నది.

టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ఐదో మహాసభ జయప్రదం

విద్య, ఉపాధ్యాయ అంశాలపై సుదీర్ఘమైన చర్చలు

- భవిష్యత్ కార్యాచరణపై దిశా నిర్దేశం
- ముగిసిన మహాసభ
- అహ్లాదకరమైన, ఆలోచింపజేసే కొటేషన్లతో సభా ప్రాంగణం అలంకరణ
- ప్రతినిధుల ప్రశంసలు పొందిన మహాసభ ఆహ్వాన సంఘం



నవతెలంగాణ రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర ఐదో మహాసభ శనివారం విజయవంతంగా ముగిసింది. రంగారెడ్డి జిల్లా తుర్కయంజాల్‌లోని బీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లోని కామ్రేడ్ నాగటి నారాయణనగర్, కామ్రేడ్ ముంత ఆంజనేయులు ప్రాంగణంలో శుక్రవారం ప్రారంభమైన మహాసభ ఉత్సాహపూరితమైన వాతావరణంలో రెండ్రోజులపాటు నడిచింది. విద్యార్థి, ఉపాధ్యాయ సంక్షేమాలపై సుదీర్ఘమైన చర్చ జరిగాయి. మహాసభ ఎంత ఉత్సాహంతో ప్రారంభమైందో ఇంతే వరవడితో భవిష్యత్ కార్యాచరణపై ప్రతినిధుల చర్చ కొనసాగింది. మహాసభకు పెద్ద సంఖ్యలో హాజరైన ఉపాధ్యాయులు.. శుక్రవారం ఉదయం 9గంటలకు రాగన్నగూడెం నుంచి ర్యాలీగా సభా ప్రాంగణానికి చేరుకున్నారు. సభా ప్రాంగణంలో యుటీఎఫ్ సీనియర్ నాయకులు పతాకాలను ఎగురవేశారు. ఈ మహాసభకు హాజరైన కేరళ ప్రభుత్వ విప్ కేకే శైలజా టీచర్ అమరులను స్మరిస్తూ అమరవీరుల స్థూపానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. అనంతరం మహాసభను ప్రారంభించారు. అదేవిధంగా మహాసభకు హాజరైన విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి, ఎమ్మెల్యేలు, పలువురు వ్యక్తులు ఉపాధ్యాయ, విద్యార్థి సంక్షేమంపై ప్రసంగించారు.

ప్రతినిధుల సభలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో రెండేండ్లలో చేసిన కార్యక్రమాలు, సాధించిన విజయాలు, లోపాలు, జిల్లా కమిటీల పని విధానం, ఇలా పలు అంశాలపై రాష్ట్ర కార్యదర్శి నివేదిక ప్రవేశపెట్టారు. రాష్ట్ర కార్యదర్శి నివేదికపై శుక్ర, శనివారం ఉదయం వరకు చర్చలు జరిగాయి. ఆయా జిల్లాల ప్రతినిధులు పలు అంశాలపై ప్రశ్నించగా.. కార్యదర్శి సమాధానం ఇచ్చారు. అనంతరం విద్యార్థి, ఉపాధ్యాయ సంక్షేమం, ఉపాధ్యాయుల సమస్యలు, సర్కారు బడుల బలోపేతం, ఇలా 23 అంశాలపై సుదీర్ఘంగా చర్చించి, తీర్మానాలు చేశారు. భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణపై చర్చించారు.

ఆలోచన రేకెత్తించే విధంగా సభా ప్రాంగణం

సమావేశ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన హోర్డింగ్స్‌పై కొటేషన్స్ ప్రతినిధులను ఆలోచింపజేశాయి. మహాసభ ఆహ్వాన సంఘం మంచి నినాదాలతో సమావేశ ప్రాంగణమంతా అలంకరించింది. కొటేషన్లు ప్రతినిధులను ఆకట్టుకున్నాయి.. 'బిడ్డల పాలకై బిచ్చమెత్తు దేశంలో రాళ్లకు పాలిచ్చు కథ నశించునదెన్నడో.. పేదకు బొట్టెట్టి దైవమని పూజించినవారు పేదను గుర్తించగ మారబోవునదెన్నడో.. ఎప్పుడొచ్చును దేశానికి చైతన్యం అది తెచ్చుట కదా మన కర్తవ్యం' అనే కొటేషన్స్ ఆలోచింపచేశాయి.

ఇలా మరెన్నో కొటేషన్లు

'ఉపాధ్యాయులుగా మీ హక్కులకై పోరాడండి.. అదే సమయంలో సామాన్యుల పోరాటాలలో భుజం భుజం కలపండి' అని పుచ్చలపల్లి సుందరయ్య వాక్యం, 'మతం అనేది వ్యక్తిగత విషయం.. తనకిష్టం వచ్చిన మతాన్ని విశ్వసించేందుకు, విశ్వసించకుండా ఉండేందుకు పూర్తి స్వేచ్ఛ ఉంది' అన్న స్వామి వివేకానంద కొటేషన్స్ ప్రతినిధులను ఆలోచింపచేశాయి. ఇక సభా ప్రాంగణం మొత్తం.. రెండేండ్లలో చేసిన కార్యక్రమాల దృశ్యమాలిక ప్రదర్శనలు ఆకట్టుకున్నా యి. మహాసభను విజయవంతం చేయడంలో రంగారెడ్డి జిల్లా కమిటీ కృషి చేసింది.

సంపాదకీయం

మేల్కొనే పండుగ


'తెల్లా వారకముందే పల్లె లేచింది, తనవారినందరినీ తట్టీ లేపింది' అంటూ పల్లె జీవన దృశ్యాన్ని మల్లెమాల ఎంతో అద్భుతంగా చిత్రిస్తాడీ గీతంలో. అవును పల్లె జీవన దృశ్యమే వేరు. అప్పటికీ ఇప్పటికీ ఎన్నో మార్పులు వచ్చినప్పటికీ పట్నం కంటే కొంత భిన్నమైన జీవనమే పల్లెది. యంత్ర భూతములపై రెక్కల అమ్మకం పట్నం బతుకు. నమ్ముకున్న భూమిపై రెక్కలతో జీవనం పల్లెబతుకు.

> పండుగనాడు ఇంటిల్లిపాదిమి కలిసిన సందర్భాన సామాజిక సవాళ్ల గురించి ఆలోచన చేయాలి. సామరస్యపూరిత సమాజంలోనే ఆనందం వెల్లివిరిస్తుందని గుర్తించాలి. సంఘంలో అసమానత అలజడి చోటుచేసుకుంటే, అందులో భాగమైన కుటుంబం సంతోషంగా ఉండలేదు. సామాజిక వైషమ్యాలలో పడిపోతే ప్రగతిని సాధించడం అసాధ్యమవుతుంది.జీవితాలలోని బాధలను, వెతలను మరిచిపోవటం కాదు పండుగ. వాటిని తుడిచివేసేది నిజమైన పండుగ. అలాంటి సంక్రాంతులు అందరిలో కాంతి నింపాలని, సమతా శాంతులు వెలిగించాలని కోరుకుందాము.

నమ్మకానికీ అమ్మకానికీ ఉన్న తేడా ఎంతో కొంత కొనసాగుతూనే ఉంది. అంటే అనుబంధము, అనురాగము అంతో ఇంతో ఉన్నది కూడా అక్కడనే. అందుకనే సంక్రాంతి పండగనగానే రయ్ రయ్‌మని యాంత్రిక జీవన యానకుల పరుగులు పల్లెలవైపు, తమ తమ ఇండ్లవైపు బారులు తీరుతున్నాయి. వాతావరణ కాలుష్యాల నుండి, ఆలోచనల కాలుష్యాల నుండి గుండె సాంత్వన కోసం పరుగులు తీస్తుంది. అక్కడది దొరుకుతుందా లేదా అనేది వేరే విషయం.

పండుగంటే అందరూ కలసిమెలసి తలపులు కలబోసుకోవటమే కదా!


ఒంటిని కొరుక్కుతినే చలిని, ముసురుకునే దిగులును, మంచు పొగల పొరను పారద్రోలే మంటలను ప్రతి ఇంటి ముందర రాజేసే పండుగ. మూఢత్వాలను, మనోమలినాలను కాల్చిపారేసి నూతన ఉషోదయానికి స్వాగతం పలికే పండుగ. వాకిళ్లలో రంగు రంగుల రంగవల్లులతో తమ అభిలాషలను నిండా పరచుకునే ముగ్గుల పండుగ. ముఖ్యంగా రైతులు పండించిన పంటను తమ ఇంటి ముందర చూసుకుని మురిసిపోయే పండుగ. కానీ రైతు మురిసి పోయేంతగా తనని ఆదుకోవటం లేదు పంట. పంటపై పెట్టిన ఖర్చు రావటం లేదు. ఈ రోజు కూడా తెలంగాణలో ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడంటే పరిస్థితులు ఎంత దుర్భరంగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. పల్లెల్లోని పొలాల్లోకి పెట్టుబడి భూతం తన అడుగులు వేసింది. పంట నేల ఫాంహౌస్ క్షేత్రంగా మారిపోతున్నది. రియలెస్టేట్‌లో గజాల లెక్కన కొలవబడుతున్నది. బక్కచిక్కిన రైతు ఆశల్ని వొదులుకోలేక, భూమితో ఉన్న సంబంధాన్ని వీడలేక కొట్టుమిట్టాడుతూనే ఉన్నాడు. రైతు బాగున్ననాడే పల్లె బావుంటుంది. పల్లె బావుంటేనే పండుగ బావుంటుంది. పండగంటే సంవత్సర క్యాలెండర్‌లో వచ్చే తేదీకాదు. బతుకును భాగ్యవంతం చేసేది. మనసులో ఆనందాలు పూసేది.



కొత్త సంవత్సరం ఆదిలోనే సంక్రాంతి వస్తుంది. ఇది మార్పుకు నాంది. మారాలి. చాలా చాలా మారాల్సింది ముందరేవుంది. కానీ ఇప్పుడు మారుతున్నదంతా తిరోగమనంలో ఉంది. విద్వేషాలు పెరుగుతున్నాయి. విభజన వాదం పెచ్చరిల్లుతోంది. సమాజం చీలికకు గురవుతోంది. దేశంలో అత్యున్నత న్యాయస్థానమే అంటున్న మాటలివి. సమాజంలో సామరస్యానికి, సౌభ్రాతృత్వానికి పాటుపడాల్సిన మీడియా, ముఖ్యంగా ఛానళ్లు వాటికి విఘాతం కలిగిస్తున్నాయని సుప్రీంకోర్టు పరోక్షంగా సమాజంలో వెల్లువెత్తుతున్న విద్వేషాగ్నిని గురించీ, దాన్ని అరికట్టాల్సిన పాత్ర గురించీ వ్యాఖ్యానించింది. ఇక మన ఘనత వహించిన ఉపరాష్ట్రపతి పార్లమెంటు చేసే చట్టాలను కొట్టివేయడం, వాటిపై కలుగ చేసుకోవటం న్యాయస్థానాలు చేయరాదని, న్యాయస్థానాల ఉనికినీ అధికారాలనూ ప్రశ్నించాడు. కోర్టులను, వాద ప్రతివాదనలనూ, ప్రశ్నలనూ సహించలేని తనం పెరిగిపోతున్నది. పోయిన సంవత్సరం పదవీ విరమణ పొందిన ఉన్నతోద్యోగులు వందమంది ఈ విద్వేష ప్రసంగాలమీద, వాటిని అరికట్టటం మీద ప్రధానికి లేఖ రాయాల్సివచ్చింది అంటే, అసహనం ఎంతలా పెరిగిందో అర్థం అవుతుంది. దేశంలోని మైనారిటీ మతస్తులు మాకు లోబడి జీవనం సాగించాలని స్వయం సేవక దళాధిపతులు బహిరంగంగానే ప్రకటనలు ఇస్తున్నారు. ఇది మన భారతీయుల భిన్నత్వంలో ఏకత్వం అనే జీవన విధానాన్నే విచ్ఛిన్నం చేసే ఆలోచన.

పండుగనాడు కలిసి ఉండటం గురించి మాట్లాడుకుంటున్న సందర్భంలో విడగొట్టే విద్వేషాల పట్ల అప్రమత్తంగా ఉండటం కోసమే ఈ ప్రస్తావనలన్నీ. మనుషుల మధ్య విభేదాలను, విభజనలను తీసుకురావడం కోసం చేసే ఏ ప్రయత్నాన్నయినా ఎదుర్కోవాల్సిందే. ఎందుకంటే ఈ విభేదం, విద్వేషం మన ముందరకే వస్తుంది. పండుగనాడు ఇంటిల్లిపాదిమి కలిసిన సందర్భాన సామాజిక సవాళ్ల గురించి ఆలోచన చేయాలి. సామరస్యపూరిత సమాజంలోనే ఆనందం వెల్లివిరిస్తుందని గుర్తించాలి. సంఘంలో అసమానత అలజడి చోటుచేసుకుంటే, అందులో భాగమైన కుటుంబం సంతోషంగా ఉండలేదు. సామాజిక వైషమ్యాలలో పడిపోతే ప్రగతిని సాధించడం అసాధ్యమవుతుంది. అభివృద్ధి కుంటుపడుతుంది. జీవనం గతి తప్పుతుంది. ఇది చరిత్ర రుజువు చేస్తున్న సత్యం. అందుకే మానవీయ అనుబంధాలను నెలకొల్పే సమాజాన్ని కాంక్షించడానికి సంకల్పాన్ని పొందాల్సిన సందర్భమూ ఇదే. జీవితాలలోని బాధలను, వెతలను మరిచిపోవటం కాదు పండుగ. వాటిని తుడిచివేసేది నిజమైన పండుగ. అలాంటి సంక్రాంతులు అందరిలో కాంతి నింపాలని, సమతా శాంతులు వెలిగించాలని కోరుకుందాము.

"నీళ్ళు చల్లిన భూమి ముఖంపై రంగులు పూసిన నవ్వులు ఉదయించిన వాకిలి పండుగ. ఎన్నో ఆశల చెమట చుక్కల్ని ఏరి కుప్పేసుకున్న ధాన్యపురాశి పండుగ. మూగిన బాధల చీకట్ల ముంగిలిలో ధైర్యపు దివ్వెల ముగ్గులకర్ర పండుగ" అన్న కవి అభివ్యక్తిలా పండుగ సమాజ చైతన్యానికై మరో మేలు కొలుపు కావాలి.



నాటు నాటు


జంధ్యాల రఘుబాబు

నాటు నాటు అన్నది ఇప్పుడు ట్రెండుగా అంటే ఒక ధోరణిగా మారిపోయింది. నాటు, వీర నాటు, వీర వీర వీర నాటు... ఇలా దాని కొనసా... గింపులు సాగుతూనే ఉన్నాయి, ఉంటాయి. నాటుకానిది లేదు, నాటు అయితేనే నిలబడుతుందని డార్విన్ సిద్ధాంతాన్ని ఇంకోరకంగా చెప్పొచ్చు. ఆ సిద్ధాంతానికెలా వాడతారు అని రాద్ధాంతం చేసే నాటులూ బయలుదేరొచ్చు. లేటుగా వచ్చినా లేటెస్టుగా వచ్చిందన్నట్టు నాటుకూడా నాటెస్టుగా, నాటీయెస్టుగా వచ్చిందన్నది వాస్తవం. నాటు నాటు అంటూ నోటులెన్నో సంపాదించుకున్నారనీ, లోటు పూడ్చుకున్నారనీ అనేవాళ్ళూ ఉండొచ్చుగాని దేనికోసమైనా నాటు నాటు వెలుగులోకొచ్చింది చాలు.

నాటు కానిది ఫారం అని అర్థం చేసుకోవాలి. నాటు కోడికి ఫారం కోడికి ఎంతో తేడా. కాకులు దూరని కారడవిలో ఉన్న సింహానికి జూ పార్కులో ఉన్న సింహానికి కూడా అంతే తేడా ఉంటుంది. ఇప్పుడు రాజకీయం చేయాలంటే కూడా నాటుగా ఉండాలి. నాటు రాజకీయులు ఫారం రాజకీయులు అనుకోవచ్చు. అందుకే ఆ నాటులు వీరనాటులు ఎక్కడ ఉన్నా, ఎన్ని కేసులున్నా వాళ్ళని పట్టుకొచ్చి పార్టీ శాలువా కప్పేయడమే. ఎప్పుడో స్వాతంత్ర్యం వచ్చినప్పుడు ఈ 'ఫారం' నాయకులు ఉన్నారు కాని తరువాత లేరు అనుకోవచ్చు. కాని అప్పటి నాయకులు ఫారం వారిలా కనిపించినా, వాళ్ళు మన స్వాతంత్ర్యం తెచ్చే విషయంలో వీర నాటులని గుర్తుపెట్టుకోవాలి. అప్పటి నాటులకు ఇప్పుడు చూస్తున్న నాటులకు ఎంతో తేడా. నక్కకీ డాష్ డాష్ డాష్...

వైద్యుల్లో కూడా కోటు వైద్యులు నాటు వైద్యులు ఉంటారు. మందులు ఇచ్చే విషయంలోనే కాదు రోగం ఏదో కనిపెట్టడంలో కూడా నాటుకు కోటుకు తేడా ఉంటుంది. అయితే కరోనా లాంటివి వచ్చినప్పుడు ఎవరు ఎక్కువ సంపాదించారు అని కొందరు లెక్కలు తీస్తుంటారు. ఈ డాక్టర్లమీద అభాండాలు వేస్తుంటారు కూడా. తమ ప్రాణాలను కూడా లెక్క చేయకుండా వైద్యం చేసిన వాళ్ళు ఎందరో ఉన్నారు. ఆ సమయంలో ఏ వైద్యమూ చేయకుండా, ఏ వ్యాపారమూ చేయకుండా మిత్రులను పట్టుకొని కొన్ని బిల్లులు ఢిల్లీలో గట్టెంకించుకొని అపర కుబేరులైపోయిన వాళ్ళే అసలైన నాటు వ్యాపారస్తులు. జనాలు ఆ విషయం మరిచిపోతున్నారు.

నల్లకోటు నాటులూ మనకు కనిపిస్తుంటాయి. న్యాయం చేయవలసిన ఆ కోటులే ఒక్కోసారి ఆ పని చేయలేక సతమతమయ్యే సందర్భాలూ చూశాం.

ఈ నాటు అన్నింటిలోకి ప్రవేశించినట్టు క్రికెట్టులోకీ వచ్చేసింది. అరవై ఓవర్లు యాభైగా మారి ఆ తరువాత ఇరవై ఇరవైగా మారిపోయాయి. తక్కువ సమయంలో వీలైనంత నాటుగా ఆడి అందరినీ మెప్పించాలి. ఆ మెప్పించడం కోసం, వ్యాపారం చేసుకునే క్రమంలో క్రీడాకారులు దేశాలు మారి జట్లరూపంలో డబ్బును నాటునాటుగా సృష్టిస్తున్నారు. సంతలో అన్నీ దొరికినట్టు ఈ క్రీడాకారులూ రేటు రేటు అనుకుంటూ మాంచి ధరలకు పోతున్నారు. ఏమంటే నాటునాటు ట్రెండు మీ కర్థం కాదంటారు. అర్థమైనంతలో అర్థమైందేమిటంటే డబ్బు ఎలాంటి రూపాలు ధరిస్తుందనేది!! ఆర్థిక అర్థాలు మానవత్వానికి లేదు చోటు చోటు అనుకుంటూ జనాలని ఆడిస్తున్నది. కనబడని చేయి ఏదో నడుపుతుంది నాటకమని ఎప్పుడో ఓ కవి రాశాడు. అదేమిటో ఇప్పుడు అందరికీ అర్థమైపోయింది. ఆ నాటు డబ్బుకి జేజేలు కొట్టడమే మనుషులు చేయగలిగింది.

నాటు నాటు అంటే నాటో నాటో అనుకున్నారని, అందుకే దానికి అవార్డు వచ్చిందని వాట్సప్‌ల్లో జోకులు మొదలయ్యాయి. దీనికి ముందు ఎన్ని పాటలు రాలేదు, ఇప్పటికీ ఆ పాటలు వింటూనే ఉన్నారు. దీనికి ఇంత ఆర్భాటం చేయాలా అనీ కొందరంటున్నారు. అదంతా వేరే విషయం. ఎప్పటికప్పుడు మార్పులు వస్తూనే ఉంటాయి. కొత్తవి వస్తుంటాయి. అయినా నాటు నాటు గెలిచిందే కాని ఫారం ఫారం కాదని తెలుసుకోవాలి. దీనికి పేరడీగా నీటునీటు అనీ, బడ్జెట్ ప్రవేశ పెట్టినప్పుడు లోటు లోటు అనీ, ఎవరినన్నా మంత్రులను తీసేసినప్పుడు వేటు వేటు అనీ, మత్తు మందులు వాడొద్దని చెప్పడానికి చేటు చేటు అనీ ఇలా ఎన్నో ఎన్నెన్నో చెప్పుకోవచ్చు. అదీ నాటు పవరంటే.

ఇక నాటు పేరు చెప్పి నేను అలాగే మాట్లాడతాననీ, ఇంకేదో రాష్ట్రంలో చేయడానికి చేతకాని పనులన్నీ ఇక్కడ చేసేస్తాననీ, కేటు కేటు మాటలు చెప్పి ప్రజలకు చేటు కాలం తెచ్చేవాళ్ళంటే కూడా ఓ కంట కనిపెట్టి చూస్తూ ఉండాలి.

అసలు నాటు అంటే నాట్లువేసే రైతు గుర్తుకు రావాలి. రైతులు చలిలో వణికి, వానలో తడిసి, ఎండలో ఎండి పండించడమే తెలిసినవాళ్ళని అనుకునేవాళ్ళం. అదే వాతావరణాలలో సంవత్సరం పొడుగునా సమ్మె చేస్తే కనీసం పలకరించని వాళ్ళు కూడా ఇప్పుడు రైతు పక్షాన మాట్లాడుతుంటే వీళ్ళు మహా నాటైపోయారని తెలుస్తూనే ఉంటుంది. రైతులు పండించిన గింజలను గ్రేడింగ్ చేసి తమ బ్రాండు పేరు వేసుకునే వాళ్ళు కోకొల్లలు. వ్యాపారంలో వీళ్ళు వీర నాటులు.


నాటును మించిన నాటైన దీటైన కోళ్ళతో పందెం పోటీలు జరగకూడదని చట్టాలున్నా జరుగుతూనే ఉంటాయి. ఎన్నికల్లో నిలబడే నాయకుల ఖర్చులు ప్రకటించడం కూడా ఈ కోడి పందేలలాంటిదే. అందుకే అందరికీ నాటు నాటు, నీటు నీటు సంక్రాంతి శుభాకాంక్షలు....

సెల్: 9849753298

న్యాయవ్యవస్థపై దాడి వెనక కుట్ర


> న్యాయమూర్తుల నియామక ప్రక్రియను ఇప్పటికే కేంద్రం ఎలా ప్రభావితం చేస్తున్నదో, తనకు నచ్చనివారిని తొక్కిపట్టడానికీ, కావాలనుకున్న వారిని రుద్దడానికి నానా వ్యూహాల ఎలా అనుసరిస్తున్నదో సుప్రీం కోర్టు సాక్షిగానే వెల్లడైంది. అది చాలక ఇప్పుడు నేరుగా ఉపరాష్ట్రపతి కూడా దాడికి దిగడం దారుణం, అప్రజాస్వామికం. ఇటీవలి కాలంలో జస్టిస్ అరుణ్‌మిశ్రా, జస్టిస్ రంజన్ గోగోయ్ వంటివారు నేరుగా ప్రధానిని పొగిడి తరించడం, పదవీ విరమణ తర్వాత కొత్త పదవులు తెచ్చుకోవడం చూస్తున్నాం. సుప్రీంకోర్టు అధికార న్యాయస్థానంగా మారిపోయిందనే విమర్శలూ విన్నాం. దాన్ని కొంతైనా చక్కదిద్దడానికి స్వతంత్రతతో నిలదొక్కు కోవడానికి ప్రయత్నం మొదలవగానే ఏలినవారు కన్నెర్ర చేస్తున్నారు.

అత్యున్నత న్యాయవ్యవస్థ స్వతంత్రప్రతిపత్తికి వ్యతిరేకంగా ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్ నిరంతరం మాట్లాడేతీరు అత్యంత ఆభ్యంతరకరంగానూ ఆందోళన కరంగానూ తయారైంది. స్వతహాగా సీనియర్ న్యాయవాది అయిన ఆయన ఇవేవీ అమాయకంగానో వ్యక్తిగతంగానో మాట్లాడటం లేదు. దేశంలో రాజ్యాంగ రీత్యా ద్వితీయ స్థాయిలో ఉన్న ధన్కర్ రాజకీయకోణం పశ్చిమ బెంగాల్ గవర్నర్‌గా ఉండి మమతా బెనర్జీ ప్రభుత్వానికి ప్రబల శత్రువుగా వ్యవహరించినప్పుడే స్పష్టమైంది. కాకుంటే మమత కూడా తక్కువ తినలేదు గనక పరస్పర ఘర్షణ కింద నడిచిపోయింది. ఇందుకు మెచ్చిన ప్రధాని తనను ఏకంగా ఉపరాష్ట్రపతిని చేశారు. ఇందుకు తగినట్టే ధన్కర్ రాజ్యసభ చైర్మన్ బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలి ప్రసంగంలోనే సుప్రీం కోర్టుతీరుపై ధ్వజమెత్తారు. నేషనల్ జ్యుడిషియల్ అపాయింట్‌మెంట్స్ కమిషన్(ఎన్ జాక్) ఏర్పాటు చేస్తూ ఉభయసభలు చట్టంచేస్తే సుప్రీంకోర్టు ఎలా కొట్టివేస్తుందని, ఆ స్థానంలో జడ్జిలతో కూడిన కొలీజియం న్యాయమూర్తుల నియామకానికి సిఫార్సులు చేయడం ఏ విధంగా సమంజసమని తీవ్రంగా విమర్శించారు. ఈ విధంగా పార్లమెంటు శాసనాన్ని ఆపేసేట్టయితే ఇది ప్రజాస్వామ్య దేశమెలా అవుతుందని ప్రశ్నించారు. ఈ వ్యాఖ్యలకు ముందు తర్వాత కూడా న్యాయశాఖా మంత్రి కిరణ్ రిజిజు కొలీజియం వ్యవస్థపై దాడిచేస్తూనే ఉన్నారు. ఆఖరుకు సుప్రీం కోర్టు చిన్నా చితకా కేసులు, బెయిలు కేసులు విచారణ చేస్తూ సమయం వృథా చేయడం వల్లనే కేసులు పేరుకుపోతున్నాయని ఆరోపించారు. ఇందుకు సమాధానంగా సిజెఐ చంద్రచూడ్ మాకు ఏ కేసు ఎక్కువా కాదు, తక్కువా కాదు అని తేల్చిచెప్పారు. ప్రజల ప్రాథమిక హక్కులను స్వేచ్ఛను కాపాడటం కంటే తమకు గొప్ప బాధ్యతలేవీ ఉండబోవని స్పష్టం చేశారు. కొలీజియం సిఫార్సులపై ఎడతెగని జాప్యం(సిట్టింగ్‌ఓవర్), సమాచారమైనా ఇవ్వకపోవడం ఏమిటని మరో కేసులో సుప్రీం కోర్టు ప్రశ్నించింది. కొలీజియం సిఫార్సులు ఆపడమే గాక కేంద్రం తనుగా పదిమందికి పైన పేర్లను జడ్జిల నియామకం కోసం సిఫార్సు చేసిందని వెల్లడించింది. వీటిపై వ్యాఖ్యానానికి నిరాకరించింది. మరోవైపున కేంద్ర న్యాయవాది కొలీజియం పంపినపేర్లను తప్పక పరిశీలించి సత్వర నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. కేంద్రం నుంచి వస్తున్న వత్తిడిని తట్టుకోవడమే గాక కొంతవరకూ గట్టిగా వ్యవహరించడం వల్లనే ఈ మాత్రం దిగివచ్చారని పరిశీలకులు న్యాయనిపుణులు అభిప్రాయపడ్డారు.


తెలకపల్లి రవి

రాజ్యాంగ మౌలిక స్వభావం

అయితే ఏదో మెరుగవుతుందనే అంచనాలు వమ్ము చేస్తూ జగదీప్ ధన్కర్ న్యాయవ్యవస్థపై మరో పిడుగు వేశారు. రాష్ట్రాల చట్టసభల సభాపతుల సమావేశం ప్రారంభోపన్యాసంలో మరోసారి సుప్రీం కోర్టుపై విరుచుకుపడ్డారు. ప్రత్యేకించి రాజ్యాంగ మౌలిక స్వభావానికి సంబంధించిన కేసు తీర్పు స్ఫూర్తికి విరుద్ధంగా మాట్లాడారు. పార్లమెంటు రాజ్యాంగ సవరణలు చేసినా అవి రాజ్యాంగ మౌలిక స్వభావానికి విరుద్ధంగావుంటే చెల్లవని చెప్పిన కేశవానంద భారతి(1973) తీర్పును వ్యతిరేకించారు. కొన్ని రిజర్వేషన్ సవరణలను, జ్యుడిషియల్ కమిషన్(ఎన్‌జాక్) బిల్లును సుప్రీం కోర్టు ఈ కారణంతోనే కొట్టేసింది. జ్యుడిషియల్ కమిషన్ సవరణ చట్టం బదులు కేంద్రం నియామకాల కమిషన్ చట్టం తెచ్చింది. ఇది విచారణలో ఉంది. ఇలాంటి తరుణంలో జగదీప్ ధన్కర్ ఇంత తీవ్రవ్యాఖ్యలు చేయడం యాదృచ్ఛికం కాదు. దేశ సార్వభౌమత్వం, ప్రజాస్వామ్యం, లౌకిక తత్వం, సమాఖ్య తత్వం, పార్లమెంటరీ ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, స్వతంత్ర న్యాయవ్యవస్థ వంటివి రాజ్యాంగ మౌలిక లక్షణాలు. రాజ్యాంగంలో ఉన్న హక్కులు స్వేచ్ఛలు విస్తరించడం తప్ప విఘాతం కలిగించ కూడదనేది మరో సూత్రం. వీటన్నిటిని అడుగడుగునా దెబ్బతీస్తున్న మోడీ ప్రభుత్వానికి ఈ తీర్పు కంటకంగా ఉండటంలో ఆశ్చర్యం లేదు. అయితే ఆ మాటలు రాజ్యాంగ పదవుల్లో ఉన్న వారి ద్వారా సభాపతుల ద్వారా చెప్పించడం ఒక వ్యూహం.



చట్టసభలు, కార్యనిర్వాహకవర్గం, న్యాయ వ్యవస్థ మూడు అంగాలు. వీటిలో దేనికది స్వతంత్ర ప్రతిపత్తి కలిగివుంటుంది. అదే సమయంలో ఎవరైనా రాజ్యాంగ పరిధిలోనే పనిచేయవలసి ఉంటుంది. 368వ అధికరణం రాజ్యాంగ సవరణ హక్కు పార్లమెంటుకు ఇస్తుంది. కొన్నింటికి రాష్ట్రాల ఆమోదం కూడా కావాలి. కొన్నింటికి పార్లమెంటు ఉభయసభల ఆమోదం చాలు. ఏది ఏమైనా రాజ్యాంగ పరిధిలోనే సవరణలుండాలి. 1973లో కేశవానంద భారతి తీర్పు వచ్చినా 1975లో రాజ్యంగం ద్వారానే ఇందిరాగాంధీ ఎమర్జన్సీ విధించారని మర్చిపోరాదు. ఆ సమయంలో 42వ రాజ్యాంగ సవరణ పేరిట దాన్ని పూర్తిగా మార్చి ఏకపక్ష రాజ్యానికి బాటవేసుకున్నారు. 1977లో దేశ ప్రజలు ఇందిరాగాంధీని ఓడించిన తర్వాత వచ్చిన జనతా ప్రభుత్వం వాటిని మళ్లీ మార్చి ఎమర్జన్సీ విధించే అవకాశాన్ని లేకుండా చేసింది. రాజ్యాంగంలోనే 13వ అధికరణం పౌరుల హక్కులను హరించే సవరణలు చెల్లబోవని చెబుతున్నది. కనుక కేశవానందభారతి కేసు తీర్పు కన్నా ముందే 13వ అధికరణం కూడా రాజ్యాంగ సవరణపై పరిమితులు విధిస్తున్నది. ఇక స్వతంత్ర న్యాయవ్యవస్థ అనేది కూడా రాజ్యాంగ మౌలిక లక్షణాల్లో ఒకటి. ఎప్పటికప్పుడు సుప్రీం కోర్టు కేంద్ర రాష్ట్రాల చర్యలు రాజ్యంగ బద్ధమా కాదా అనే పరిశీలన చేసి తీర్పులిస్తున్నాయి. అయోధ్య రామజన్మభూమి వివాదం వంటివాటిపై వేగంగా తీర్పులు వచ్చాయి. కొన్ని రకాల రిజర్వషన్లు, కేంద్రం వేసిన పన్నులు, రాష్ట్రాల హక్కులు, 370 రద్దు, మత మార్పిళ్లు, ఎన్నికల బాండ్లు, నదీజలాలు, శబరిమల్లై, కార్మిక చట్టాల సవరణ, ప్రభుత్వ సంస్థల ప్రయివేటీకరణ, జడ్జిల నియామక వ్యవస్థ తదితర అనేక కీలక కేసులు విచారణలోనే ఉన్నాయి. ఉదాహరణకు ఆంధ్రప్రదేశ్ రాజధాని విభజనకేసు తీసుకుంటే రాజ్యాంగ పరంగా రాజధాని నిర్ణయం మార్పు వంటి శాసనాలు చేసే అధికారం రాష్ట్రానిదా కేంద్రానిదా ఏవరికీ లేదా, అదైనా ఎన్ని సార్లయినా మార్చుకుంటూ పోవచ్చా వంటి అంశాలను సుప్రీం కోర్టు తేల్చవలసి ఉంటుంది. రాజ్యాంగ మౌలిక స్వభావం వీటికి కొలబద్ధగా ఉంటుంది. అందువల్ల కేశవానంద భారతి కేసు తీర్పును ఉపరాష్ట్రపతి తప్పు పట్టడం అర్థరహితం, అనుమతించరానిది.

గతంలోనే స్పష్టత

141వ అధికరణం ప్రకారం సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పులు అన్ని కోర్టులకూ ఆఖరుకు దానికి కూడా వర్తిస్తాయి. ఎన్‌జాక్‌పై కేసువిచారణ సందర్భంగా, జస్టిస్ ఎస్‌కెకౌల్ జస్టిస్ ఎఎస్ ఒకాలతో కూడిన ధర్మాసనం ఆ మాటే చెప్పింది. ఆ చట్టం కొట్టివేస్తూ గతంలో ఇచ్చిన కొలీజియం తీర్పు అమలులో ఉంటుందనీ, ఒకవేళ దాని స్థానంలో మరో కొత్త శాసనం తెచ్చినా అది కూడా సుప్రీం సమీక్షకు లోబడే ఉంటుందని న్యాయమూర్తులు స్పష్టం చేశారు. ఈ విషయం మీ ప్రభుత్వానికి తెలియజేయండని అటార్నీ జనరల్‌ను ఆదేశించారు. అయితే పార్లమెంటు చేసిన చట్టం కూడా సుప్రీం సమీక్షకు లోబడి ఉంటుందనే వాదన సరికాదని, ఒక వ్యవస్థపై మరొకటి పైచేయి అనడం చెల్లదని ఆయన వ్యాఖ్యానించారు, పైగా తాను కేశవానంద భారతి కేసులో తీర్పుపట్ల తనకు ఆమోదం లేదన్నారు. అంటే రాజ్యాంగం 368వ అధికరణం పార్లమెంటుకు సవరణహక్కు ఇస్తున్నా అది పరిమితులు లేనిది కాదనీ సుప్రీం సమీక్షకు లోబడే ఉంటుందని ఇప్పటివరకూ ఉన్న అభిప్రాయాన్ని తోసిపుచ్చుతున్నారన్నమాట. ఇది కేవలం పరస్పర తనిఖీ కోసం నియంత్రణ కోసం చేసుకున్న ఏర్పాటు(చెక్స్ అండ్ బాలన్సస్) తప్ప ఒకవ్యవస్థ అధికారాలు లాక్కోవడంకోసం కాదని కూడా కేశవానంద భారతి కేసు తీర్పు పేర్కొంటున్నది. దీనివల్ల సుప్రీం కోర్టుదే చివరి మాట అవుతుందనుకోవడానికి ఆధారమేమీ లేదని కూడా స్పష్టం చేసింది. ఇదేదో చట్టసభల అధికారంతో తలపడటానికి గాక, ఉన్న రాజ్యాంగాధికారాలను సవ్యంగా వినియోగించు తకోవడంలో సహకరించు కోవడానికేనని 1952లోనే సిజెఐ పతంజలి శాస్త్రి స్పష్టత ఇచ్చివున్నారు. 2015లో ఎన్‌జాక్‌పై తీర్పులో సిజెఐ జెఎస్‌ఖేకర్ పునరుద్ఘాటించారు. ముందే చెప్పుకున్నట్టు ఎమర్జన్సీలో 42వ రాజ్యాంగ సవరణ దుర్వినియోగాన్ని అందుకే సరిచేయవలసి వచ్చిందని గుర్తు చేశారు. రాజ్యాంగ సవరణ అధికారం మౌలిక స్వభావానికి లోబడి ఉందో లేదో సమీక్షించవలసిన బాధ్యత అందుకే వస్తుందన్నారు. కనుక న్యాయమూర్తుల నియామక ప్రక్రియను ఇప్పటికే కేంద్రం ఎలా ప్రభావితం చేస్తున్నదో, తనకు నచ్చనివారిని తొక్కిపట్టడానికీ, కావాలనుకున్న వారిని రుద్దడానికి నానా వ్యూహాల ఎలా అనుసరి స్తున్నదో సుప్రీం కోర్టు సాక్షిగానే వెల్లడైంది. అది చాలక ఇప్పుడు నేరుగా ఉపరాష్ట్రపతి కూడా దాడికి దిగడం దారుణం, అప్రజాస్వామికం. ఇటీవలి కాలంలో జస్టిస్ అరుణ్‌మిశ్రా, జస్టిస్ రంజన్ గోగోయ్ వంటివారు నేరుగా ప్రధానిని పొగిడి తరించడం, పదవీ విరమణ తర్వాత కొత్త పదవులు తెచ్చుకోవడం చూస్తున్నాం. సుప్రీంకోర్టు అధికార న్యాయస్థానంగా మారిపోయిందనే విమర్శలూ విన్నాం. దాన్ని కొంతైనా చక్కదిద్దడానికి స్వతంత్రతతో నిలదొక్కు కోవడానికి ప్రయత్నం మొదలవగానే ఏలినవారు కన్నెర్ర చేస్తున్నారు. అన్ని ప్రతిపక్షాలు దీన్ని ఖండించడం హర్షనీయం. వివిధ వ్యవస్థల మధ్య సమతుల్యత, రాజ్యాంగ బద్ధత ఉండాలే గానీ మేము చేసిందే చట్టం అంటే కుదరదు. లౌకిక తత్వంపైన, భావప్రకటనా స్వేచ్ఛపైన, ప్రాథమిక హక్కులపైన ఆఖరుకు రాష్ట్ర ప్రభుత్వాలపైన కూడా దాడులు పెరిగిపోతున్న నేటి తరుణంలో ఇది మరీ ముప్పు. వ్యవస్థలకూ వ్యక్తులకూ కూడా సమస్త అధికారాలు రాజ్యాంగం నుంచే వస్తాయి. ఆ స్ఫూర్తికి అనుగుణంగా చట్టాలు ఉన్నాయా లేదా చూసే బాధ్యత అధికారం సుప్రీంకోర్టుదే తప్ప ముఖ్యమంత్రులు ప్రధాన మంత్రులది కాదు.

ప్రజాస్వామ్యమా వర్ధిల్లు...

> 'ప్రజలను అలక్ష్యం చేయడం కన్నా మించిన అపరాధం మరొకటి ఉండదు. మన పతనానికి అదో ముఖ్య కారణం. ప్రజలకు మంచి విద్య, జీవన సౌకర్యాలు కల్పించి, కడుపు నిండా తిండిపెట్టి వారి శ్రేయస్సుకు కృషి చేయనంత కాలం ఆ రాజకీయాలు నిష్ప్రయోజనాలు కాక మానవు' అని చెప్పిన స్వామి వివేకానంద మాటలు ఎక్కడో దూరంగా ఉన్న బ్రెజిల్ నేతలకే కాదు, ఇక్కడ భారతనేతలకూ వర్తిస్తాయి. ప్రజలకు మేలు చేయడంలోనే ప్రజాస్వామ్యం వర్థిల్లుతుంది.

ఆది నుండి ఆధిపత్యానికి - ప్రజాస్వామ్యానికి ఓ సాంస్కృతిక కేంద్ర వైరుధ్యం నెలకొని ఉంటుంది. ప్రజాస్వామ్యాన్ని జీవన విధానంగా మలచుకున్నవారు కుటుంబంలోనూ, సమాజంలోనూ నిరంకుశ పోకడల జోలికిపోరు. శ్రమ జీవులను గుర్తిస్తూ, గౌరవిస్తూ నిరంతరం బాధితుల పక్షానే నిలబడతారున. ప్రజాస్వామ్య పాలనా శకంలో జీవిస్తున్న మనకు ఇటీవల పెచ్చరిల్లుతున్న నియంత ధోరణులు ఆందోళన కలిగిస్తున్నాయి. ఆ ప్రమాద ఘంటికలు వినిపిస్తున్నాయి.


కె. శాంతారావు

నియంతల చుట్టూ చేరే మూర్ఖపు భజన రాయళ్ళకు, వారు చేపట్టే మూకదాడుల దౌర్జన్యానికి కొదవే ముంటుంది? తిమ్మిని బమ్మిని చేయడం, బమ్మిని తిమ్మిని చేయడమే వాళ్ళ పని.

మొన్నటికి మొన్న బ్రెజిల్ దేశంలో జరిగింది అదే. ప్రజల ఓట్ల బలంతో ఎన్నికల్లో గెలుపొందిన లూలా ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు, ఓడిపోయిన నియంత బొల్సినారో అనుచరగణం సృష్టించిన విధ్వంస కాండ అంతా ఇంతా కాదు. యావత్ ప్రపంచం దిగ్భ్రమకు లోనయింది. రాజధాని బ్రెసీలియాలోని పార్లమెంటు, అధ్యక్ష భవనం, సుప్రీంకోర్టులపై దాడులకు దిగింది. ఆ సమయంలో (జనవరి 8 మధ్యాహ్నం) లూలా వరద ప్రాంతాల్లో పర్యటిస్తూ బాధితులని పరామర్శిస్తున్నారు.

దాడుల గురించి తెలుసుకున్న లూలా తీవ్రస్థాయిలో మండిపడ్డారు. 'దేశ చరిత్రలో ఇదో చీకటి రోజు. ఫాసిస్టులు తప్పు చేస్తున్నారు' అంటూ ఆగ్రహం వ్యక్తం చేసారు. క్రమేపీ సద్దుమణిగినా నివురుగప్పిన నిప్పులా ఆ ప్రమాదం పొంచే ఉన్నది.

దేశవ్యాప్తంగా విధ్వంసం సృష్టించి, ప్రజలను భయభ్రాంతులను గావించేందుకే ఈ దాడులు జరిగాయని వేరుగా చెప్పక్కర్లేదు. ప్రజల తీర్పును గౌరవించకుండా తమ ఆధిపత్యాన్ని కొనసాగించే ఫాసిస్టుల దుష్టతలంపుగా పరిశీలకులు ఈ ఘటనలను అభివర్ణిస్తున్నారు.


రెండేండ్ల క్రితం అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో అప్పటి ట్రంప్ ఓటమి పాలైనప్పుడు కూడా ఇదే తంతు జరిగింది. ట్రంప్ అనుచర గణం కూడా వాషింగ్‌టన్ లోని పార్లమెంట్‌లో ఇలానే దాడి చేసింది. ఏమిటీ ఈ అప్రజాస్వామిక దాడులు? వాటి వెనుక ఉన్న రహస్య శక్తులు ఎవరు? ఎజెండా ఏమిటి? ఏ మూర్ఖత్వం ఇందుకు పనిచేస్తున్నది? ఇవన్నీ శోధిస్తున్న విషయాలు.

కొత్త సంవత్సరం ఆరంభం జనవరి 1న లూలా పదవీ ప్రమాణం చేయనున్నారు. ఇది తెలిసీ రెండ్రోజుల ముందే, ఓడిన బోల్స్‌నారో అమెరికా చెక్కేసాడు. హుందాగా ప్రవర్తించలేదు. కొత్త అధ్యక్షునికి అధికార దండాన్ని అందించే సంప్రదాయాన్ని పాటించలేదు. మొఖం చాటేసాడు. ఇదంతా ఓటమిని జీర్ణించుకోలేక పోవడమే.

'తానంటూ తిరిగి అధికారంలోకి రాకపోతే, ఎన్నికల్లో మోసం జరిగినట్లేనని' గతంలోనే బొల్సినారో పదే పదే ప్రకటించాడు. అంటే ఓడిపోతానని తెలిసినా, ముందుగానే సమర్థింపు చర్యలకు పాల్పడటం, అనుచరణ గణానికి మూకదాడుల సంకేతాలివ్వడం పథకం ప్రకారమే సాగినట్టు తెలుస్తున్నది. అనుచర గణంలో తెల్లవాళ్ళు, నల్లవాళ్ళు, సంపన్నులు, మధ్య తరగతివారు, అరాచకులు, ముఖ్యంగా సొంత బుర్రని ఉపయోగించనివారు ఉన్నారు.

కాగా, పార్లమెంటుపై దాడిచేసిన చర్యలతో తన కెలాంటి సంబంధం లేదని బోల్సనారో నిసిగ్గుగా చేతులు దులుపుకుంటున్నారు. వాస్తవాలను అంగీకరించని ఫాసిస్టు నాటకం అంటే ఇదే మరి. రాజకీయ ప్రత్యర్థులను దుర్మార్గులుగా చిత్రీకరించడం, ఓడిపోతే అల్లకల్లోలం సృష్టించడం ఫాసిస్టుల పని. మూకదాడులు, విధ్వంసక చర్యలు పథకం ప్రకారమే జరుగుతున్నట్టు వాట్సప్, టెలిగ్రామ్ మెస్సేజ్‌లతో సోషల్ మీడియా కోడైకూస్తున్నది ఒక ప్రక్క.

లూలా సాధారణ నాయకుడు కాదు. శ్రామిక జన పక్షపాతి. గతంలో రెండుసార్లు దేశాధ్యక్షునిగా



పనిచేసి రెండున్నర కోట్ల మందిని పేదరికం నుండి విముక్తి చేసాడు. ఆ దేశ జనాభా 22 కోట్ల మంది అంటే పదిశాతం ప్రజానీకం పేదరికం నుండి బయటపడ్డారు. అందుకే మితవాద బూర్జువా శక్తులన్నీ లూలా పై కత్తిగట్టిన విషయం కాదనలేం. లూలాపై ఆశక్తులు అవినీతి ముద్రవేసి ఎప్పటికీ అధికారంలోకి రాకుండా చేయాలనే వారి పాచిక ఇప్పుడు నెరవేరలేదు.

బొల్సినారోకు ట్రంప్ ఆదర్శం. సైనిక నియంతృత్వంపైనే మక్కువ ఎక్కువ అని పరిశీలకులు చెబుతున్నారు.

దక్షిణ అమెరికా ఖండంలోనే అతిపెద్ద దేశం బ్రెజిల్. విస్తీర్ణంలో రష్యా, కెనడా, చైనా, అమెరికా తర్వాత స్థానం బ్రెజిల్‌దే. ప్రపంచంలోనే ఐదవ పెద్ద దేశం. మూడవ సారి అధ్యక్ష పీఠం అధిష్టించిన లూలా జనవరి 1న ప్రమాణస్వీకారోత్సవం నాడే ముఖ్యప్రకటన చేసాడు.

దేశంలో విచ్చలవిడిగా కొనసాగుతున్న తుపాకుల సంస్కృతిని కట్టడి చేస్తానని, తమ దేశ అమెజాన్ అడవుల్లో సాగే విచక్షణారహిత బంగారు గనుల త్రవ్వకాన్ని అడ్డుకుంటానని చెప్పాడు.

తుపాకుల మరణాల్లో బ్రెజిల్ ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉన్నది. సగటున ఏడాదికి తుపాకుల కాల్పుల్లో నలభైవేల మంది మరణిస్తున్నారు. ప్రస్తుతం మూడింట రెండొంతుల మంది తుపాకీ సంస్కృతి వ్యతిరేకిస్తూ శాంతిని కోరుకుంటున్నట్టు అక్కడి సర్వేలు తెలుపుతున్నాయి. ఇదో మంచి మార్పు.

అలాగే అమెజాన్ అటవీ ప్రాంతం అరవై శాతం బ్రెజిల్ దేశంలోనే ఉన్నది. పచ్చని పర్యావరణంతో పదిశాతం ప్రాణవాయువు (ఆక్సిజన్) ఇక్కడి నుండే ప్రపంచానికి అందుతుంది. గనుల త్రవ్వకంతో కాలుష్యం ఏర్పడి పర్యావరణానికి ప్రమాదం అని వేరుగా చెప్పక్కర్లేదు. ప్రపంచంలో ఇరవైశాతం బంగారం ఈ గనుల నుండే ఉత్పత్తి అవుతుంది. అందుకే లూలా మాటలు ఫాసిస్టు దోపిడీ శక్తులకు మింగుడుపడటం లేదు. ఇప్పుడు ఈ శక్తులు బాహాటంగానే, రాజ్యాంగ విధి విధానాలను లక్ష్యపెట్టకుండా ప్రజా స్వామ్యంపైనే ఏకంగా దాడి చేస్తున్నాయి. మూర్ఖపు మూకదాడులను అందుకు ఉత్పత్తి చేసుకుంటున్నాయి. ప్రజలపై రాజ్యాంగ సంస్థలపై ఉసికొల్పుతున్నాయి.

ఓడినా, గెలిచినా తమ ఆధిపత్యమే నెగ్గాలనే నిరంకుశ ధోరణి ఇది. ప్రజాతీర్పును గౌరవించాలనే కనీస రాజకీయ పరిణిత స్పృహ వారికి ఉండదు. ప్రజల మానప్రాణాలకు పూచిక పుల్లంత విలువ నివ్వరు. అందుకే ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రజాపోరాటమే శరణ్యం. ఎక్కడైనా...

'ప్రజలను అలక్ష్యం చేయడం కన్నా మించిన అపరాధం మరొకటి ఉండదు. మన పతనానికి అదో ముఖ్య కారణం. ప్రజలకు మంచి విద్య, జీవన సౌకర్యాలు కల్పించి, కడుపు నిండా తిండిపెట్టి వారి శ్రేయస్సుకు కృషి చేయనంత కాలం ఆ రాజకీయాలు నిష్ప్రయోజనాలు కాక మానవు' అని చెప్పిన స్వామి వివేకానంద మాటలు ఎక్కడో దూరంగా ఉన్న బ్రెజిల్ నేతలకే కాదు, ఇక్కడ భారతనేతలకూ వర్తిస్తాయి. ప్రజలకు మేలు చేయడంలోనే ప్రజాస్వామ్యం వర్థిల్లుతుంది.

సెల్: 9959745723



సంక్రాంతికి స్వాగతం

వాకిళ్ళు చిమ్మి, కళ్లాపి చల్లి,
ఒంటిని వింటిగా చేసి,
తెల్లని పిండిని
వేళ్ళ సందుల్లోంచి
చుక్కలుగా జాలువార్చి,
నిండుగ చుక్కలతో
పుడమి ఎదపై
మెలికలు తిరిగే రేఖలతో
సప్తవర్ణాలనద్ది
పసుపు కుంకుమలను
వాయనంగా వసుధకిచ్చే
ముదితల కరపల్లవాల్లో
పురుడోసుకొనే రసరమ్యరూపాలై
ముంగిళ్ళలో కొలువుదీరుతూ,
హరివిల్లు నేలపై ఒదిగిందా
అన్నట్లుగా మనోభావాలకు
పట్టం కడుతూ,
ఇంతుల సృజనాత్మకతకు ప్రతీకలై
సంస్కృతి సంప్రదాయాల కిరవై
నయనానందకరమై
మనసులకు మరులు గొల్పుతూ
హృదయాలను అలరించే
రంగవల్లులు
స్వాగతం పలుకుతున్నాయి
ఈ సంక్రాంతికి...

వేమూరి శ్రీనివాస్
9912128967

విదేశాల నుండి 55,000 మందికి పైగా స్కౌట్లు, గైడ్‌లు, రోవర్లు, రేంజర్లు సమావేశమైన అంతర్జాతీయ సాంస్కృతిక జంబోరీలో తారే జమీన్ పర్ కూడా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ మూడు మొబైల్ ప్లానిటోరియంలను ఏర్పాటు చేసింది. ప్రతిరోజూ వేలాది మంది సందర్శకులను ఆకర్షించింది.

నక్షత్రాలను ఆమె నేలపై దించారు

నళిని అపరంజి... బెంగుళూరుకు చెందిన ఒక వినూత్న టెక్ స్టార్టప్. మారుమూల ప్రాంతాల పిల్లలకు సైన్స్‌ను దగ్గర చేసేందుకు మొబైల్ ప్లానిటోరియం స్థాపించారు. దానికి తారే జమీన్ పర్ అని పేరు పెట్టారు. 2018లో ఏర్పడిన ఇది శాస్త్రీయ సమాజాన్ని ఎంతో ఆకర్షించింది. ప్రస్తుతం కర్ణాటక, మహారాష్ట్ర మొదలుకొని జమ్మూ, కాశ్మీర్, లేహ్, లడఖ్, ఈశాన్య ప్రాంతాలలోని మారుమూల కొండ ప్రాంతాల వరకు అనేక పాఠశాలల పిల్లలు అక్షరాలా నక్షత్రాలను లక్ష్యంగా చేసుకుంటున్నారు. ఆ విశేషాలేంటో మనమూ తెలుసుకుందాం...



నళిని అపరంజి తన భర్త దినేష్ బడగండితో కలిసి చేసిన ఆలోచన తారే జమీన్ పర్ (TZP) గా అవతరించింది. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు అంతరిక్షంలోకి పూర్తిగా లీనమయ్యే అనుభవాన్ని అందిస్తుంది. విద్యార్థులలో సైన్సు పట్ల ప్రేమ, నేర్చుకోవాలనే ఉత్సుకతను రేకెత్తించడం, సైన్సు కోర్సుల పట్ల అవగాహన కల్పించడం దీని లక్ష్యం. వారి తరగతి గదులలో ప్లానిటోరియంతో విద్యార్థులకు కాస్మోస్-నక్షత్రాలు, తోకచుక్కలు, గ్రహశకలాలు, బ్లాక్ హోల్స్ వంటి మరెన్నో అద్భుతాలను షార్ట్ ఫిల్మ్‌ల ద్వారా పరిచయం చేస్తారు. అంతేనా తారే జమీన్ పర్ ల్యాబ్ ఆన్ వీల్స్‌ను కూడా కలిగి ఉంది. ఇది విద్యార్థులను ఖగోళ శాస్త్ర ప్రాథమిక అంశాల పట్ల అవగాహన కల్పిస్తుంది. అలాగే వక్రీభవనం, ప్రతిబింబం, సౌరశక్తితో పాటు ఇతర అనువర్తనాల్లో ప్రయోగాల ద్వారా అనువర్తిత శాస్త్రాన్ని ప్రదర్శించడం దీని ముఖ్య ఉద్దేశం. 2018లో స్థాపించబడిన తర్వాత మహమ్మారి తెచ్చిన సవాళ్ల ఎదుర్కొంటూ దాదాపు రెండు సంవత్సరాల పాటు పాఠశాలలు మూసివేయబడినప్పటికీ తారే జమీన్ పర్ 6,500 పాఠశాలలను, 12 లక్షల కంటే ఎక్కువ మంది పిల్లలకు చేరుకోగలిగింది.

ఏకైక భారతీయ మహిళ

గత ఏడాది డిసెంబర్‌లో హైదరాబాద్‌లో జరిగిన TiE గ్లోబల్ సమ్మిట్‌లో గ్లోబల్ ఉమెన్స్ పిచ్ కాంపిటీషన్‌లో భాగంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న మహిళల పిచ్‌లను ప్రదర్శించారు. నళిని అపరంజి తారే జమీన్ పర్‌ను పోటీలో నిలిపి రూ. 30 లక్షల గ్రాంట్‌ను గెలుచుకున్న ఏకైక భారతీయ మహిళా పారిశ్రామికవేత్త. జమ్మూ, కాశ్మీర్, లేహ్, లడఖ్‌లలోకి ప్రవేశించినప్పుడు నళిని "మా బృందం మూడు మొబైల్ సైన్స్ ల్యాబ్‌లను, మా కొత్త ఉత్పత్తిని లడఖ్ విద్యా విభాగానికి పంపిణీ చేసింది. మేము బారాముల్లా, ఉరి, పుల్వామా పనున్, పల్లన్, హిర్రీ ట్రెహ్మా టాటూ గ్రౌండ్ శ్రీనగర్, శ్రీనగర్ ఆర్మీ క్యాంపస్ వంటి మారుమూల ప్రాంతాలను సందర్శించాము. భారత సైన్యం మాకు చాలా మద్దతు ఇచ్చింది".

మహమ్మారి తర్వాత

ఏదేమైనా ఈ జంట సైన్స్ విద్యను చెక్కుచెదరకుండా అందించడంపై దృష్టి సారిస్తుంది. వారి కంపెనీని వేర్వేరు దిశల్లో నడిపించే ఆలోచనలు మొదలుపెట్టారు. "మేము వెబ్‌నార్లు, ఆన్‌లైన్ వర్క్‌షాప్‌లను నిర్వహించడం ప్రారంభించాము. కర్ణాటక స్టేట్ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రమోషన్ సొసైటీతో పాటు వివిధ CSR ఏజెన్సీల ద్వారా నిధులు పొందాము. ఇది సైన్స్ కిట్‌లను కూడా పరిచయం చేసింది. 'స్పార్క్ ఆఫ్ క్యూరియాసిటీ' అనే కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ కిట్‌లు ఐదు నుండి పదవ తరగతి వరకు ఉన్న పాఠ్యప్రణాళిక ప్రకారం అనుకూలీకరించబడినవి. ఇవి ఆన్‌లైన్ తరగతులతో అనుబంధించబడ్డాయి. పాఠశాలలు తెరిచిన తర్వాత మేము క్విజ్‌లు, ఇతర అభ్యాస సెషన్‌లను నిర్వహించాము. ISRO, BARC నుండి శాస్త్రవేత్తల నుండి చర్చలను కూడా ఏర్పాటు చేసాము" అని నళినీ చెప్పారు.

వేలాది మంది...

మహమ్మారికి ముందు తారే జమీన్ పర్ ఆరు ప్లానిటోరియంలను విక్రయించింది. మహమ్మారి నెమ్మదిగా తగ్గుముఖం పట్టినప్పుడు అది సినోప్సిస్, L&T వంటి కంపెనీలతో భాగస్వామ్యాన్ని ఏర్పరచుకుంది. స్పందన విపరీతంగా ఉంది. మొబైల్ ప్లానిటోరియం లోపల ఉన్న ఉత్సాహం స్పష్టంగా కనిపిస్తుందని నళిని ఎత్తి చూపారు. "వారు మరింత కోరుకుంటున్నారు. నిజాయితీగా తమ అభిప్రాయాన్ని తెలుపుతున్నారు. మేము మరిన్ని కాన్సెప్ట్‌లను పరిచయం చేయడానికి పని చేస్తున్నాము" అని ఆమె చెప్పారు. ఇటీవల దక్షిణ కన్నడలోని మూడబిద్రిలోని అల్వాస్ కళాశాల క్యాంపస్‌లో దేశవ్యాప్తంగా, అలాగే విదేశాల నుండి 55,000 మందికి పైగా స్కౌట్లు, గైడ్‌లు, రోవర్లు, రేంజర్లు సమావేశమైన అంతర్జాతీయ సాంస్కృతిక జంబోరీలో తారే జమీన్ పర్ కూడా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ మూడు మొబైల్ ప్లానిటోరియంలను ఏర్పాటు చేసింది. ప్రతిరోజూ వేలాది మంది సందర్శకులను ఆకర్షించింది. "దీని తర్వాత ఉత్పత్తి గురించి ఆరా తీస్తూ జార్ఖండ్, పంజాబ్‌తో పాటు ఇతర రాష్ట్రాల నుండి మాకు కాల్స్ వస్తున్నాయి" అని ఆమె చెప్పారు.



విభిన్న కంటెంట్

తారే జమీన్ పర్ వివిధ వయసుల వారికి 20 కంటెంట్ షోలను అందజేస్తుందని నళిని వివరించారు. ఉదాహరణకు 'భూమి, చంద్రుడు, సూర్యుడు, సౌర వ్యవస్థ, గ్రహాల కదలిక, పగలు, రాత్రి ఎలా జరుగుతాయి, గ్రహణాలు, భూమి నుండి గ్రహాలు ఎంత దూరంలో ఉన్నాయి ఇలా మరిన్నింటి గురించో మాట్లాడుతుంది. 'లైఫ్ సైకిల్ ఆఫ్ స్టార్' అంటే నక్షత్రాలు ఎలా పుడతాయి, వివిధ రకాల నక్షత్రాలు, అవి ఎలా చనిపోతాయి, బ్లాక్ హోల్ మొదలైనవాటిని చూపుతుంది. "మేము ఖగోళ శాస్త్రం, సైన్స్ కంటే ఎక్కువ బోధిస్తాము. మానవ శరీర నిర్మాణ శాస్త్రం, వారసత్వం, సంస్కృతిపై కూడా దృష్టి సారించాము. ఆవర్తన పట్టికను చూపే STEMకి సంబంధించిన ప్రదర్శనలను కలిగి ఉన్నాము. కాలుష్య నియంత్రణ ప్రాముఖ్యతకు సంబంధించిన కంటెంట్‌ను రూపొందించడానికి, వాతావరణ మార్పుల గురించి అవగాహన కల్పించడానికి మేము కాలుష్య నియంత్రణ బోర్డుతో చర్చిస్తున్నాము" ఆమె వివరించారు. ఇది ఇంగ్లీష్, హిందీ, కన్నడ భాషలలో ప్రదర్శించబడతాయి. వినికిడి, మాట్లాడే లోపం ఉన్నవారి కోసం సంకేత భాషలో కూడా ప్రదర్శించబడతాయి.



లాభాలను ఆర్జిస్తుంది

"విద్యార్థులు లోపల కూర్చుని స్క్రీన్‌ను చూస్తున్నారు. ఉదాహరణకు మూన్ ల్యాండింగ్ ప్లే చేయబడుతోంది. వారు అంతరిక్ష నౌకలో ఉన్నట్టుగా నక్షత్రాలు, అంతరిక్షంలో ప్రయాణిస్తున్నట్టు భావిస్తారు" ఆమె చెప్పారు. తారే జమీన్ పర్ మొబైల్ ప్లానిటోరియంలు, మొబైల్ సైన్స్ ల్యాబ్‌లు, సైన్స్ ఎగ్జిబిట్‌లు, సైన్స్ కిట్‌లు, టెలిస్కోప్‌లు, అనాటమీ కిట్‌ల వంటి సమలేఖన ఉత్పత్తుల విక్రయం ద్వారా ఆదాయం, లాభాలను ఆర్జిస్తుంది. వాటిని తయారు చేసి విక్రయిస్తాం. దీనికోసం ప్రైవేటు పాఠశాలలు ఒక్కో విద్యార్థి నుండి రూ.150 చొప్పున వసూలు చేస్తున్నాయి. ఒక రోజులో మేము 400-450 మంది విద్యార్థులను కవర్ చేస్తాము. CSRల కోసం, మేము CSR ఫండ్‌ల ద్వారా పాఠశాలలతో "స్పార్క్ ఆఫ్ క్యూరియాసిటీ" అనే ఏడాది పొడవునా కార్యాచరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తాం" అంటున్నారు నళిని.

మద్దతు ఇస్తాము

"మేము ఒక ఫ్రాంఛైజీ మోడల్‌లో కూడా పని చేస్తున్నాము. ఇక్కడ మేము మహిళా వ్యాపారవేత్తలను గుర్తించాము. వారు అన్ని గాడ్జెట్‌ల కోసం రూ. 50 లక్షల వరకు పెట్టుబడి పెట్టవచ్చు. ప్లానిటోరియం అనుభవంతో పాటు స్టాండర్డ్ 2 నుండి 9 వరకు అనుభవపూర్వక అభ్యాసన విద్యార్థులకు పోస్ట్-స్కూల్ సైన్స్ తరగతులను నిర్వహిస్తారు. మేము సాంకేతిక, మార్కెటింగ్, కంటెంట్ మద్దతు ఇస్తాము. ఆమె ఆదాయంపై 20శాతం కమీషన్ వసూలు చేస్తాము" అని చెప్పారు. ఉత్పత్తి స్వభావాన్ని బట్టి మూలధన పెట్టుబడి చాలా ఎక్కువగా ఉందని నళిని అంటున్నారు. తారే జమీన్ పర్ మొదటి రోజు నుండి లాభదాయకంగా ఉందని ఆమె చెప్పారు. వారు గతంలో కర్ణాటక ఐటీ డిపార్ట్‌మెంట్ వారి ఎలివేట్ 100 ప్రోగ్రామ్ నుండి రూ. 30 లక్షల గ్రాంట్‌ను గెలుచుకున్నారు. ప్రస్తుతం బాహ్య నిధుల కోసం చూస్తున్నారు. "మేము ప్లానిటోరియంలను ఐదేండ్ల కాలానికి రాష్ట్ర ప్రభుత్వాలకు అద్దెకు ఇవ్వగల మోడల్‌ను కూడా పరిశీలిస్తున్నాం. అయితే కార్యకలాపాలకు మేమే పూర్తి బాధ్యత వహిస్తాం" అంటూ నళిని తన మాటలు ముగించారు.

పండుగ వేళ కాస్త కొత్తగా...

పండుగల సందర్భంగా ఇంటిని శుభ్రం చేసుకుంటారు అందరూ. ఈ సమయంలో గృహాలంకరణలో కొన్ని మార్పులు చేసి చూడండి. ఇల్లంతా కొత్తగా కనిపించడమే కాదు, పండగ కళ ఉట్టిపడుతుంది. ఇందులో నిపుణులు చెప్పే చిట్కాలు ఏంటో తెలుసుకుందాం.

- గదుల్లోని కార్పెట్లు, సోఫా కవరు, డైనింగ్ టేబుల్, కుర్చీల కవర్లు అన్నీ ఒకే రకమైన వర్ణం, డిజైన్లను మ్యాచింగ్‌గా వేస్తుంటాం. అయితే ఈసారి కొంచెం మార్చి చూడండి. సోఫా కవర్‌కు భిన్నంగా కుషన్స్ కొన్నింటికి స్ట్రైప్స్, మరికొన్నింటికి పూల డిజైన్ల కవర్లను ఎంపిక చేయాలి. అలాగే డైనింగ్ టేబుల్‌పై వేసే క్లాత్ డిజైన్‌కు భిన్నంగా కుర్చీల కవర్లపై పూల ప్రింటు ఉంటే మంచిది. వీటన్నింటితో సంబంధం లేకుండా కార్పెట్ డిజైన్ ఉండేలా మార్చి చూడండి. గోడలకు పూల ప్రింట్లున్న ఫ్రేమ్స్, వీటి వర్ణానికి భిన్నంగా ఉండేలా లేతవర్ణం పూలనుంచిన ఫ్లవర్‌వాజ్ టీపాయిపై సర్దితే చాలు. గదికి కొత్త అందం వచ్చినట్టే.
- హాల్ లేదా ముందుగదిని చిన్నచిన్న వస్తువులతోనే కొత్తగా మార్చడానికి ప్రయత్నించొచ్చు. ముందుగా గోడకంతా ఒకే ఫ్రేం లేదా పెద్ద గడియారం వంటివి ఉంటే తాత్కాలికంగా వాటి స్థానంలో చిన్నచిన్న నలుపు, తెలుపు ఫొటోలుంచిన నాలుగైదు ఫ్రేంలను వరసగా సర్దాలి. మిగతా గోడను ఖాళీగా వదిలేయాలి. పుస్తకాల అలమరపై చిన్నచిన్న లేతవర్ణం పూల గుత్తులుంచిన ఫ్లవర్‌వాజ్ సర్దాలి. సోఫా ఎదుట టీపాయిపై చిన్నపరిమాణంలో తెలుపు వర్ణంలో అయిదారు సెట్‌గా ఉండే పింగాణీ లేదా గాజు ఫ్లవర్‌వాజ్‌లను సర్ది తలా ఒకదాంట్లో ఒకే ఒక లేత వర్ణం గులాబీని ఉంచితే చాలు. వీటి పక్కగా చిన్న గ్లోబ్ సర్దాలి. ఇలా చిన్న చిన్న అలంకరణలతోనే గదిని ప్రత్యేకంగా కనిపించేలా చేయొచ్చు.



- ఇంట్లో ఏదైనా గది గజిబిజిగా ఉంటే అక్కడ మనకి అసౌకర్యంగా అనిపిస్తుంటుంది. ఆ ప్రతికూల భావనలను ఎలా దూరం చేయొచ్చంటే.. బయటి వెలుతురు ప్రసరించేలా లేతవర్ణం కర్టెన్లు వేయాలి. ఉదయం, సాయంత్రం వేళల్లో సూర్య కిరణాలు గదిలోకి పడేలా కిటికీలను తెరిచి ఉంచాలి. గది మధ్యలో ముదురువర్ణం కార్పెట్ పరవడం మంచిది. ఫ్లోర్ సిట్టింగ్ కుషన్స్ ఏర్పాటుతోపాటు ఆకర్షణీయంగా కనిపించేలా ముదురువర్ణం కవర్లున్న దిండ్లు సర్దాలి. వీటికి ఓవైపు చిన్న నేలబారు టీపాయిలాంటిది అమర్చి, దీనిపై వెదురుతో చేసిన తొట్టెల్లో ఇండోర్‌ప్లాంట్స్‌తోపాటు ప్రశాంతంగా కనిపించే చిన్న బుద్ధుని విగ్రహం సర్దాలి. గది నాలుగుమూలల ఇండోర్ ప్లాంట్స్‌తోపాటు ఓవైపు లేతవర్ణం చిత్రలేఖనం ఫ్రేంను నేలపైనే గోడకు ఆనించాలి. ఇవన్నీ మనసుకెంతో ప్రశాంతతను అందిస్తాయి.

కేరళలో స్మార్ట్ తరగతి గదులు

- తద్వారా విద్యారంగంలో అంతర్జాతీయ నాణ్యత...
- 'బేటీ పఢావో - బేటీ బచావో' అందమైన నినాదాలు మాత్రమే...
- విద్యార్థులు రాజకీయాల్లోకి వస్తేనే సమాజ మార్పు
- నవతెలంగాణ ఇంటర్వ్యూలో కేరళ మాజీ మంత్రి కె.కె.శైలజ

మన దేశ విద్యారంగం ఘోరంగా ఉంది. స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేండ్లు గడుస్తున్నా ఇంకా గ్రామీణ ప్రజలు, పట్టణ పేదలు చదువుకు దూరంగానే ఉన్నారు. నూతన విద్యా విధానం పేరుతో మతోన్మాదులు దీన్ని మరింత ప్రమాదంలోకి నెట్టేసేందుకు ప్రయత్నిస్తున్నారు. దీనికి భిన్నంగా కేరళ రాష్ట్రం స్మార్ట్ తరగతులను అక్కడి విద్యార్థులకు పరిచయం చేయబోతున్నది. విద్యలో అంతర్జాతీయ నాణ్యతను తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నది. ఇలాంటి ఎన్నో విషయాలను కేరళ మాజీ మంత్రి, ప్రస్తుత ప్రభుత్వ విప్ కె.కె శైలజ టీచర్ నవతెలంగాణతో పంచుకున్నారు. రంగారెడ్డి జిల్లాలోని మన్నెగూడలో గత రెండు రోజుల పాటు జరిగిన టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర మహాసభల్లో పాల్గొనేందుకు హైదరాబాద్ నగరానికి విచ్చేసిన ఆమె నవతెలంగాణ ప్రతినిధి ఎస్.కె.సలీమాకు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే...



గతంలో మీకు ఉపాధ్యాయురాలిగా పనిచేసిన అనుభవం ఉంది. అలాంటి మీరు ప్రస్తుత దేశ విద్యారంగ పరిస్థితులను ఎలా విశ్లేషిస్తారు?

స్వాతంత్ర్యం తర్వాత మన దేశం ప్రజాస్వామ్య లౌకిక దేశంగా రూపొందించబడింది. రాజ్యాంగం ప్రజలందరికీ కొన్ని ప్రత్యేక హక్కులు ఇచ్చింది. విద్య మన దేశాభివృద్ధికి ఎంతో కీలకమని గుర్తించింది. అందుకే విద్యా వ్యవస్థలో కొన్ని మార్పులు తీసుకొచ్చింది ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం. అయితే అదంతా పెట్టుబడిదారులకు అనుకూలమైన విద్య విధానంగానే రూపొందించారు. జీడీపీలో కేవలం 6శాతం మాత్రమే విద్యకు కేటాయిస్తున్నారు. దేశ జనాభాకు అవసరమైనంత ఖర్చు చేయలేదు. ఫలితంగా ఇప్పటికీ మన దేశంలో విద్య చాలా మందికి అందుబాటులో లేదు. ముఖ్యంగా గ్రామీణ భారతం చదువుకు అత్యంత దూరంగా వుంది. అదే కేరళలో చూస్తే వంద శాతం అక్షరాస్యత సాధించాం. ఇది స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత అక్కడ పరిపాలించిన వామపక్ష ప్రభుత్వాల విధానాల ఫలితంగానే సాధ్యమయింది. ప్రస్తుతం కేరళలో విద్యారంగంలో మరిన్ని మార్పులు తీసుకొస్తున్నాం. అయితే దేశంలో పరిస్థితి దారుణంగా ఉంది. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మత ప్రభావం విద్యలో బాగా పెరిగిపోయింది. కొఠారీ కమిషన్ సూచనలను పక్కకు పెట్టేశారు. ప్రజాస్వామ్య, లౌకిక విలువలను తుంగలో తొక్కేశారు. కరిక్యులంలో విపరీతమైన మార్పులు తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. కర్నాటకలో ఈపాటికే అమలు చేయడం మొదలుపెట్టారు. చరిత్రను వక్రీకరిస్తున్నారు. ముస్లింలపై ద్వేషం పెంచేందుకు వారు చేసిన మంచిని తెలియజేసే పాఠ్యాంశాలను సిలబస్ నుంచి తొలగిస్తున్నారు. అలాగే అభ్యుదయ, వామపక్ష భావాలు కలిగిన పాఠ్యాంశాలను కూడా తీసేస్తున్నారు. మనదేశానిది భిన్న మతాలు, సంప్రదాయాలు కలగలిసిన మిశ్రమ సంస్కృతి. భిన్నత్వంలో ఏకత్వం అనే దాన్ని పక్కకు పెట్టి హిందూ దేశంగా మార్చేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. మైనార్టీలు, దళితుల పట్ల విద్వేషాలను రెచ్చగొడుతున్నారు. దీనికోసం విద్యను ఆయుధంగా చేసుకుంటున్నారు. ఈ కారణాలరీత్యా ప్రస్తుతం మన దేశంలో విద్యా వ్యవస్థ ప్రమాదంలో పడింది.

ఇప్పుడు సాంప్రదాయ కోర్సుల స్థానంలో వృత్తి విద్యా కోర్సులే (బీ.టెక్, ఎమ్.టెక్, మెడిసిన్ లాంటివి) ఎక్కువగా చలామణి అవుతున్నాయి. ఈ పరిస్థితి సమాజంపై ఎలాంటి ప్రభావం చూపుతున్నది?

కొత్త కొత్త ఆలోచనలతో యువత ముందుకు వస్తున్నారు. వారి కోరికలు, ఆలోచనలు గౌరవించాల్సిన అవసరం ఎంతో ఉంది. అయితే ఏదైనా ఒక సంస్కరణ తీసుకొస్తే అది వీలైనంత వరకు ఎక్కువ మందికి ప్రయోజనం చేకూర్చేలా ఉండాలి. ప్రస్తుతం టెక్నాలజీ ప్రాధాన్యం బాగా పెరిగింది. అయితే టెక్నాలజీని ఉపయోగించుకుంటూనే దేశంలో ఎక్కువ శాతంగా ఉన్న గ్రామీణ ప్రజలకు నష్టం కలిగించని విధానాలు పాలకులు తీసుకోవాలి. అభివృద్ధి పేరుతో చరిత్రను పక్కకు పెట్టేస్తున్నారు. ఇప్పటి బీజేపీ ప్రభుత్వం మరింత ప్రమాదంగా మారింది. ఏం చేసినా పెట్టుబడిదారుల కోసం మాత్రమే ఆలోచిస్తున్నది. దీని వల్ల యువత ఆలోచన ధోరణి పూర్తిగా మారిపోతుంది. మన పోరాటాల చరిత్రను మర్చిపోయి యువతను కేవలం యంత్రాలుగా తయారు చేసే ప్రయత్నం బాగా జరుగుతుంది.

కేంద్ర ప్రభుత్వం తెచ్చిన 'బేటీ పఢావో - బేటీ బచావో' వంటి నినాదాల అమలు తీరెలా ఉంది?

అందమైన నినాదాన్ని ఇచ్చారు. ఇది చెప్పుకోవడానికి, వినడానికి మాత్రం చాలా బాగుంది. అయితే ఇప్పుడు వారు తెస్తానంటున్న నూతన విద్యా విధానాన్ని పరిశీలిస్తే దీని వల్ల మొదట నష్టపోయేది ఆడపిల్లలే. అమ్మాయిలు చదువుకు దూరమయ్యే ప్రమాదం చాలా ఉంది. అలాంటప్పుడు బేటీ పఢావో - బేటీ బచావో నినాదానికి అర్థమేముంది. అంతేకాదు ఆడపిల్లలపై ఇటీవల కాలంలో లైంగిక దాడులు పెరిగిపోయాయి. పసి పిల్లలను కూడా వదలడం లేదు. మతోన్మాదులు గొప్పగా చెప్పుకుంటున్న మనుధర్మ శాస్త్రం కూడా మహిళలను కించపరిచేదే. అమ్మాయిని ఇంటికే పరిమితం చేయాలనే ఆలోచనలు బాగా పెరిగిపోయాయి. లింగ సమానత్వంపై బీజేపీ ప్రభుత్వానికి ఏ మాత్రం దృష్టి లేదు.

కేంద్రం తీసుకొస్తున్న నూతన విద్యా విధానంపై మీ అభిప్రాయం?

రాష్ట్రాలకు ఎటువంటి ప్రాధాన్యం లేకుండా చేయబోతున్నారు. పేదలకు ఉచిత విద్యను దూరం చేయబోతున్నారు. రిజర్వేషన్లు లేకుండా పోతాయి. ప్రభుత్వ రంగం మొత్తం ప్రమాదంలో పడబోతుంది. ముఖ్యంగా అమ్మాయిలు ఎక్కువగా స్కాలర్‌షిప్‌లపై ఆధారపడి చదువుకుంటారు. విద్యలో అయ్యే ఖర్చులో సబ్సిడీ ఉంటేనే ఆడపిల్లను చదివించడానికి తల్లిదండ్రులు ముందుకొస్తారు. లక్షలు ఖర్చుపెట్టి చదివించాలంటే ముందు అబ్బాయికి మాత్రమే ప్రాధాన్యం ఇస్తారు. కేంద్రం అమలు చేస్తానంటున్న నూతన విద్యా విధానం వల్ల ఇంకా ఇలాంటి ప్రమాదాలు ఎన్నో ఉన్నాయి. అందుకే ఆ విద్యా విధానాన్ని కేరళ ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది.

దేశ వ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో విద్యార్థి సంఘాల ఎన్నికలపై నిషేధం కొనసాగుతున్న నేపథ్యంలో దాని వల్ల ఉత్పన్నమయ్యే పరిస్థితులేమిటీ?

దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడంలో విద్యార్థుల పాత్ర కీలకం. ఆనాడు ఎంతో మంది విద్యార్థులు, యువత తమ ప్రాణాలు త్యాగం చేసి దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చారు. అప్పుడు వారికి రాజకీయాలు ఎందుకు అనుకుంటే మనకు అంత త్వరగా స్వాతంత్ర్యం వచ్చేదే కాదు. సాక్షాత్తూ గాంధీజీయే ఆనాడు విద్యార్థులను తరగతులు బహిష్కరించి బయటకు రమ్మని పిలుపునిచ్చారు. అలాంటిది ఇప్పుడు విద్యార్థులకు రాజకీయాలు వద్దంటున్నారు. విద్యార్థి సంఘాల ఎన్నికలను రద్దు చేశారు. ఇది విద్యార్థుల స్వేచ్ఛను హరించి వేయడమే కదా? మనది ప్రజాస్వామ్య దేశం. ఎవరి భావాలు వారు స్వేచ్ఛగా చెప్పుకోవచ్చు. కానీ ఎన్నికలను రద్దు చేసి ఆ స్వేచ్ఛను నేడు విద్యార్థులకు లేకుండా చేశారు. విద్యార్థులు రాజకీయాల్లోకి రాకుండా సమాజంలో మార్పు రావడం కష్టం. దీన్ని మన పాలకులు గుర్తించడం లేదు.

కేరళ రాష్ట్రం ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలు?

పినరయి విజయన్ నాయకత్వంలో 2016 - 2021లో ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్ర అభివృద్ధి కోసం నాలుగు మిషన్స్‌ను రూపొందించాం. అవి ఆరోగ్య మిషన్, విద్యా మిషన్, హౌసింగ్ లైఫ్ మిషన్ అలాగే హరిత కేరళ మిషన్. ఈ నాలిగింటిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం తన పనిని ప్రారంభించింది. వీటిలో ముఖ్యంగా విద్యా మిషన్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాం. బడ్జెట్‌లో ఎక్కువ శాతం నిధులు దీనికి కేటాయించాం. పాఠశాల భవనాలు, ప్రయోగశాలల నిర్మాణం మొదలుపెట్టాం. విద్యలో అంతర్జాతీయ నాణ్యత తీసుకురావాలనే నిర్ణయం తీసుకున్నాం. దీని కోసం ముందు ప్రైమరీ పాఠశాలల కోసం కోటి రూపాయలు, ఎలిమెంటరీ పాఠశాలలకు 2 కోట్లు, హైస్కూల్స్‌కు వాటి అవసరాలను బట్టి రూ.3 నుండి 5 కోట్లు కేటాయించాం. ఇక యూనివర్సిటీలకైతే వాటి అవసరాలకు ఎంతైతే కావాలో అంత ఖర్చు పెట్టాలని నిర్ణయించుకున్నాం. ప్రతి తరగతి గదిలో కంప్యూటర్, ఎల్ఇడీ స్క్రీన్‌లు ఏర్పాటు చేస్తున్నాం. ప్రస్తుతం 60 వేల స్మార్ట్ క్లాస్ రూములు నిర్మాణంలో ఉన్నాయి. ఈ రకంగా కేరళ విద్యా విధానంలో ముందుకు పోతున్నది. దేశానికే ఆదర్శనీయంగా ఉంది.

విశ్వవిద్యాలయాల్లో గవర్నర్ల జోక్యంపై మీ కామెంట్..?

గవర్నర్లు అంటే రాజ్యాంగం ప్రకారం నియమించబడేవారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడడంలో వారి పాత్ర ఎంతో కీలకమైంది. ఏదైనా నిర్ణయం తీసుకునే ముందు రాష్ట్ర ముఖ్యమంత్రి, కేబినెట్‌తో కూడా చర్చించి సమన్వయంతో నడిపించాల్సిన అవసరం ఉంది. కానీ మన దేశంలో పరిస్థితి దీనికి భిన్నంగా ఉంది.

పది లక్షలకు తగ్గొద్దు..

(మొదటిపేజీ తరువాయి)

మాజీ సీఎం అఖిలేశ్ యాదవ్‌ను, కర్నాటక మాజీ సీఎం కుమారస్వామిని కూడా కేసీఆర్ ఆహ్వానించారు. ముఖ్యమంత్రులందరూ 18న హైదరాబాద్ శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకుని అక్కడి నుంచి హెలికాప్టర్ల ద్వారా ఖమ్మం బయల్దేరి వెళతారు. కేరళ సీఎం పినరయి విజయన్ షెడ్యూల్ రీత్యా సాయంత్రం ఐదు గంటలకు నిర్వహించాల్సిన సభకు... మధ్యాహ్నం మూడు గంటలకే ప్రారంభించనున్నారు. బహిరంగ సభలో ఆయనే మొదటగా ప్రసంగిస్తారు. అనంతరం విజయన్ ఖమ్మం నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరి విజయవాడకు వెళతారు. అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో అదే రోజు సాయంత్రం తిరువనంతపురానికి చేరుకుంటారు. ఆయన వెంట సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం కూడా సభకు హాజరవుతారు. సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజాతోపాటు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు కూడా సభలో పాల్గొంటారు. రాష్ట్ర పర్యటన సందర్భంగా నలుగురు సీఎంలు హైదరాబాద్‌లోని నూతన సచివాలయాన్ని సందర్శిస్తారనే ప్రచారం కొనసాగినా... అందులో వాస్తవం లేదని ముఖ్యమంత్రి కార్యాలయ వర్గాలు తెలిపాయి. కొత్త సెక్రటేరియట్‌లోని సీఎం ఛాంబర్‌ను ఈనెల 18న ప్రారంభిస్తారనే ప్రకటనలు వెలువడినా... ఖమ్మం సభ నేపథ్యంలో అది వాయిదా పడింది.

కేరళ యూనివర్సిటీ చారిత్రక నిర్ణయం..

(మొదటిపేజీ తరువాయి)

హాజరులో రెండు శాతం మినహాయింపు ఇస్తున్నట్టు వెల్లడించింది. యూనివర్సిటీ రూల్ ప్రకారం.. ప్రతి విద్యార్థికీ తప్పనిసరిగా 75శాతం హాజరు ఉండాలి. పరీక్షలకు హాజరు కావాలంటే ప్రతి సెమిస్టర్‌లో ఈ హాజరు శాతం తప్పనిసరి. అయితే అటెండెన్స్ పర్సంటేజ్ తక్కువగా ఉన్న సందర్భంలో, మహిళా విద్యార్థినులకు మెన్‌స్ట్రేషన్ బెనిఫిట్‌ను క్లెయిమ్ చేసుకోవచ్చు. అంటే వీరికి మినిమం అటెండెన్స్ పర్సంటేజ్ 73 శాతానికి తగ్గినా ఫర్వాలేదు. ఈ విషయంపై యూనివర్సిటీ జాయింట్ రిజిస్ట్రార్ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. 'ఫీమేల్ స్టూడెంట్స్‌కు మెన్‌స్ట్రేషన్ బెనిఫిట్స్ కావాలనే అభ్యర్థనలను వైస్-ఛాన్సలర్ పరిగణనలోకి తీసుకున్నారు. ప్రతి సెమిస్టర్‌లో మహిళా విద్యార్థులకు హాజరు మినహాయింపు 2 శాతం మంజూరు చేయాలని ఆదేశించారు.

బీజేపీకి ఎదురులేదనుకుంటే పొరబాటే..

(మొదటిపేజీ తరువాయి)

ఎన్నికల్లో ప్రాంతీయ పార్టీలు డీఎంకే, సమాజ్‌వాదీ కీలకంగా వ్యవహరిస్తాయి. బీజేపీకి ఎదురునిలిచే పార్టీ లేదనే ఆలోచన సరైంది కాదు. అలాగే కాంగ్రెస్, ఎన్‌సీపీ, జేడీయూ కొత్త పొత్తులకు సిద్ధమవుతున్నాయి. మరోవైపు భారత్ విజన్‌ను అధికార బీజేపీ గణనీయంగా తగ్గించింది. ఈ సమయంలో బీజేపీకి ప్రత్యామ్నాయం లేకపోతే మంచిది కాదు. ఆ పార్టీకి బలంతోపాటు బలహీనతలున్నాయి. మిగతా పార్టీలు గట్టిగా ప్రయత్నిస్తే...గట్టి పోటీ ఇవ్వొచ్చు"అని అమర్త్యసేన్ అభిప్రాయపడ్డారు. పార్టీ బలహీనపడిందని కాంగ్రెస్ తనకు తానుగా భావిస్తోందన్నారు. దీంతో 2024 ఎన్నికల్లో కాంగ్రెస్ విజయంపై ఆయన అనుమానాలు వ్యక్తం చేశారు. అయినప్పటికీ భారత్‌లోని వివిధ వర్గాల విజన్‌ను కాంగ్రెస్ ముందుకు తీసుకెళ్లగలదని అన్నారు.

దేశంలో మెజార్టీ వాదాన్ని బలోపేతం చేసేందుకు, మైనార్టీల పాత్రను తగ్గించేందుకు పౌరసత్వ సవరణ చట్టాన్ని (సీఏఏ) మోడీ సర్కార్ తీసుకొచ్చిందని అమర్త్యసేన్ అన్నారు.

పారిశ్రామిక పురోగతికి సహకరించాలి

(మొదటిపేజీ తరువాయి)

బడ్జెట్ మంచి సందర్భమని సూచించారు. రాష్ట్రానికి న్యాయంగా దక్కాల్సిన నిధులు, ప్రాజెక్టులను కేటాయించాలని డిమాండ్ చేశారు. వివిధ శాఖల ద్వారా కేంద్ర ప్రభుత్వం అందించాల్సిన సహాయాన్ని ఆయన గుర్తుచేశారు. దేశంలోనే అతిపెద్ద టెక్స్‌టైల్ పార్క్‌తో పాటు ప్రపంచంలోనే అతి పెద్ద సింగిల్ ఫార్మా క్లస్టర్ హైదరాబాద్ ఫార్మాసిటీ వంటి వాటికి భారీగా మౌలిక వసతులను ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం మేక్ ఇన్ ఇండియా, ఆత్మ నిర్భర భారత్ వంటి నినాదాలు, విధానాలను బలంగా నమ్మితే, వాటిని నిజం చేయగలిగే శక్తి కలిగిన తెలంగాణ వంటి అభివృద్ధికాముక రాష్ట్రాలను కేంద్రం ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. గత ఎనిమిదేండ్లుగా ప్రతి బడ్జెట్ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి ప్రోత్సాహకంగా దక్కాల్సిన నిధులపై విజ్ఞప్తులు చేస్తున్నా ఆర్థిక సహాయమేమి అందలేదనీ, చివరి బడ్జెట్‌లో నైనా సానుకూలంగా స్పందించాలని విజ్ఞప్తి చేశారు. జహీరాబాద్‌లో ఏర్పాటుచేస్తున్న నిమ్జ్ ప్రాజెక్టు వ్యయం అంచనాలు రూ.9,500 కోట్లనీ, అందులో మౌలిక వసతుల కల్పన కోసం కనీసం రూ.500 కోట్లు కేటాయించాలని కోరారు. హైదరాబాద్ ఫార్మాసిటీ, జహీరాబాద్ నిమ్జ్ రెండు నోడ్స్‌కు రూ.ఐదు వేల కోట్లు అవసరమవుతాయనీ, అందులో కనీసం 50 శాతాన్ని ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ విజయవాడ పారిశ్రామిక కారిడార్‌లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం గుర్తించిన నోడ్స్ హుజూరాబాద్, జడ్చర్ల, గద్వాల, కొత్తకోటలకు రూ.ఐదు వేల కోట్లు అవుతుండగా, అందులో కనీసం రూ.1,500 ఈ ఏడాది వెచ్చిస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. టీఐఇఎస్ పథకం కింద జడ్చర్ల ఇండస్ట్రియల్ పార్కులో కామన్ ఎఫ్లూయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (సీఇటీపీ) ఏర్పాటు కోసం గ్యాస్ కేటాయించాలని డిమాండ్ చేశారు. ఆదిలాబాద్‌లో ఉన్న సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) యూనిట్‌ను పునరుద్ధరించాలనీ, హైదరాబాద్‌లో నేషనల్ డిజైన్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలనీ, కేంద్రం ఏర్పాటు చేయబోతున్న డిఫెన్స్ ఇండస్ట్రియల్ ప్రొడక్షన్ కారిడార్‌లో హైదరాబాద్‌ను చేర్చాలనీ, వరంగల్ కాకతీయ మెగా టెక్స్‌టైల్ అభివృద్ధికి రూ.500 కోట్లు మూలధనం ఇచ్చేందుకు వీలుందని గుర్తు చేస్తూ, ఈ బడ్జెట్‌లో రూ.300 కోట్లు ప్రకటించాలని కోరారు.

నవతెలంగాణ

బిజినెస్

డిమార్ట్ లాభాల్లో 7శాతం వృద్ధి

ముంబయి : డిమార్ట్ రిటైల్ చెయిన్ మాతృసంస్థ అవెన్యూ సూపర్‌మార్ట్స్ 2022 డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో 6.71 శాతం వృద్ధితో రూ.589 కోట్ల నికర లాభాలు ప్రకటించింది. 2021 ఇదే అక్టోబర్- డిసెంబర్ త్రైమాసికంలో రూ.552.53 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.9,217 కోట్లుగా ఉన్న రెవెన్యూ.. గడిచిన త్రైమాసికంలో 25.50 శాతం పెరిగి రూ.11,569.05 కోట్లకు చేరింది. 2022 డిసెంబర్ త్రైమాసికంలో అవెన్యూ సూపర్‌మార్ట్స్ వ్యయం 27.02 శాతం పెరిగి రూ.10,788.86 కోట్లుగా నమోదయ్యింది. 2021-22 డిసెంబర్ త్రైమాసికంలో రూ.8,493 కోట్ల వ్యయాలు చేసింది.

హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్‌కకు రూ.12,259 కోట్ల లాభాలు



ముంబయి : ప్రయివేటు రంగంలోని హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ 2022-23 ఆర్థిక సంవత్సరం డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో 18.50 శాతం వృద్ధితో రూ.12,259 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.10,342.20 కోట్ల లాభాలు నమోదు చేసింది. క్రితం క్యూ3లో బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) రూ.22.987 కోట్లకు చేరడంతో మెరుగైన ఆర్థిక ఫలితాలను సాధించగలిగింది. 2021-22 ఇదే క్యూ3లో రూ.18,443 కోట్ల ఎన్ఐఐ నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.26,627 కోట్లుగా ఉన్న రెవెన్యూ.. క్రితం క్యూ3లో 18.3 శాతం పెరిగి రూ.31,487.7 కోట్లకు చేరింది. 2022 డిసెంబర్ ముగింపు నాటికి బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు యథాతథంగా 1.23 శాతంగా నమోదయ్యాయి. నికర నిరర్థక ఆస్తులు 0.33 శాతంగా చోటు చేసుకున్నాయి. గడిచిన డిసెంబర్ త్రైమాసికంలో మొండి బాకీల కోసం రూ.2,806.4 కోట్ల కేటాయింపులు చేసింది. 2022 డిసెంబర్ 31 నాటికి బ్యాంక్ మొత్తం రుణాలు రూ.15.07 లక్షల కోట్లుగా, రూ.17.33 లక్షల కోట్ల డిపాజిట్లు నమోదయ్యాయి.

క్రిప్టో అంటేనే బూటకం

- వాటికి విలువ లేదు : ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత దాస్



ముంబయి : క్రిప్టో కరెన్సీ అంటేనే బూటకం, జూదం లాంటిదని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) గవర్నర్ శక్తికాంత దాస్ అన్నారు. ఆ కరెన్సీకి ఎలాంటి విలువ లేదని స్పష్టం చేశారు. అయితే.. వాటికి విలువ ఉన్నట్లుగా నమ్మిస్తున్నారన్నారు. శక్తికాంత దాస్ మీడియాతో మాట్లాడుతూ.. "ఏ ఆస్తికైనా, ఆర్థిక ఉత్పత్తికైనా అంతర్గత విలువ అనేది ఒకటి ఉండాలి. కానీ.. క్రిప్టోల విషయంలో అలాంటి విలువ ఏదీ లేదు. వీటి విలువ అంతా అభూత కల్పనే.. మన దేశంలో జూదం ఆడటానికి అనుమతి లేదు.. జూదాన్ని అనుమతించాలనుకుంటే క్రిప్టోలను జూదంగా పరిగణించాల్సి వస్తుంది. ఈ జూదాన్ని అనుమతించబోం. అలాంటి వాటి విస్తరణను నిషేధించాల్సిన అవసరం ఉంది. వాటి అనియంత్రిత వృద్ధికి అనుమతించినట్లయితే కేంద్ర బ్యాంకు అధికారాన్ని కూడా బలహీనం చేస్తుంది. అలాంటి క్రిప్టో కరెన్సీలను దేశంలో నిషేధించాల్సిందే." అని దాస్ పేర్కొన్నారు.

"క్రిప్టో కరెన్సీల వృద్ధిని ఎదుర్కొనేందుకు ఇటీవల ఆర్‌బిఐ ఇ-రూపాయి సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ (సిబిడిసి)ని పైలట్ పద్ధతిలో ఆవిష్కరించింది. ఈ సిబిడిసి అనేది డబ్బు భవిష్యత్ అని, దానిని స్వీకరించడం రవాణ, ముద్రణ వ్యయాలను ఆదా చేయడంలో సాయపడుతుంది. మారుతున్న టెక్నాలజీలకు అనుగుణంగా విధానాలు మార్చుకుంటూ బ్లాక్ చెయిన్ టెక్నాలజీకి క్రిప్టో అప్లికేషన్ల కారణంగా మద్దతు ఇవ్వాల్సిన అవసరం ఉందని కొంత మంది వాదిస్తున్న నేపథ్యంలో అలాంటప్పుడు ఆస్తికి అంతర్లీన విలువ ఉండాలి.. కానీ క్రిప్టోకు అంతర్లీన విలువ లేదు. క్రిప్టోలతో దేశ ఆర్థికవ్యవస్థ కుదేలయ్యే ప్రమాదం ఉంది." అని దాస్ పేర్కొన్నారు.

హైదరాబాద్‌లో ఎక్స్‌స్లిడ్ యూనిట్




ముంబయి : ప్యాకేజింగ్ ఉత్పత్తుల కంపెనీ ఎక్స్‌స్లిడ్ హైదరాబాద్‌లో తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. దక్షిణాదిలో తమ ఉత్పత్తులకు ఉన్న డిమాండ్ నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎక్స్‌స్లిడ్ వ్యవస్థాపకులు, ఎండి నితిన్ కల్లా ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దేశంలో సంఘటిత పల్లెట్ తయారీ సంస్థ తమదేనని నితిన్ పేర్కొన్నారు. ఇప్పటి వరకు 7 లక్షలకు పైగా ఈ ఉత్పత్తులను డెలివరీ చేశామన్నారు. అయితే నూతన ప్లాంట్‌ను ఎక్కడ, ఎంత మొత్తంలో ఏర్పాటు చేసేది ఆ కంపెనీ వెల్లడించలేదు. ఇప్పటికే ఈ సంస్థకు పంజాబ్, మహారాష్ట్ర, హర్యానాలో ప్లాంట్లు ఉన్నాయి.

పాల సేకరణ ధర పెంచండి

- తమిళనాడు పాల ఉత్పత్తిదారుల ధర్నా

చెన్నై : పశుగ్రాసం ధరలు విపరీతంగా పెరుగుతున్నందున పాల సేకరణ ధరలు పెంచాలని తమిళనాడు పాల ఉత్పత్తిదారుల సమాఖ్య డిమాండ్ చేసింది. గతేడాది నవంబరులో ప్రభుత్వ పాల సహకార సంఘం ఆవిన్ రైతుల నుండి సేకరించే పాలు ధరను లీటరుకు రూ.3 పెంచింది. ఆవుపాల ధరను రూ.35గా, గేదెపాలు ధరను రూ.44గా నిర్ధారించింది. రూ.10పెంచాలని పాల ఉత్పత్తిదారుల సమాఖ్య డిమాండ్ చేస్తోంది. పశువులకు వేసే గ్రాసం ధర 2019 నుండి 50శాతం పెరిగింది. ఇతర నిత్యావసరాల ధరలు కూడా గణనీయంగా పెరిగాయి. ఇలాంటి పరిస్థితుల్లో కేవలం రూ.3 పెంచడం సరికాదని తమిళనాడు పాల ఉత్పత్తిదారుల సమాఖ్య అధ్యక్షుడు మహ్మద్ అలీ అన్నారు. పొరుగున గల కేరళలో పాల సేకరణ ధర ఆవుపాలకు రూ.42గా వుంది. ఇది తమిళనాడు కంటే రూ.7 ఎక్కువ అని అన్నారు. పాల ధరను పెంచాలని డిమాండ్ చేస్తూ చెన్నైలోని ఆవిన్ ప్రధాన కార్యాలయం వద్ద తమిళనాడు పాల ఉత్పత్తిదారులు ధర్నా నిర్వహించారు. తక్షణమే ప్రభుత్వం సేకరణ ధరను పెంచి, సవరించిన ధరను ప్రకటించాలని కోరారు. పాలల్లో కొవ్వు శాతం తగ్గిందనే పేరుతో సేకరణ ధర రూ.2 లేదా రూ.3 తగ్గిస్తున్నారని ఆవిన్ ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ తెలిపారు.



టెక్ కంపెనీల్లో 30వేల తొలగింపులు

రెండేళ్లలో రోడ్డున పడ్డ ఉద్యోగులు

- కొత్త నియామకాలపై నీలినీడలు



హైదరాబాద్ : భారత టెక్ కంపెనీల్లో వేల ఉద్యోగాలు ఊడుతున్నాయి. గడిచిన రెండు ఏళ్లలోనే దాదాపు 30,000 మంది పైగా ఉద్యోగులను టెక్ కంపెనీలు తొలగించాయని అంచనా. కరోనా సంక్షోభానికి తోడు ఆర్థిక వ్యవస్థలో మందగమనం నేపథ్యంలో అనేక పెద్ద కంపెనీలు, స్టార్టప్‌లు సిబ్బందిని తొలగించడంతో పాటు కొత్త నియామకాలను స్తంభింపజేశాయి. ఈ విషయాన్ని 2019 నుంచి టెక్ ఉద్యోగుల తొలగింపునపై అధ్యయనం చేస్తున్న ఆన్‌లైన్ వేదిక లేఆఫ్స్.ఎఫ్‌వైఐ ఓ రిపోర్టులో వెల్లడించింది. ఆ వివరాలు.. 2020-2022 మధ్య కాలంలో ఓలా దాదాపు 2600 మంది ఉద్యోగులను తొలగించింది. ఈ క్యాబ్ అగ్రిగేటర్ వేదిక మే 2020లో 1,400 ఉద్యోగాలను లేదా 35 శాతం సిబ్బందికి కోత పెట్టింది. తాజాగా పునర్వ్యవస్థీకరణ పేరుతో మరో 200 మందిని ఇంటికి పంపించింది.

ఎడ్‌టెక్ కంపెనీ బైజూస్ గత రెండేళ్లలో 2,500 మందికి ఉద్వాసన పలికింది. ఉత్పత్తి, కంటెంట్, మీడియా, సాంకేతిక బందాల్లోని వారిని ఎక్కువ తొలగించింది. తిరువనంతపురంలోని టెక్నోపార్క్‌లోని తన కార్యాలయాన్ని కంపెనీ మూసివేయగా.. అక్కడి రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని.. బైజూస్ యాజమాన్యంపై ఒత్తిడి తేవడంతో తిరిగి అక్కడి ఉద్యోగులను వెనక్కి తీసుకుంది. మరో ఎడ్‌టెక్ కంపెనీ వైట్‌హాట్ జెఆర్ కూడా అధిక తొలగింపులు ఉన్న కంపెనీల జాబితాలో ఉంది. 2020-2022 మధ్య కాలంలో ఈ సంస్థ భారత్‌లోని తమ 2,100 ఉద్యోగులను తగ్గించినట్లు ప్రకటించింది. గౌరవ్ ముంజాల్ యొక్క అన్‌కాడెమీ గత రెండేళ్లలో 1,500 మంది ఉద్యోగులను తొలగించింది. ఫుడ్ డెలివరీ సంస్థ స్విగ్గీ తొలి రౌండ్‌లో 2020లో 1,100 మంది ఉద్యోగులను ఇంటికి పంపించింది. అదే సంవత్సరం జూలైలో రెండో రౌండ్‌లో మరో 350 మంది ఉద్యోగుల తొలగింపునకు పాల్పడింది. గత రెండేళ్లలో ఈ సంఖ్య 2,250కి చేరుకుంది. కరోనా దెబ్బతో ఓయో కంపెనీ 2019 నుంచి భారత్, చైనాలో తమ ఉద్యోగుల తొలగింపు ప్రక్రియను ప్రారంభించింది. గత నెలలో ఒక నివేదికలో కంపెనీ సేల్స్ విభాగంలో 250 మంది ఉద్యోగులను నియమించుకోవాలని పేర్కొన్నప్పటికీ.. మరోవైపు టెక్నాలజీ బృందంలోని 600 మంది ఉద్యోగులను తొలగించాలని యోచిస్తోంది. ఇటీవల అమెజాన్ ప్రపంచ వ్యాప్తంగా సుమారు 18,000 మంది ఉద్యోగులకు ఉద్వాసన పలకనున్నట్లు ప్రకటించింది. ఇందులో చాలా మందే భారత్‌కకు చెందిన వారు ఉన్నారని పలు రిపోర్టు పేర్కొంటున్నాయి. తొలగింపులపై కంపెనీ ఉద్యోగులకు ఇమెయిల్‌లు పంపడం ప్రారంభించినట్లు సమాచారం. ఇంతక్రితం ఈ సంస్థ భారత్‌లో వెయ్యి మంది ఉద్యోగులను పక్కన పెట్టింది. గడిచిన రెండేళ్లలో వేదాంతు, క్యూర్‌ఫిట్, మేక్‌మైట్రిప్, మీషో తదితర టెక్ కంపెనీలు వరుసగా 1,100, 920, 700, 650 చొప్పున ఉద్యోగులను తొలగించాయి. జొమాటో 620 మందిని, ఉబెర్, ఉడాన్‌లు వరుసగా 600, 530 మంది చొప్పున ఉద్యోగులకు ఉద్వాసన పలికాయి.

కొత్త నియామకాలకు దిగ్గజాల వెనుకడుగు

బెంగళూరు : దేశంలోని దిగ్గజ టెక్ కంపెనీలు నూతన నియామకాలపై వేచి చూసే దోరణీని అవలంభిస్తున్నాయి. ఎప్పుడూ లేని విధంగా 2022 డిసెంబర్ త్రైమాసికంలో అతి తక్కువ నియామకాలు చేపట్టాయి. గడిచిన ఈ త్రైమాసికంలో టిసిఎస్, విప్రో, ఇన్ఫోసిస్, హెచ్‌సిఎల్ తదితర నాలుగు దిగ్గజ టెక్ కంపెనీలు 5వేల మేర మందిని కొత్తగా తీసుకున్నాయి. ఇంతక్రితం సెప్టెంబర్‌తో ముగిసిన రెండవ త్రైమాసికంలో కొత్తగా 28,836 ఉద్యోగులను నియమించుకున్నాయి. ఇది మొదటి త్రైమాసికంలో ఆ కంపెనీలు జోడించిన దానిలో సగం కావడం గమనార్హం. గడిచిన డిసెంబర్ త్రైమాసికంలో దేశంలో టాప్ ఐటి కంపెనీ టిసిఎస్ కొత్తగా 2,197 మందిని, విప్రో 500 మందిని, ఇన్ఫోసిస్ 1600, హెచ్‌సిఎల్ 2,945 చొప్పున ఉద్యోగులను మాత్రమే తీసుకున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా చోటు చేసుకుంటున్న అనిశ్చితిని దృష్టిలో పెట్టుకుని ఐటి కంపెనీలు నూతన నియామకాల పట్ల వేచి చూసే దోరణీలో ఉన్నాయని ఆ పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి.

'పంతంగి'లో పోటెత్తిన వాహనాలు

రెండ్రోజుల్లో హైదరాబాద్-విజయవాడకు 1.24 లక్షల వాహనాలు




నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

సంక్రాంతి పండుగ సందర్భంగా కేవలం రెండ్రోజుల్లో హైదరాబాద్-విజయవాడ రూట్లోని పంతంగి టోల్‌ప్లాజా నుంచి 1.24 లక్షల వాహనాలు వెళ్లాయి. జనవరి 12న 56,500 వాహనాలు, 13న 67,500 కార్లు వెళ్లినట్లు రాచకొండ ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాస్ తెలిపారు. టోల్‌ప్లాజా వద్ద కిలోమీటరుకు పైగా వాహనాలు బారులు తీరాయి. పండుగ సందర్భంగా 90శాతం మంది వ్యక్తిగత వాహనాల్లోనే ప్రయాణం చేసినట్టు అధికారులు చెప్పారు. రెండ్రోజుల్లో 98వేలకు పైగా కార్లు హైదరాబాద్ నుంచి పంతంగి టోల్ గేట్ మీదుగా విజయవాడ వెళ్లినట్లు పోలీసుల లెక్కల్లో తేలినట్టు వివరించారు. హైదరాబాద్ నుంచి వరంగల్‌కు బీబీనగర్ టోల్ గేట్ మీదుగా శుక్రవారం 26వేల వాహనాలు వెళ్లగా, వాటిలో 18వేల కార్లు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వరంగల్ నుంచి హైదరాబాద్‌కు 13వేలకు పైగా వాహనాలు వచ్చినట్లు స్పష్టం చేశారు. హైదరాబాద్ సరిహద్దుల్లోని చౌరస్తాల్లో ట్రాఫిక్ రద్దీని నియంత్రించడానికి ప్రత్యేక చర్యలు తీసుకున్నామని ఆయన వివరించారు. టోల్ గేట్ల వద్ద ఆర్టీసీ బస్సులకు ప్రత్యేక మార్గాన్ని కేటాయించారు.

పురూలియా జిల్లాలో డీవైఎఫ్ఐ నేత కాల్చివేత

టీఎంసీ కార్యకర్తల దాష్టీకంపై ఆందోళనలు



కోల్‌కతా : పశ్చిమ బెంగాల్‌లోని పురూలియా జిల్లాలో డీవైఎఫ్ఐ నేతను తృణమూల్ కార్యకర్తలు కాల్చి చంపారు. పురూలియాలోని బందోన్ పోలీసు స్టేషన్ ఏరియా మకపోలి గ్రామంలో శుక్రవారం సాయంత్రం దుండగులు డీవైఎఫ్ఐ నేత కృష్ణపాద్ తుడుపై కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో తీవ్రంగా గాయపడిన కృష్ణపాద్‌ని సీపీఐ(ఎం) కార్యకర్తలు వెంటనే బంకూరా సామిలని మెడికల్ కాలేజీ ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ వెంటనే ఆపరేషన్ చేసినా ఫలితం లేకపోయింది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు ముగ్గురిని అరెస్టు చేశారు.

ఈ దుండగులకు తృణమూల్ కాంగ్రెస్ ఆశ్రయం కల్పించిందని సీపీఐ(ఎం) నేతలు విమర్శించారు. ఈ ఘటనపై పురూలియా జిల్లా సీపీఐ(ఎం) నేత మాట్లాడుతూ, శుక్రవారం సాయంత్రం ఏరియా కమిటీ సభ్యుడు కృష్ణపాద తుడు పార్టీ సమావేశం ముగించుకుని ఇంటికి తిరిగివస్తుండగా, మకపోలి మలుపు వద్ద దుండగులు కాల్పులు జరిపారని తెలిపారు. తుడు భుజం, చేతుల్లో మొత్తంగా మూడు బుల్లెట్లు తగిలాయని తెలిపారు. ఈ ఘటనపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. కృష్ణపాద్ పార్టీలో క్రియాశీల కార్యకర్త అని, ఇటీవల ఆ ఏరియాలో సీపీఐ(ఎం) కార్యకలాపాలను విస్తృతం చేసిన నేపథ్యంలో దారుణంగా హత్య చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.



ఆందోళన చేస్తున్న సీపీఐ(ఎం) కార్యకర్తలు

సీపీఐ(ఎం) కార్యకర్తల ఆందోళన

కృష్ణపాద్ తుడును హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ బంద్వాన్ నుంచి గలుడి వెళ్లే రహదారిలో కుచియా జంక్షన్‌ను సీపీఐ(ఎం) కార్యకర్తలు దిగ్బంధించారు. టీఎంసీ హత్యా రాజకీయాలను తిప్పికొట్టాలంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని నేతలు హెచ్చరించారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో సీపీఐ(ఎం) ఆధ్వర్యాన ఆందోళనలు నిర్వహించారు.

సేవ్ వైజాగ్ స్టీల్

- విశాఖలో భోగి మంటల వద్ద ప్రజ్వరిల్లిన 'ఉక్కు' నినాదం



భోగి మంట వద్ద సేవ్ వైజాగ్ స్టీల్ ఫ్లకార్డులు ప్రదర్శిస్తున్న కాలనీవాసులు

భోగి పండగ వేళ ఆంధ్రప్రదేశ్‌లోని ఉమ్మడి విశాఖ జిల్లాలో 'ఉక్కు' నినాదం మార్మోగింది. సంక్రాంతి వేడుకల్లో 'సేవ్ వైజాగ్ స్టీల్' పేరిట విస్తృతంగా కార్యక్రమాలు చేపట్టాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఇచ్చిన పిలుపును విశాఖ వాసులు అందిపుచ్చుకున్నారు. పౌర, ప్రజా, కాలనీ సంఘాలతోపాటు సీపీఐ(ఎం), సీఐటీయూ ఆధ్వర్యాన వాడవాడలా శనివారం భోగి మంటల వద్ద కార్యక్రమాలు నిర్వహించారు. ఒక్కో కట్టెనూ భోగి మంటలో వేస్తూ 'సేవ్ వైజాగ్ స్టీల్, విశాఖ ఉక్కును కాపాడుకుంటాం, విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు' అంటూ నినదించారు. కొన్నిచోట్ల ఫ్లకార్డులు ప్రదర్శించారు. మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఉక్కునగరం, గాజువాక పారిశ్రామిక ప్రాంతాల్లో సీఐటీయూ ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేపట్టారు.

మనీశ్ శిసోడియా కార్యాలయంపై సీబీఐ దాడులు..

న్యూఢిల్లీ: ఢిల్లీ డిప్యూటీ సీఎం మనీశ్ శిసోడియా కార్యాలయంపై సీబీఐ మరోమారు దాడులు చేసింది . లిక్కర్ స్కాం కేసు విచారణలో భాగంగా ఈ తనిఖీలు చేపట్టింది. ఢిల్లీ సెక్రటేరియట్‌లో తన కార్యాలయంలో సీబీఐ అధికారులు సోదాలు చేసినట్టు మనీశ్ శిసోడియా ట్విట్టర్ వేదికగా వెల్లడించారు. సీబీఐ అధికారులు శనివారం మరోమారు నా కార్యాలయానికి వచ్చారు.

వాళ్లకు స్వాగతం పలుకుతున్నా. వాళ్ల నా ఇంట్లో, ఆఫీసులో, బ్యాంకు లాకర్‌లో ఇదివరకే తనిఖీలు చేశారు. నా సొంత ఊరికి వెళ్లి కూడా విచారణ జరిపారు. కానీ వాళ్లకు ఏమీ దొరకలేదు. భవిష్యత్తులో కూడా ఏమీ దొరకదు. ఎందుకంటే నేను ఎలాంటి తప్పు చేయలేదు' అని సిసోడియా ట్విట్టర్‌లో రాసుకొచ్చారు.

సంక్రాంతి వేడుకల్లో తొక్కిసలాట..

- ఒకరు మృతి.. పలువురికి తీవ్ర గాయాలు



భువనేశ్వర్: ఒడిశా కటక్‌లో నిర్వహించిన సంక్రాంతి వేడుకల్లో అపశ్రుతి చోటుచేసుకుంది. బడాంబ- గోపినాథ్‌పూర్ టీ-బ్రిడ్జిపైకి భక్తులు భారీగా తరలిరావడంతో తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో ఒకరు ప్రాణాలు కోల్పోయారు. చిన్నారులు సహా చాలా మంది తీవ్రంగా గాయపడ్డారు. మకర సంక్రాంతిని పురస్కరించుకుని ఇక్కడ భారీ వేడుకలు నిర్వహించారు. అయితే సామర్థ్యానికి మించి జనం తరలిరావడంతో తొక్కిసలాట జరిగింది. తీవ్రంగా గాయపడిన ముగ్గురిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. వారి పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు.

వ్యవసాయం పండుగైన నాడే దేశానికి సంపూర్ణ క్రాంతి

- ప్రజలుకు సీఎం సంక్రాంతి శుభాకాంక్షలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర వ్యవసాయ రంగంలో చోటుచేసుకున్న విప్లవాత్మక ప్రగతి అందించే స్ఫూర్తితో, యావత్ దేశ రైతాంగానికి వ్యవసాయం పండుగైన నాడే.. భారత దేశానికి సంపూర్ణ క్రాంతి చేకూరుతుందని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు అభిప్రాయపడ్డారు. భోగి, మకర సంక్రాంతి, కనుమ పండుగలను పురస్కరించుకుని సీఎం కేసీఆర్ దేశ, రాష్ట్ర రైతాంగానికి, ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. పంట పొలాల నుంచి ధాన్యపు రాశులు ఇండ్లకు చేరుకున్న శుభ సందర్భంలో రైతన్న జరుపుకునే సంబురమే సంక్రాంతి పండుగనీ, నమ్ముకున్న భూతల్లికి రైతు కృతజ్ఞతలు తెలుపుకునే రోజే సంక్రాంతి పండుగ అని సీఎం అభివర్ణించారు.రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయరంగాన్ని పునర్జీవింప చేసేందుకు చేపట్టిన కార్యాచరణతో తెలంగాణ పల్లెలు పచ్చని పంట పొలాలు, ధాన్యరాశులు, పాడి పశువులు, కమ్మని మట్టివాసనలతో సంక్రాంతి శోభను సంతరించుకుని వైభవోపేతంగా వెలుగొందుతున్నాయని పేర్కొన్నారు.

రాష్ట్ర వ్యవసాయరంగం సాధించిన ప్రగతి నేడు యావత్ దేశానికి మార్గదర్శనంగా నిలిచిందని సీఎం తెలిపారు. రాష్ట్ర వ్యవసాయరంగాన్ని బలోపేతం చేసే దిశగా లక్షలాది కోట్ల రూపాయలను ఖర్చు చేస్తున్న ఒకే ఒక రాష్ట్రం తెలంగాణ అని చెప్పారు. రాష్ట్రం అమలు చేస్తున్న రైతుబంధు, రైతుబీమా, 24 గంటల ఉచిత విద్యుత్, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి ఇప్పటివరకు రూ.2,16,000 కోట్లకు పైగా ప్రభుత్వం ఖర్చు చేసిందని పేర్కొన్నారు. రైతుల సంక్షేమం పట్ల తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం నాటికి 1 కోటి 31 లక్షల ఎకరాలు మాత్రమే వున్న సాగు విస్తీర్ణం ప్రస్తుతం 2 కోట్ల 4 లక్షల ఎకరాలకు పెరిగిందని గుర్తుచేశారు. ఇది దేశ వ్యవసాయ రంగంలో విప్లవాత్మక పరిణామని సీఎం తెలిపారు. ఒకనాడు దండుగ అన్న వ్యవసాయం తెలంగాణలో నేడు పండుగ అయిందని, వ్యవసాయరంగాన్ని నమ్ముకుంటే జీవితానికి ఢోకా లేదనే విశ్వాసం తెలంగాణ రైతుల జీవితాల్లో తొణికిసలాడుతున్నదనీ, ఇదే విశ్వాసాన్ని దేశ రైతాంగంలో పాదు కొల్పుతామని సీఎం స్పష్టం చేశారు. ఈ దిశగా యావత్ భారత ప్రజల సహకారంతో, సమిష్టి కృషితో దేశ వ్యవసాయ రంగ నమూనాను సమూలంగా మార్చి గుణాత్మక అభివృద్ధికి బాటలు వేయాల్సిన అవసరం వుందని పిలుపునిచ్చారు. ప్రజలంతా మకర సంక్రాంతి పండుగను సుఖసంతోషాలతో, ఆనందోత్సాహాలతో జరుపుకోవాలనీ, ప్రతీ ఇల్లు సిరి సంపదలతో తులతూగాలని సీఎం కేసీఆర్ ఆకాంక్షించారు.

దావోస్‌కు మంత్రి కేటీఆర్ బృందం

- రేపటి నుంచి 20 వరకు వరల్డ్ ఎకనామిక్ ఫోరం గ్లోబల్ సమ్మిట్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

సోమవారం నుంచి 20వ తేదీ వరకు దావోస్‌లో జరిగే వరల్డ్ ఎకనామిక్ ఫోరం గ్లోబల్ సమ్మిట్‌కు మంత్రి కే తారకరామారావు నేతృత్వంలోని ప్రతినిధిబృందం హాజరుకానుంది. శనివారం రాత్రి ఈ బృందం అక్కడకు బయల్దేరి వెళ్లింది. ఈ సమ్మిట్‌కు హాజరుకావాలని ఫోరం అధ్యక్షులు బోర్గ్ బ్రెండే పంపిన ఆహ్వానం మేరకు అక్కడకు వెళ్తున్నట్టు ప్రభుత్వం తెలిపింది. ప్రపంచంలోని పలు పెట్టుబడిదారీ సంస్థలన్నీ ఇక్కడ వ్యాపార విస్తరణ ప్రణాళికలతో వస్తాయి. వాటితో మాట్లాడి రాష్ట్రానికి పెట్టుబడులు తేవడమే లక్ష్యంగా మంత్రి కేటీఆర్ నేతృత్వంలోని బృందం పనిచేస్తుంది. మంత్రి వెంట వెళ్లే బృందంలో ఐటీ, పరిశ్రమల శాఖల ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, ప్రత్యేక కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి, చీఫ్ రిలేషన్స్ ఆఫీసర్ అమర్‌నాథ్‌రెడ్డి, లైఫ్ సైన్సెస్ డైరెక్టర్ శక్తి నాగప్పన్, ఆటోమోటివ్స్ డైరెక్టర్ గోపాల్‌కృష్ణన్, డిజిటల్ మీడియా డైరెక్టర్ కొణతం దిలీప్ ఉన్నారు.

రేవంత్ రెడ్డి సంక్రాంతి శుభాకాంక్షలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

టీపీసీసీ అధ్యక్షులు ఎ.రేవంత్ రెడ్డి తెలుగు రాష్ట్రాల ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను ప్రజలంతా సంతోషంగా జరుపుకోవాలని కోరుకున్నారు. ఈ సంక్రాంతి పండుగ ప్రతి ఒక్కరి జీవితంలో ఆనందపు సిరులు కురిపించాలని ఆకాంక్షించారు.

చౌదరి సంతోఖ్ సింగ్‌కు నివాళులు

కాంగ్రెస్ పార్టీ జలంధర్ ఎంపీ చౌదరీ సంతోఖ్ సింగ్ పార్థీవ దేహానికి రేవంత్ రెడ్డి నివాళులర్పించారు. భారత్ జోడో యాత్రలో గుండె పోటుతో అకస్మాత్తుగా మరణించిన విషయం తెలిసిన వెంటనే రేవంత్ హుటాహుటీన పంజాబ్ బయలుదేరి వెళ్లారు. సంతోష్ సింగ్ చౌదరి కుమారుడు విక్రమ్ సింగ్ చౌదరీతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన కుటుంబానికి తన సానుభూతిని తెలిపారు.

రొమేనియాకు నాటో నిఘా విమానం

- ఉక్రెయిన్‌కు ట్యాంక్‌లు, శతఘ్నులు పంపనున్న బ్రిటన్

బ్రస్సెల్స్ : రష్యాపై పోరులో ఉక్రెయిన్‌కు అవసరమైన సైనిక సాయం నాటో మిత్ర దేశాల నుంచి కొనసాగుతోంది. రష్యా మిలటరీ కార్యకలాపాలు పర్యవేక్షించడానికి రొమేనియాకు నిఘా విమానాన్ని పంపించనున్నట్లు నాటో కూటమి శుక్రవారం తెలియచేయగా, మరోవైపు ట్యాంక్‌లు, శతఘ్ని వ్యవస్థలను అందజేస్తామని బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ శనివారం హామీ ఇచ్చారు. ఉక్రెయిన్‌పై రష్యా దాడి మొదలైనప్పటి నుండి ఉక్రెయిన్ సరిహద్దు దేశమైన రొమేనియాలో నాటో తన బలగాలను బలోపేతం చేసింది. "మా అవాక్స్ (గాల్లోనే హెచ్చరికలు జారీ చేయగల, నియంత్రణ వ్యవస్థతో కూడిన విమానాలు) వందలాది కిలోమీటర్ల దూరంలో గల విమానాన్ని కూడా కనిపెట్టగలవు. నాటో నిరోధక, రక్షణ సామర్థ్యానికి ఇవి కీలకమైన రీతిలో దోహదపడతాయి" అని నాటో ప్రతినిధి ఓనా లాంగెస్కూ ఒక ప్రకటనలో తెలిపారు. బుఖారెస్ట్‌కి సమీపంలోని ఒటోపెనికి మంగళవారానికి ఈ విమానాలు చేరతాయి. అక్కడ నాటో బోయింగ్ అవాక్స్ దళంలో భాగమవుతాయి. రొమేనియా నుండి గస్తీకి ఎన్ని అవాక్స్ విమానాలను మోహరిస్తోందో నాటో వెల్లడించలేదు. ఒటోపెనిలో రొమేనియా వైమానిక స్థావరంలో దాదాపు 180మంది సైనిక సిబ్బంది వుంటారు. పలు వారాల పాటు ఈ మిషన్ కొనసాగుతుందని నాటో తెలిపింది. శనివారం ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో బ్రిటన్ ప్రధాని మాట్లాడారు. అనంతరం ఒక ప్రకటన చేస్తూ, ఛాలెంజర్ 2 ట్యాంక్‌లు, ఇతర శతఘ్ని వ్యవస్థలను కీవ్‌కు అందజేస్తామని హామీ ఇచ్చారు. బ్రిటీష్ ఆర్మీ ఛాలెంజర్ 2 మెయిన్ ట్యాంకులను నాలుగింటిని తూర్పు యూరప్‌కు తక్షణమే పంపుతున్నట్లు బ్రిటీష్ మీడియా తెలిపింది. ఆ తర్వాత మరో ఎనిమిది ట్యాంకులు పంపనున్నట్లు పేర్కొంది.

సరిహద్దు అంశంపై చైనా, భూటాన్ చర్చలు

బీజింగ్ : చైనా, భూటాన్ మధ్య సరిహద్దు చర్చలను మరింత ముందుకు తీసుకెళ్లడానికి ఇరు దేశాల అధికారుల మధ్య అంగీకారం కుదిరింది. నైరుతి చైనా నగరమైన కన్‌మింగ్‌లో చైనా, భూటాన్ అధికారుల బృందం సరిహద్దు అంశంపై మూడు రోజులుగా జరుపుతున్న చర్చలు శుక్రవారంతో ముగిశాయి. మూడంచెల ప్రణాళికను ముందుకు తీసుకెళ్లడానికి ఇరు దేశాల అధికారుల మధ్య ఏకాభిప్రాయం కుదిరిందని సంయుక్త ప్రకటన పేర్కొంది. సాధ్యమైనంత త్వరలో చైనా-భూటాన్ 25వ దఫా సరిహద్దు చర్చలను నిర్వహించడంపై దౌత్య మార్గాల ద్వారా సంబంధాలను కొనసాగించనున్నామని తెలిపింది.

ఇద్దరు పాలస్తీనియన్ల హత్య

రమల్లా : ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లో శనివారం తెల్లవారు జామున ఇజ్రాయిల్ బలగాలు ఇద్దరు పాలస్తీనియన్లను హత్య చేశాయని పాలస్తీనా అధికారులు తెలిపారు. దాదాపు రెండు వారాల ముందు జరిగిన మరో దాడిలో తీవ్రంగా గాయపడిన మరో పాలస్తీనియుడు మరణించాడు. వాహనంపై వెళుతున్న సాయుధులు తమపై కాల్పులు జరపడంతో తమ సైనికులు కూడా ఎదురు కాల్పులు జరిపారని మిలటరీ తెలిపింది. ఆ కాల్పుల తర్వాత ఆ వాహనం నుండి ఎం.-16 రైఫిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొంది. ఈ ఏడాదిలో ఇప్పటివరకు మరణించిన పాలస్తీనియన్ల సంఖ్య 12కి చేరింది. మరణించిన ఇద్దరినీ వెస్ట్ బ్యాంక్ ఉత్తరప్రాంతంలోని జెనిన్ నగర వాసులుగా గుర్తించినట్లు పాలస్తీనా ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది.

వర్సిటీ శిఖరాన విజ్ఞాన భాండాగారం

- ఓయూ డా.బి.ఆర్.అంబేద్కర్ మెమోరియల్ లైబ్రరీ
- పలు విభాగాల్లో పరిశోధనకు పెద్దన్న పాత్ర
- పోటీ పరీక్షలకు పెట్టింది పేరు
- చరిత్రను, సామాజికతను ప్రస్ఫుటించే పుస్తకాల డిజిటలైజేషన్
- 60 వసంతాలు పూర్తి చేసుకున్న గ్రంథాలయం



నవతెలంగాణ-ఓయూ

దక్షిణ భారతదేశంలో అతి పురాతన, ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన విశ్వవిద్యాలయం ఓయూ. ఏడో నిజాం రాజు "మీర్ ఉస్మాన్ అలీఖాన్" కాలంలో నిర్మించిన యూనివర్సిటీ. లక్షలాది మంది మేధావులను ప్రపంచానికి అందించిన మన పోరుగడ్డ ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఈ వర్సిటీకి ఇంతటి పేరు ప్రఖ్యాతలు తీసుకురావడంలో విజ్ఞాన భాండాగారం డా.బి.ఆర్.అంబేద్కర్ మెమోరియల్ గ్రంథాలయం కీలక భూమిక పోషిస్తోంది. రాజసౌధాన్ని తలపించే వర్సిటీ.. చారిత్రక సంపదను, విజ్ఞానాన్ని పంచుతూ ఎంతో మంది విద్యార్థులను ఉన్నత శిఖరాలకు చేర్చడంలో ఓయూ విశ్వవిద్యాలయం లైబ్రరీ పాత్ర కీలకమైంది. రాష్ట్రంలో ఉన్నత విద్యకు సంబంధించిన కీలకమైన విధానాలు పురుడు పోసుకునేది ఇక్కడే. ఇంతటి గొప్ప పేరు ప్రఖ్యాతలుగాంచిన ఈ గ్రంథాలయం 60 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా "నవ తెలంగాణ" ప్రత్యేక కథనం. 1918 నుంచి ఓయూలో గ్రంథాలయ సేవలు ఉన్నప్పటికీ ప్రధాన గ్రంథాలయం సేవలు 1963 ఆగస్టు 3న ప్రారంభమయ్యాయి. నాటి రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ చేతుల మీదుగా ప్రారంభించిన ఈ గ్రంథాలయాన్ని వర్సిటీలోని పలు విభాగాల విద్యార్థులకు, పరిశోధకులకు ఉపయోగపడేలా ఏర్పాటు చేశారు.

ఆయా విభాగాల ఆధారంగా సేవలు

వర్సిటీలోని ఆయా విభాగాల ఆధారంగా లైబ్రరీ పలు సేవలు అందిస్తున్నది. ప్రధానంగా ఆర్డరింగ్, టెక్నికల్ స్పాట్ పిరియాడికల్ ఇంటర్నెట్ థీసిస్, సీఈఆర్ఎల్ (1997), యూస్ సెక్షన్(1968), మాన్యుస్క్రిప్ట్‌లు, విజన్ ఆఫ్ ఓయూ తదితర విభాగాలు ఉన్నాయి. అంతేకాకుండా ఈ లైబ్రరీలో నాలెడ్జ్ సర్క్యులేషన్, రిఫరెన్స్, డిజిటల్ లైబ్రరీ తదితర సేవలు అందుబాటులో ఉన్నాయి. దీనిలో భాగంగానే విజన్ ఆఫ్ ఓయూ కంప్యూటర్ ల్యాబ్‌ను నాటి ఓయూ వీసీ ప్రొఫెసర్ ఎస్.సత్యనారాయణ హయాంలో ప్రారంభించారు.

నిరంతరం సేవలు

విద్యార్థుల అవసరాలకు తగిన విధంగా ఓయూ లైబ్రరీలో మరిన్ని సేవలకు శ్రీకారం చుడుతోంది. ఇందులో భాగంగానే విద్యార్థులు చదువుకోవడానికి 14 గంటలు సేవలు అందిస్తున్నది. ఈ సౌకర్యాన్ని 2015లో నాటి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సురేష్‌కుమార్ అందుబాటులోకి తీసుకొచ్చారు. పోటీ పరీక్షల దృష్ట్యా ఈ సేవలను తీసుకొచ్చారు. ఈ లైబ్రరీతోపాటు ఓయూలో పలు విభాగాల కళాశాలల్లోనూ గ్రంథాలయాలు ఉన్నాయి. వర్సిటీలో ఆర్ట్స్, సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, ఎడ్యుకేషన్, మేనేజ్‌మెంట్ అండ్ కామర్స్ తదితర గ్రంథాలయాలు అందుబాటులో ఉన్నాయి. అయితే, అన్నింటికీ మూలాధారం ఓయూ ప్రధాన గ్రంథాలయమే. ఏడాదిలో ప్రధాన పండుగలు మినహా అన్ని రోజులూ తెరిచే ఉంటుంది. ఇక్కడ ఉద్యోగులు నిరంతరం సేవలు అందిస్తున్నారు.

విద్యార్థులకు సౌకర్యంగా ల్యాబ్

విద్యార్థులకు వారి పాఠ్యాంశాలతోపాటు వివిధ అంశాలపై విజ్ఞానం పెంచేలా ఇక్కడ పుస్తకాలు అందుబాటులో ఉంటాయి. నిరంతరం విజ్ఞానాన్ని ఆధునీకరిస్తూ వస్తున్నారు. దీనిలో భాగంగానే ప్రధాన పుస్తకాలను డిజిటలైజేషన్ చేస్తున్నారు. పురాతన పుస్తకాలను ఆధునీకరించి జాగ్రత్త పరుస్తున్నారు. ఇక్కడ గ్రంథాలయంలో 25 కంప్యూటర్లతో కూడిన అత్యాధునిక ల్యాబ్ ఏర్పాటు చేశారు. విద్యార్థులు ఎప్పటికప్పుడూ సమాచారాన్ని అందిపుచ్చుకోవడానికి ఇంటర్నెట్ సేవలు అందుబాటులో ఉన్నాయి.

పోటీ పరీక్షల పుస్తకాలు అందుబాటులో..

ఈ గ్రంథాలయంలో ప్రధానంగా పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు ఎక్కువుగా అందుబాటులో ఉంచారు. ప్రాచీన కాలం నుంచి నేటి వరకు ప్రచురితమైన అన్ని రకాల పుస్తకాలను సేకరించి భద్రపరిచారు. పోటీ పరీక్షల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కాంపిటీషన్ రెఫరెన్స్ సెల్‌లో వీటిని పొందుపరిచారు. ఇది రోజూ రాత్రి 11 గంటల వరకు పనిచేస్తుంది.

ఆధునిక దేవాలయం మా గ్రంథాలయం
గ్రంథపాలకుడు డా.ఎ.ఎస్.చక్రవర్తి

స్వాతంత్ర్య ఉద్యమ కాలం నుంచి తెలంగాణ ఉద్యమం వరకు ఈ గ్రంథాలయం ప్రధాన భూమిక పోషించింది. ఎంతోమంది జీవితాలకు దిశా నిర్దేశం చేసిన ఘనత మా గ్రంథాలయానిది. ఆధునిక దేవాలయం మా గ్రంథాలయం. విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా గ్రంథాలయంలో అనేక మార్పులు చేర్పులు తీసుకొచ్చాం. వారి ఉపాధియే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. ఇప్పటి వరకు 45వేల పుస్తకాలను డిజిటలైజ్ చేసి నెట్‌లో అందుబాటులో ఉంచారు. 6825 మ్యాన్ స్క్రిప్ట్స్, 10, 11వ శతాబ్దాలకు సంబంధించిన తాళపత్ర గ్రంథాలను డిజిటలైజేషన్ చేశాం. ఆల్ మజీద్ సెంటర్ ఫర్ హెరిటేజ్ అండ్ కల్చర్ (దుబాయ్) సహకారంతో డిజిటలైజేషన్ పూర్తి చేశాం.

ఇక్కడ ఉన్న పుస్తకాల వివరాలు

పుస్తకాలు :- 5,57,007
థిసెస్, ఎంఫిల్ :- 75387
ఐరాస పత్రాలు :- 13195
మాన్యుస్క్రిప్ట్, తాళపత్ర గ్రంథాలు -6825
ఐలిమ్స్ :- 273
సీడీ రోమ్స్ :-12
డిజిటలైజేషన్ డాక్యుమెంట్స్ :-45,000

హైకోర్టు తుది తీర్పును అమలు చేయాలి

- డీయస్సీ-2008 బీ.ఇడీ సెలెక్టెడ్ మెరిట్ అభ్యర్థులను
- సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులుగా నియమించాలి
- సీఎం కేసీఆర్‌కు జూలకంటి రంగారెడ్డి లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

డీయస్సీ-2008 బీ.ఇడీ సెలెక్టెడ్ మెరిట్ అభ్యర్థుల విషయంలో హైకోర్టు ఇచ్చిన తుది తీర్పును అమలు చేస్తూ సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులుగా నియమించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, మాజీ శాసనసభ్యులు జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం సీఎం కేసీఆర్‌కు లేఖ రాశారు. సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల భర్తీ కోసం బీ.ఇడీ, డి.ఇడీ అభ్యర్థులకు సమాన అవకాశాలు కల్పిస్తూ 2008 డిసెంబర్ ఆరున నోటిఫికేషన్ ఇచ్చారని గుర్తుచేశారు. అనంతరం జీవో 28 ద్వారా డీ.ఇడీ అభ్యర్థులకు నియామకాల్లో 30 శాతం రిజర్వేషన్ కల్పించడంతో అప్పటికే ఎంపికైన మెరిట్ బి.ఇడీ అభ్యర్థులు నష్టపోయారని తెలిపారు. దీనిపై హైకోర్టు 2022 సెప్టెంబర్ 27న బి.ఇడీ సెలెక్టెడ్ మెరిట్ అభ్యర్థులకు ఉద్యోగాలివ్వాలనీ, 2008లో నోటిఫికేషన్ అనంతరం ఇచ్చిన జీవో ద్వారా నిబంధనలు మార్చడం చెల్లవనీ, ఆ నోటిఫికేషన్‌లో పేర్కొన్న మొత్తం పోస్టులు మెరిట్ బి.ఇడీ అభ్యర్థులతో భర్తీ చేయాలని ఆదేశించిందని పేర్కొన్నారు. 2016 జనవరిలో వరంగల్ పర్యటన సందర్భంగా ఉద్యోగాలిస్తామనీ, నష్టపోయిన అభ్యర్థులకు న్యాయం చేస్తామంటూ సీఎం కేసీఆర్ ఇచ్చిన హామి అమలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

సమాజం కోసం పాటుపడదాం..

- భోగి వేడుకల్లో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రతికూల ఆలోచనలను వదిలేసి, దేశం కోసం, సమాజం కోసం పాటుపడదామంటూ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. శనివారం హైదరాబాద్‌లోని కేబీఆర్ పార్కు వద్ద భారత జాగృతి ఆధ్వర్యంలో నిర్వహించిన భోగి వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ పాత ఆలోచనలను భోగి మంటల్లో కాల్చేసి, సరికొత్త విధానాలతో ముందుకెళ్లాలని సూచించారు. తెలంగాణ జాగృతి, భారత జాగృతిగా రూపొందిన తర్వాత మొట్టమొదటి కార్యక్రమంగా సంక్రాంతి సంబరాలు చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. హరిదాసులు, బసవన్నల దీవెనలతో భారతదేశం వర్ధిల్లాలని ఆకాంక్షించారు. శతాబ్దాల క్రితం మారిషస్‌కు వెళ్లి అక్కడ స్థిరపడిన తెలుగు సమాజం ప్రతినిధులు ఈ కార్యక్రమంలో అతిథులుగా పాల్గొన్నారు. మారిషస్‌లో తెలుగుసంస్కృతిని కాపాడేందుకు తరతరాలుగా కృషి చేస్తున్న మారిషస్ తెలుగు సంఘం ప్రతినిధులకు, అక్కడ నిర్వహించనున్న తెలుగు మహాసభలకు సహకారం ఉంటుందని కవిత తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎస్ ఫుడ్స్ కార్పొరేషన్ చైర్మెన్ మేడె రాజీవ్ సాగర్, భారత్ జాగృతి ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి, బీఆర్ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్ యాదవ్, భారత్ జాగృతి హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు అనంతుల ప్రశాంత్, మారిషస్ తెలుగు మహాసభ ప్రతినిధులు పాల్గొన్నారు.

మారిషస్‌లో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు..

- హాజరుకానున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మారిషస్‌లో నిర్వహించనున్న తెలంగాణ ఆవిర్భావ వేడుకలకు రాష్ట్ర మంత్రి వి శ్రీనివాస్‌గౌడ్ హాజరుకానున్నట్టు మారిషస్ తెలుగు మహాసభ సంఘం, తెలుగు కల్చరల్ ట్రస్ట్, తెలుగు స్పీకింగ్ యూనియన్ ప్రతినిధులు తెలిపారు. మారిషస్ తెలుగు మహాసభ ఏర్పడి 75ఏండ్లు పూర్తయిన సందర్భంగా రూపొందించిన లోగోను శనివారం హైదరాబాద్‌లోని మంత్రి కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయా ప్రతినిధులు మాట్లాడుతూ మారిషస్ లో నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొనాలంటూ మంత్రి శ్రీనివాస్ గౌడ్‌ను ఆహ్వానించినట్టు తెలిపారు. అక్కడ స్థిరపడిన తెలంగాణ ప్రజల కోసం సాంస్కృతిక, పర్యాటక, విద్యా అవకాశాలపై పరస్పర సహకారం అందించాలని కోరారు. వారి విజ్ఞప్తిపై మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో కల్చరల్ ప్రతినిధి విశ్వకర్మ, బాలరాజ్ పెంటయ్య, ధరంరాజ్ నారాయణస్వామి, గురయ్య, రాజేంద్ర అప్పాలస్వామి, తెలుగు విద్యాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రతి మండలంలో క్రీడా మైదానాలు ఏర్పాటు చేయాలి

- డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్
- సంక్రాంతి వేడుకల్లో భాగంగా క్రీడోత్సవాలు ప్రారంభం



నవతెలంగాణ-మంచాల

ప్రతి మండలంలోనూ క్రీడా మైదానాలు ఏర్పాటు చేసి, గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్ అన్నారు. రంగారెడ్డి జిల్లా మంచాల మండలం నోముల గ్రామంలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడోత్సవాలను స్థానిక సీఐ వెంకటేశ్‌గౌడ్‌తో కలిసి ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ.. సంక్రాంతి పండుగ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో క్రీడలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అలాగే, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై అనేక పోరాటాలు చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం ఉద్యోగాల నోటిఫికేషన్ వేయాలని, నిరుద్యోగ భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. డీవైఎఫ్ఐ పోరాటాల్లో యువకులు భాగం కావాలని కోరారు. అనంతరం సీఐ వెంకటేశ్‌గౌడ్ మాట్లాడుతూ.. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు.

క్రీడాలతో మానసిక, శారీరక దృఢత్వం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎర్ర అశోక్, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శులు బి.శంకర్, పి.జగన్, డీవైఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి ఎస్.రాజు, మండల అధ్యక్ష, కార్యదర్శులు రామకృష్ణ, ఆర్.స్వామి తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

సీపీఎస్ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని సీపీఎస్ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల రాష్ట్ర అధ్యక్షులు దాముక కమలాకర్, చీటి భూపతిరావు శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటికే రాజస్థాన్, పంజాబ్, ఛత్తీస్‌ఘడ్, ఝార్ఖండ్ రాష్ట్రాల్లో ఆ ప్రభుత్వాలు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించారని పేర్కొన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మాత్రం సీపీఎస్‌ను రద్దు చేయటం లేదని తెలిపారు. రాష్ట్రంలో సీపీఎస్‌ను ఓపీఎస్‌గా మార్చాలనీ, రెండు లక్షల మంది ఉపాధ్యాయులు,ఉద్యోగులు ఎదురుచూస్తునారని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ పెన్షన్ రూల్స్ 1980 ప్రకారం పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నెల 16 సోమవారంహైదరాబాద్‌లో సీపీఎస్ ఉద్యోగుల సమావేశాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు.

బీజేపీ హఠావో.. సింగరేణి బచావో..

- తల్లిలాంటి పార్టీకి ద్రోహం చేయకండి
- 18న బీఆర్ఎస్ ఆవిర్భావ సభను విజయవంతం చేయండి
- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు



ప్రజాప్రతినిధుల సభలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు

నవతెలంగాణ-ఇల్లందు

"బీజేపీలో చేరడమంటే వారి రాజకీయ భవిష్యత్తు ముగిసినట్టే.. ఖమ్మం ఉమ్మడి జిల్లాలో బీజేపీకి చోటు లేదన్నారు. డిపాజిట్ కూడా దక్కదు.. బీజేపీలోకి వెళ్లితే ఆత్మహత్యా సదృశ్యమే.. తల్లిలాంటి పార్టీకి ఎవరూ ద్రోహం చేయొద్దు.. బీజేపీ హఠావో.. సింగరేణి బచావో" అని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు మండల పరిధిలోని బొజ్జాయిగూడెం ఎస్ఎస్ ఫంక్షన్ హాల్‌లో శనివారం నియోజకవర్గ ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 18న ఖమ్మంలో జరగనున్న బీఆర్ఎస్ భారీ సభకు ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు, సీపీఐ(ఎం), సీపీఐ జాతీయ నేతలు రానున్నారని తెలిపారు. సభకు 5లక్షల మందిని సమీకరించి కేసీఆర్ సత్తా ఢిల్లీ దాక చాటాలన్నారు. కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు, ఎల్ఐసీ, బొగ్గుగనులు తదితర ప్రభుత్వ రంగాలను ప్రయివేటుకు ధారాదత్తం చేస్తోందన్నారు. లక్షల ఉద్యోగాలు భర్తీ చేయకుండా ఉన్నవి ఊడగొడుతోందన్నారు. అదానీ, అంబానీలకే మోడీ ప్రభుత్వం ఊడిగం చేస్తోందని విమర్శించారు. తెలంగాణలో అనేక ఉద్యోగ నోటిఫికేషన్‌లు ఇస్తున్నామన్నారు. మొత్తం 91వేల ఉద్యోగాలు భర్తీ చేయనున్నామని చెప్పారు. దేశంలో ప్రకటించిన 10 ఉత్తమ పంచాయతీలు తెలంగాణలోనే ఉన్నాయన్నారు. దీన్ని బట్టి రాష్ట్రంలో పాలన ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడ్డాక బొగ్గుట్టను ఎంతో అభివృద్ధి చేశామన్నారు. సీతారామ ప్రజెక్టుతో నియోజకవర్గంలోని 5 మండలాలకు నీరందించేందుకు రూ.400 కోట్ల ప్యాకేజీని సీఎం ప్రకటించారని గుర్తు చేశారు. ఇల్లందు ప్రభుత్వ వైద్యశాలకు మరిన్ని నిధులిచ్చి 100 పడకలకు పెంచుతామని చెప్పారు. ఎమ్మెల్యే హరిప్రియ అధ్యక్షతన జరిగిన సభలో ప్రభుత్వ చీఫ్ విప్ రేగా కాంతారావు, రవాణా శాఖ మంత్రి పువ్వాడ, రాజ్యసభ సభ్యులు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాత మధు తదితరులు పాల్గొన్నారు.

చైనా మాంజాల అమ్మకాలు..

- పోలీసుల అదుపులో ఐదుగురు



నవతెలంగాణ-వనస్థలిపురం

ప్రమాకరమైన చైనా మాంజాలను అమ్ముతున్న వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్ వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో వేర్వేరు చోట్ల ఐదుగురిని శనివారం అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.30 వేల మాంజాలను స్వాధీనం చేసుకున్నారు. వనస్థలిపురం సీఐ కె.సత్యనారాయణ తెలిపిన వివరాలు ప్రకారం.. నాగోల్ జైపూర్ కాలనీకి చెందిన కబీర్ రాజ్, విజయపురి కాలనీకి చెందిన దినేష్, మారుతినగర్‌కు చెందిన రజిని, బీఎన్‌రెడ్డి నగర్‌కు చెందిన అఫ్రీజ్, వనస్థలిపురం కాంప్లెక్స్‌కు చెందిన మౌనిద్దీన్ చైనా మాంజాలను అమ్ముతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని మాంజాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్నారు. నిందితులను పట్టుకున్న సిబ్బందిని సీఐ అభినందించారు. ఇదిలా ఉండగా.. శుక్రవారం హైదరాబాద్ నాగోల్‌లో బైక్‌పై వెళ్తున్న చిన్నారికి మాంజా తగిలి తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. అలాగే, సంగారెడ్డి జిల్లా జోగుపేటలో బైక్‌పై వెళుతున్న యువకుడికి చైనామంజా తగిలి గాయపడ్డారు.

పోచారం మకర సంక్రాంతి శుభాకాంక్షలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర శాసన సభాపతి శ్రీ పోచారం శ్రీనివాసరెడ్డి ప్రజలకు మకర సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. భోగభాగ్యాలతో "భోగి"ని, సకల సంపదలతో "సంక్రాంతి"ని, కన్నుల పండుగగా "కనుమ"ను జరుపుకోవాలని కోరారు. సంక్రాంతి రైతుల పండుగ. వానాకాలం పంటల కోతలు పూర్తయి ధాన్యం ఇంటికి చేరిన సమయంలో జరుపుకునే పండుగ సంక్రాంతి. భోగి మంటలు, గాలి పటాల సందళ్ళతో పాటుగా తెలంగాణ సంప్రదాయ సకినాల పిండివంటలతో ఈ మూడు రోజులు కోలాహలంగా ఉంటుంది. ప్రజలందరూ తమ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి సంక్రాంతి పండుగను ఆనందంగా జరుపుకోవాలని పోచారం కోరారు.

బాలుడి కిడ్నాప్ కథ సుఖాంతం

- రూ.4.50లక్షలకు అమ్మిన నిందితులు
- కేసును ఛేదించిన భద్రాచలం పోలీసులు
- బాలుడిని తల్లికి అప్పగింత
- కిడ్నాపు ఘటనలో ఆరుగురు నిందితుల అరెస్ట్
- వివరాలు వెల్లడించిన భద్రాచలం ఏఎస్పీ



నవతెలంగాణ-భద్రాచలం

బాలుడి కిడ్నాప్ కేసును భద్రాచలం పోలీసులు ఛేదించారు. రూ.4.50కు అమ్మిన వారిని అదుపులోకి తీసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను భద్రాచలం ఏఎస్పీ రాజేష్ చంద్ర శనివారం మీడియా సమావేశంలో వెల్లడించారు. భద్రాచలానికి చెందిన మూడో తరగతి చదువుతున్న బాలుడు జనవరి 6వ తేదీన కిడ్నాప్ అయ్యాడు. తల్లి స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు అన్ని కోణాల్లో విచారించారు. సీసీ పుటేజీలను పరిశీలించారు. వాటి ఆధారంగా విచారించగా పలు విషయాలు వెలుగుచూశాయి. భద్రాచలం పట్టణం అశోక్‌నగర్ కాలనీకి చెందిన కందుల అన్నపూర్ణ, ఆమె రెండో కూతురు అనూష, కొడుకు సాయిరాం తదితరులు డబ్బుపై అత్యాశతో భద్రాచలం పట్టణంలోని ప్రభుత్వ ప్రైమరీ పాఠశాలలో బాలుడిని కిడ్నాప్ చేసి అమ్మాలని పథకం రచించారు. ఈ క్రమంలో వారు రాజమండ్రికి చెందిన బెండ తులసి ద్వారా డా.స్నేహలత, ఇసాక్‌కు బాలున్ని అమ్మేందుకు రూ.4.50కు డీల్ కుదుర్చుకున్నారు. కందుల అన్నపూర్ణ, కూతురు అనూష, సాయిరాం కొంత కాలంగా ఆ బాలుడిని మచ్చిక చేసుకున్నారు. అతని ఫొటోలను డా.స్నేహలత, ఇసాక్ దంపతులకు పంపారు. వారి పథకంలో భాగంగా డిసెంబర్ 22న బాలున్ని రాజమండ్రి తీసుకెళ్లి.. అదే రోజు భద్రాచలం తీసుకొచ్చారు. అనంతరం జనవరి 6వ తేదీన నిందితులు ముగ్గురూ కలిసి బాలున్ని కిడ్నాప్ చేసి రాజమండ్రి తీసుకెళ్లారు. బెండ తులసి ద్వారా డా.స్నేహలత, ఇసాక్ దంపతులకు బాలుడిని రూ.4.50 లక్షలకు అమ్మారు. అందులో బెండ తులసికి రూ.50,000 ఇచ్చారు. జనవరి 14 ఉదయం నమ్మదగిన సమాచారం మేరకు కందుల అన్నపూర్ణ, అనూష, సాయిరాంను భద్రాచలం పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా నేరాన్ని అంగీకరించారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. డా.స్నేహలత, ఇసాక్, బెండ తులసిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి రూ.3.10 లక్షలు, 6 సెల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. చైల్డ్ లైన్, డీసీపీ యూనిట్ భద్రాద్రి కొత్తగూడెం అధికారుల సమక్షంలో బాలున్ని తల్లికి అప్పగించినట్టు ఏఎస్పీ వివరించారు. నిందితులను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు పంపుతామన్నారు.

మాటల్లో రెగ్యులర్ ...చేతల్లో కాంట్రాక్ట్


- వైద్యారోగ్యశాఖ పోస్టులు మళ్లీ తాత్కాలికమే
- వ్యతిరేకిస్తున్న డాక్టర్ల సంఘాలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ వస్తే కాంట్రాక్ట్ వ్యవస్థే రద్దయిపోతుందని నిరుద్యోగులు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ సిబ్బంది భావించారు. రాష్ట్ర సాధన ఉద్యమ సమయంలో టీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన హామీ కూడా అదే. అయితే రాష్ట్రం సిద్ధించి ఎనిమిదేండ్లు గడుస్తున్నా ఇప్పటికీ కాంట్రాక్ట్ వ్యవస్థ రద్దు కాకపోగా, ఆ ప్రాతిపదికన పని చేస్తున్న వారు శ్రమదోపిడీకి గురవుతూనే ఉన్నారు. ఇటీవల ఆయా శాఖల వారీగా ఉద్యోగాలను భారీ స్థాయిలో భర్తీ చేస్తారనే ప్రచారంతో నిరుద్యోగుల్లో ఆశలు చిగురించాయి. పోస్టులన్నింటినీ రెగ్యులర్ ప్రాతిపదికన భర్తీ చేస్తారని వారు భావించారు. అయితే వారు ఊహించుకున్న దానికి భిన్నంగా పలు పోస్టులకు తిరిగి కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేసేందుకు నోటిఫికేషన్‌లు ఇస్తుండటంతో డాక్టర్ల సంఘాలతో పాటు వైద్యారోగ్యశాఖలోని వివిధ క్యాడర్లకు చెందిన ఉద్యోగ సంఘాలు ఈ అంశాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ప్రజారోగ్య వ్యవస్థ బలోపేతం కావాలంటే నిరంతరాయంగా ఉండే పనుల కోసం రెగ్యులర్ ప్రాతిపదికనే పోస్టులను భర్తీ చేయాలని ఆయా సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం జిల్లాకో మెడికల్ కాలేజీ, అనుబంధంగా పెద్దాస్పత్రి, నర్సింగ్ కాలేజీలు స్థాపించాలని నిర్ణయించింది. ఆ మేరకు చర్యలకు పూనుకున్నది. దీంతో వైద్యవిద్యను, నర్సింగ్ విద్యను అభ్యసించాలనుకునే వారితో పాటు ఇప్పటికే చదువు పూర్తయి ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులు రెగ్యులర్ ఉద్యోగాలపై ఆశలు పెంచుకున్నారు. అయితే పోస్టుల భర్తీ విషయంలో కొన్ని పోస్టులకు రెగ్యులర్ ప్రాతిపదికన నోటిఫికేషన్ ఇవ్వడం, మరి కొన్నింటికి మాత్రం కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన భర్తీ చేసేందుకు మాత్రమే ఆర్థికశాఖ అనుమతిస్తుండటంతో తీవ్ర నిరాశకు గురవుతున్నారు. రాష్ట్రంలోని 14 ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 201 మంది ట్యూటర్లను కాంట్రాక్టు ప్రాతిపదికన నియమించుకునేందుకు ఆర్థికశాఖ అనుమతించింది. ఇప్పటికే నేషనల్ హెల్త్ మిషన్‌తో పాటు, వివిధ విభాగాల పరిధిలో కాంట్రాక్టు సిబ్బంది తమను రెగ్యులర్ చేయాలనీ, భవిష్యత్తులో నియామకాలన్నింటినీ రెగ్యులర్ ప్రాతిపదికన భర్తీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. వారిని యథాతథంగా భర్తీ చేయకుండా వెయిటేజీ ఇస్తూ, రెగ్యులర్‌గా కొన్ని పోస్టులను భర్తీ చేస్తున్నారు. మరి కొన్నింటికి కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో నింపేందుకే ఆసక్తి చూపిస్తుండటం కూడా ఉద్యోగులు, నిరుద్యోగుల్లో అసంతృప్తికి కారణమవుతున్నది. ఆరోగ్యశాఖ అందిస్తున్న సేవలు శాశ్వతమైనవి. అయితే అలాంటి సేవలందించే సిబ్బందిని మాత్రం తాత్కాలికంగా నియమించడంలో ఎలాంటి ఔచిత్యం లేదనీ, ట్యూటర్లతో సహా అన్ని పోస్టులను శాశ్వత ప్రాతిపదికన భర్తీ చేయాలని వైద్య, నర్సింగ్ సంఘాలు కోరుతున్నాయి.

పెరిగిన పెట్టుబడి.. తగ్గిన మినప దిగుబడి

- మక్క, ఉల్లిదీ అదే పరిస్థితి
- ఆందోళనలో నదీ పరివాహక రైతులు
- గిట్టుబాటు ధర కల్పించాలి : రైతు సంఘాల నాయకులు



నవతెలంగాణ-మహబూబ్‌నగర్ ప్రాంతీయప్రతినిధి

కృష్ణా పరివాహక ప్రాంతంలో రబీ కాలంలో ఎక్కువగా మినుములు, మక్క, ఉల్లిగడ్డ పంటలను సాగు చేస్తారు. ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడం, తెగుళ్లు సోకడంతో పెట్టుబడి రెట్టింపు అయింది. చలి కాలంలో మంచు కురుస్తున్న సమయంలో తక్కువ నీటితోనే ఈ పంటలను సాగు చేసే అవకాశాలున్నాయి. సాగునీటి అవకాశం లేని రైతులు మంచు తేమ ఆధారంగా సాగు చేసే పంటలను అధికంగా వేస్తారు. అయితే, ఈసారి ఈ పంటల దిగుబడి అమాంతం పడిపోయింది. కానీ, మార్కెట్‌లో గిట్టుబాటు ధర మాత్రం లేదు. అటు పెట్టుబడి పెరిగి.. ఇటు ధర లేక రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పప్పు ధాన్యపు పంటలను అధికంగా సాగు చేస్తారు. ముఖ్యంగా నల్లభూముల్లో కుసుమ, దనియాలు, పప్పుశనగ పంటలను సాగు చేస్తారు. నీరు లేకున్నా రాత్రిపూట కురిసే మంచుకే పంటలు చేతికి వస్తాయి. వీటితో పాటు మినుములు, మక్క, ఉల్లిగడ్డ పంటలను సైతం కృష్ణ, తుంగభద్ర, బీమా నదుల పరివాహక ప్రాంతంలో అధికంగా సాగు చేశారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో పెంట్లవెల్లి, పెద్దమరూరు, చిన్నంబావి, జెటప్రోల్, చెల్లెపాడు, వీపనగండ్ల, అమ్మపల్లి, లక్ష్మింపల్లి, జెటప్రోల్ తదితర ప్రాంతాల్లో మునుములు, మక్క, ఉల్లిగడ్డ పంటలను అధికంగా సాగు చేస్తారు. అధికారిక లెక్కల ప్రకారం.. కొల్లాపూర్‌లోనే 10 వేల ఎకరాలు, వనపర్తిలో ఐదు వేల ఎకరాల్లో సాగు చేశారు. ఎకరం పొలంలో మినుములు సాగు చేయడానికి రూ.30 వేల ఖర్చు అవుతోంది. బాగా పండినా 8 క్వింటాళ్లకు మించి దిగుబడి రాదు. క్వింటాలుకు రూ.6వేలకు మించి ధర ఉండటం లేదని పలువురు రైతులు తెలిపారు. దీంతో సాగు చేసిన పంటలకు పెట్టుబడి సైతం రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తుపాన్‌తో నష్టం

పంట వేసే సమయంలో అధిక వర్షాలతోపాటు తుపాన్ ప్రభావం తీవ్రంగా ఉండటంతో విత్తనం మురిగిపోయింది. ముఖ్యంగా ఉమ్మడి జిల్లాలో మినుములు వేశారు. ఒకసారి మురిగిపోతే మరోసారి వేయడంతో పెట్టుబడి రెండింతలైయింది. ఏటా గిట్టుబాటు ధర కల్పిస్తామని ప్రజాప్రతినిధులు చెబుతున్నా.. పంట చేతికొచ్చాక స్పందించడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం గిట్టుబాటు ధరతోపాటు జరిగిన నష్టపరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

పెట్టుబడైనా రావడం లేదు
రైతు రాములమ్మ - చిన్నంబావి మండలం- నాగర్‌కర్నూల్ జిల్లా

నేను ఆరెకరాల్లో మినుములు సాగు చేశాను. రెండెకరాలు నా సొంత భూమి. మరో నాలుగెకరాలు లీజుకు తీసుకున్నాను. విత్తనం దశలో తుపాన్ రావడంతో మొలక మొత్తం చనిపోయింది. రెండు సార్లు విత్తనాలు వేయాల్సి వచ్చింది. ఎకరాకు రూ.30 వేల ఖర్చు అయ్యేది. రెండు సార్లు వేయడం వల్ల ఖర్చు రూ.40 వేలకు పెరిగింది.

రైతులను ఆదుకోవాలి
బాల్‌రెడ్డి- రైతు సంఘం జిల్లా అధ్యక్షులు- నాగర్‌కర్నూల్

రబీలో సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ముఖ్యంగా తుపాన్ వల్ల పంటలు బాగా దెబ్బ తిన్నాయి. దిగుబడి సగానికి పడిపోయిం ది. పెట్టుబడి రెట్టింపు అయింది. అధికారులు వెంట నే స్పందించి పంట నష్టంపై సర్వే చేయాలి. రైతుల కు నష్ట పరిహారం అందించేందుకు చర్యలు తీసుకో వాలి. లేనిచో రైతులందరినీ కూడగట్టి ఆందోళన చేస్తాం.

'పతంగులు ఎగురవేసేటప్పుడు జాగ్రత్త'



సరూర్‌నగర్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి సంక్రాంతి పండుగ సందర్భంగా పతంగులను ఎగురవేశారు. చిన్నారులు పతంగులు ఎగురవేసేటప్పుడు జాగ్రత్తగా ఉండాలన్నారు. విద్యుత్ తీగలకు తగలకుండా చూసుకోవాలని, బిల్డింగ్‌పై నుండి పతంగులు ఎగరవేసేటప్పుడు అనుకోని సంఘటనలు జరుగుతాయని, పిల్లల వెంట అప్పుడు తల్లిదండ్రులు ఉండాలని అన్నారు.

-నవతెలంగాణ,సరూర్‌నగర్

ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-సంతోష్‌నగర్

సకిల్ దయని ఆధ్వర్యంలో ముస్లిం జనరల్ ఆస్పత్రి చంద్రాయణగుట్ట నియోజకవర్గ ఎస్‌బిఐ బ్యాంక్ బారకాస్ లో ప్రధాన రహదారిపై ఉన్న అబుద్ జైదీ ఫంక్షన్ హాల్‌లో శనివారం ఉదయం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు హఫీస్ మహమ్మద్‌అలీ, ఎండి పాషహుద్దీన్, సుహేల్ దయని, అత్తర్‌మూస్, ఎంఎ హలీంబేగ్, మహమ్మద్ ఆరిఫ్, జగన్ మోహన్‌రెడ్డి, ఉస్మాన్ బిన్ ముజీద్, ఎల్‌కె శర్మ, సయ్యద్ జలాల్ ఉద్దీన్ జాఫర్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. అనంతరం వారికి పూల



మాలలు వేసి సత్కరించారు. రక్త పరీక్షలు, ఈసీజీ వంటి పరీక్షలు చేస్తారని, వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారందరికీ ఉచిత మందులను అందజేస్తామని తెలిపారు.

మహేశ్వరం నియోజకవర్గంలో మారనున్న ప్రభుత్వ పాఠశాలలు రూపురేఖలు

- విద్యాలయాలకు అధునాతన హంగులు
- మంత్రి సబితా ఇంద్రారెడ్డి
- నియోజకవర్గానికి నిధుల విడుదల

నవతెలంగాణ-బడంగ్‌పేట్

సీఎం కేసీఆర్ నాయకత్వంలో మహేశ్వరం నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల రూపు రేఖలు మారనున్నట్లు రాష్ట్ర విద్యా శాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు. శనివారం వారు మాట్లాడుతూ మన ఊరు - మన బడి మొదటి విడతలో మిగిలిన అన్ని పాఠశాలల అభివృద్ధికి రూ.9కోట్ల 13లక్షల 62వేల 800 రూపాయలు మంజూరైనట్లు తెలిపారు. అడగనిదే అమ్మ అయిన అన్నం పెట్టదు అంటారు. కానీ అడగకున్న సీఎం కేసీఆర్ సహకారంతో అన్నీ చేస్తూ నియోజకవర్గ ప్రజల మనసుల్లో చెరగని ముద్ర వేస్తున్నారన్నారు. ప్రతి రోజు ప్రజల మధ్యలో ఉంటూ ఎప్పటికప్పుడు సమస్యలు తెలుసుకుంటూ, పరిష్కరిస్తూ సౌకర్యాలు కల్పిస్తూ ముందుకు వెళ్తున్నట్టు మంత్రి చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 26వేల పైచిలుకు పాఠశాలల్లో మొదటి విడతలో 9123 పాఠశాలలు అభివృద్ధి చేస్తున్న విషయం తెలిసిందే. మహేశ్వరం నియోజకవర్గంలో ప్రత్యేకంగా 'మన ఊరు – మన బడి'లో మొదటి విడతలో ఎంపిక కాని పాఠశాలల్లో ప్రత్యేక పనులకు రూ.9కోట్ల 13 లక్షల 62 వేల 800 రూపాయల భారీ నిధులను విడుదల



చేయించినట్టు తెలిపారు. అందులో 87 పాఠశాలల్లో పెయింటింగ్‌కు రూ.2కోట్ల 87లక్షల 19వేల 200 రూపాయలు, 83 పాఠశాలల్లో మైనర్ మరమ్మతులకు రూ.2కోట్ల 45లక్షల 65వేల 200 రూపాయల నిధులు, టాయిలెట్లకు 64 పాఠశాలల్లో రూ.99లక్షల 58వేల 900 నిధులు, విద్యుత్, లైట్లకు 92 పాఠశాలల్లో ఒక కోటి 27లక్షల 28వేల 100 రూపాయలు, నల్లాల కనెక్షన్స్ కొరకు ఒక పాఠశాలలో రూ.85 వేల నిధులు, 4 పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణం కోసం రూ.1కోటి 53 లక్షల 6వేల పై చిలుకు నిధులు మంజూరు చేయించట జరిగిందన్నారు. నియోజకవర్గంపై ఉన్న ప్రత్యేక శ్రద్ధకు ఈ నిధులు నిదర్శనంగా నిలువనున్నాయని మంత్రి తెలిపారు. మహేశ్వరం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయటానికి తన వంతు కృషి చేస్తున్నానని తెలిపారు.

రంగారెడ్డి జిల్లా అభివృద్ధికి నిధుల వరద

రూ.43కోట్లతో వివిధ రకాల అభివృద్ధి పనులు త్వరలో ప్రారంభం

రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ కృషితో రంగారెడ్డి జిల్లాలో సీసీ రోడ్ల నిర్మాణాలకు సంభందించి రూ.42కోట్ల 96 లక్షలు మంజూరు అయ్యాయని విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాకు పెద్ద ఎత్తున నిధులు విడుదల చేసినందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ కు మంత్రి జిల్లా ప్రజల తరుపున ధన్యవాదాలు తెలిపారు. అందులో చేవెళ్ల నియోజకవర్గానికి ఒక కోటి 98లక్షలు, ఇబ్రహీం పట్నం నియోజకవర్గానికి 9కోట్ల 48లక్షల 50వేలు, కల్వకుర్తి నియోజకవర్గానికి 9కోట్ల 14లక్షలు, మహేశ్వరం నియోజకవర్గానికి 9 కోట్ల 6 లక్షలు,రాజేంద్రనగర్ నియోజకవర్గానికి 5 కోట్లు, షాద్‌నగర్ నియోజకవర్గానికి 8 కోట్ల 30 లక్షల 20 వేల నిధులు విడుదల అయినట్లు మంత్రి తెలిపారు. జిల్లాలోని ఆయా శాసన సభ్యుల సిఫార్సు మేరకు ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలతో నిధులు విడుదల చేసిన పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకరరావుకు ప్రత్యేకంగా మంత్రి ధన్యవాదాలు తెలిపారు.



ముసరాంబాగ్, ఎస్‌బీఐ కాలనీలోని దేవకి అపార్ట్‌మెంట్‌లో భోగి పండుగ సందర్భంగా ఉదయాన్నే భోగిమంట వేసిన అపార్ట్‌మెంట్‌వాసులు

-నవతెలంగాణ,సరూర్‌నగర్

పండుగలను ప్రతీ కుటుంబం సంతోషంగా జరుపుకోవాలి

నవతెలంగాణ-సరూర్‌నగర్

రైతుల కృషి ఫలించి పంటలు ఇళ్లకు చేరే సంతోష సమయంలో జరుపుకునే పండగే సంక్రాంతి అని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి అన్నారు. ఆర్కేపురం డివిజన్ పరిధిలోని వాసవి కాలనీలో తమ్మాన్న చారిటబుల్ ట్రస్ట్ చైర్మెన్ తమ్మాన్న లక్ష్మి సుజాత శ్రీధర్‌ల ఆధ్వర్యంలో జరిగిన భోగి మంటలు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రాష్ట్ర యువజన నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ భోగి మంటలు, రంగవల్లులు, హరిదాసుల కీర్తనలు, గంగిరెద్దుల ఆటలు, గాలిపటాల సందళ్ళు, పైరుపచ్చల కళకళలకు నెలవు కావాలని ఆకాంక్షించారు. భోగి, మకర సంక్రాంతి, కనుమ పండుగలను ప్రతీ కుటుంబం సంతోషంగా జరుపుకోవాలని కోరారు. ఈఏడాది అంతా రైతులకు శుభం జరగాలని, అంతటా కొత్త వెలుగులు నిండి భోగభాగ్యాలతో



కళకళలాడాలని, జన జీవితాలకు కొత్త వెలుగులు రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అష్టలక్ష్మి దేవాలయం చైర్మెన్ దామోదర్‌గుప్తా, మాలే శ్రీనివాస్, సూదిని శేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌గుప్తా, గౌరీ శంకర్, మాలే అనిల్, లక్ష్మి, తనూజ, లావణ్య, వంగాల శ్రీకాంత్ రెడ్డి, వరుణ్, నగేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా సామాగ్రి అందచేత



- కార్పొరేటర్ తోట శ్రీధర్‌రెడ్డి

నవతెలంగాణ-బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న నాదర్గుల్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మున్సిపల్ కార్పొరేషన్ బీజేపీ ఫ్లోర్ లీడర్ 27వ డివిజన్ కార్పొరేటర్ తోట శ్రీధర్‌రెడ్డి రూ.25వేల రూపాయల విలువైన క్రీడా సామాగ్రి అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ తోట శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ స్వామి వివేకానంద జన్మదిన వేడుకలు విద్యార్థుల మధ్య నిర్వహించుకోవడం ఎంతో ఆనందదాయకమని, భారతదేశ ఔన్నత్యాన్ని సంప్రదాయాల్ని ప్రతిష్ఠతలను ప్రపంచం మొత్తానికి తెలియజేసిన మహా మేధావి స్వామి వివేకానందుడు అని కొనియాడారు. విద్యార్థినీ విద్యార్థులు ప్రతి ఒక్కరికీ పాఠశాల దశ ఎంతో అమూల్యమైనదని, సమయాన్ని వృధా చేసుకోకుండా తాము ఎంచుకున్న మార్గంలో నిరంతరం కృషి పట్టుదలతో ముందుకు సాగుతూ ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కోరారు. అనంతరం రాష్ట్రస్థాయి మ్యాథ్స్ కాంపిటీషన్లో మొదటి బహుమతి సాధించిన విద్యార్థి శ్రీహర్షకు ప్రోత్సాహకంగా రూ.5000రూపాయల నగదు బహుకరించి, అనంతరం మ్యాథ్స్ ఉపాధ్యాయుడు వెంకట్ రెడ్డిని ప్రత్యేకంగా శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో 9వ డివిజన్ కార్పొరేటర్ నిమ్మల సునీత శ్రీకాంత్‌గౌడ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజిరెడ్డి, మాజీ వార్డు మెంబర్ పాలుబాయి లక్ష్మణ్, బుర్ర దశరథగౌడ్, వ్యాయామ ఉపాధ్యాయులు ప్రతాపరెడ్డి, మన్నెం రాజశేఖర్ రెడ్డి, బుర్ర నికిత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చైనా మాంజా అమ్ముతున్న వ్యక్తులపై కేసులు నమోదు



నవతెలంగాణ-బోడుప్పల్

పతంగుల పండుగ సందర్భంగా నిషేధిత చైనా మాంజా అమ్ముతున్న పలువురిపై కేసులు నమోదైన సంఘటన మేడిపల్లి పీఎస్ పరిధిలో శనివారం నాడు చోటుచేసుకుంది. మేడిపల్లి సీఐ గోవర్ధనగిరి తెలిపిన వివరాల ప్రకారం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ తహసీల్దారు కార్యాలయం సమీపంలో మోడేం రాజు, పీర్జాదిగూడ శ్రీనివాస క్రరి పాయింట్ వద్ద బీమాగౌని హరిబాబు అనే వ్యక్తులు తాత్కాలిక పతంగుల దుకాణం ఏర్పాటు చేసుకొని నిషేధ చైనా మాంజాను విక్రయిస్తుండడంతో విశ్వసనీయ సమాచారం మేరకు మేడిపల్లి పోలీసులు తనిఖీలు నిర్వహించి, ఇరువురి నుండి 39 మాంజా షీట్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఇంకా ఎవరైనా ఇలాంటి నిషేధ మాంజను విక్రయించడం జరిగితే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇదిలా ఉండగా సరూర్‌గర్‌లో నిషేధిత మాంజా విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు.

జీసస్ హీలింగ్ విల్లింగ్ ఆధ్వర్యంలో పేదలకు దుస్తుల పంపిణీ

నవతెలంగాణ-సంతోష్‌నగర్

సమాజంలో ఎంతోమంది దుస్తులుకొనే పరిస్థితిలో లేరని, వారిని జీసస్ హీలింగ్ విల్లింగ్ పవర్ ట్రస్ట్ సభ్యులు అలాంటి స్థితిలో ఉన్నవారిని గుర్తించి వారికి దుస్తులు పంపిణీ చేశారు. దారిద్య రేఖకు దిగువన ఎందరో ఉన్నారు. మనలో కూడా ఎందరో చేయూత అందించే స్థితిలో ఉన్నారు. మాతోపాటు మీరు కూడా ఇలాంటి కార్యక్రమాలలో పాల్గొనాలని కోరారు. కులాలకు, మతాలకు అతీతంగా జీసస్ హీలింగ్ విల్లింగ్ పవర్ సేవలు అందిస్తుంది. ఈ సంస్థకు 12ఎ, 80జీ, నీతిని అయోగ్, సీఎస్ఆర్ ఎస్పార్ సీఎస్ఆర్ ఫౌండ్ టాక్స్ ఎగ్జింటేషన్ ఉన్నవి. సంప్రదించవలసిన నంబర్లు 8639587334, 8801806477 ఈ కార్యక్రమంలో రెవరెండ్ పాస్టర్ శేషగిరి సమ్సోను, హెప్సిబా, ప్రెసిడెంట్ బి.జగదీప్, వైస్ ప్రెసిడెంట్ డి.అనురాధ, సెక్రటరీ డి.రాధిక, జాయింట్ సెక్రటరీ సరస్వతి, ట్రేజారర్ బి.ఈశ్వర్ జి.లలితమ్మ, బి. హేమలత, సంతోష్, పి.భాగ్యలక్ష్మి, జి.అన్నపూర్ణ, పి.పావని, మాధవి, ప్రిన్సిక తదితరులు పాల్గొన్నారు.



నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ

నవతెలంగాణ-సంతోష్‌నగర్

ప్రతి నిరుపేదకు ఎంఐఎం పార్టీ అండగా ఉంటుందని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల అన్నారు. శనివారం హైదరాబాద్ ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ సీఎం కేసీఆర్, కేటీఆర్ ఆదేశం మేరకు నియోజకవర్గంలో నివసించే ప్రతి నిరుపేదను ఆదుకోవడమే లక్ష్యంగా అభివృద్ధి సమక్షేమ ఫలాలు అందించి తెలంగాణ రాష్ట్రంలో ఆదర్శంగా నిలవాలన్నదే సీఎం కేసీఆర్ సంకల్పం అన్నారు. బాగ్ ఈ జహనార సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాలంతోపాటు ప్రకృతి మార్పు రావడం వల్ల చలికాలంలో నిరుపేదలకు దుప్పట్లు అవసరం అవుతాయని దృష్టిలో ఉంచుకొని ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్యే కార్పొరేటర్లు అధికారులు, నాయకులతో కలిసి 500 బెడ్‌షీట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజసేవలో యువత ముందుకు రావాలని, రాబోయే తరాలకు గుర్తుండేలా పనిచేయాలని, సేవలో భాగంగా సొసైటీ అభివృద్ధి సంక్షేమ ఫలాలు చేయూతనందించి ముందుకు రావాలని కోరారు.

రాజకీయపరంగా అభివృద్ధి చెందాలంటే ప్రజలకు సేవ చేస్తూ ప్రజలలో అవగాహన ఎంతో అవసరమని కొనియాడారు. సమాజంలో సేవా కార్యక్రమాలు చేపట్టి అందులో మనము అవగాహన అవసరమన్నారు. నిరుపేదలకు సహాయ సహకారాలు



అందిస్తే రాబోయే రోజులకు తప్పకుండా గుర్తింపు లభిస్తున్నారని ఎమ్మెల్యే గుర్తుచేశారు. ఎంఐఎం పార్టీ ఎప్పుడూ ప్రజల అండగా ఉంటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సామాన్య వ్యక్తులకు ఇలాంటి అవసరం లేదన్నా ప్రజల సేవలో సొసైటీ అసోసియేషన్ కార్యాచరణ ఇదే ముందుకు నడిపించి యువతరానికి ముందుకు తీసుకువెళుతుందని చెప్పారు. సమక్షేమ ఫలాలు అందించి దేశ అభివృద్ధికి తోడ్పడాలన్నారు. కాలంతో పాటు మనం మారి ప్రజలకు అంకితభావంతో అర్థం చేసుకొని ఆర్థికంగా వెనుకబడ్డ నిరుపేదలను ఆదుకోవడమే ఎంఐఎం పార్టీ లక్ష్యం అన్నారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా తమ దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే ప్రజలకు కోరారు. ఈ కార్యక్రమంలో లబ్దిదారులు, కార్యకర్తలు, ఎంఐఎం యాక్టివ్ సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర సర్కారు దళితులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి

ధ్యావని నర్సింహా మాదిగ

నవతెలంగాణ-హస్తినాపురం

ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలను పూర్తి స్థాయిలో అమలు పరుస్తూ రాష్ట్రంలోని పేద దళితులకు మొదటి ప్రాధాన్యత ఇచ్చే విధంగా రాష్ట్ర సర్కారు కార్యాచరణ చేపట్టాలని ఎమ్మార్పీఎస్ ఎల్.బి నగర్ నియోజక వర్గ అధ్యక్షులు ద్యావాని నర్సింహా మాదిగ అన్నారు. ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు-మేడి పాపయ్య మాదిగ, టీ.ఎస్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు-వంగపల్లి శ్రీనుల పిలుపు మేరకు మహనీయుల ఆశయాలను సాధించాలనే సంకల్పంతో అర్హులైన దళితులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 14న ఇందిరా పార్క్ వద్ద చేపట్టబోయే దండోరా మహాధర్నాను జయప్రదం చేయాలని కరపత్రాన్ని విడుదల చేశామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జాతీయ అధ్యక్షురాలు-ఆకారపు రుక్కమ్మ మాదిగ, కార్యదర్శి జి.డి.నర్సింహ్మా మాదిగ, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఈరసాని సుగుణమ్మ మాదిగ, కార్యదర్శి-సంగపాక యేసోఫ్ మాదిగ, ప్రచార కార్యదర్శి మంద జయన్న మాదిగరంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి వేముల సూర్యప్రకాష్, రామస్వామి, జలందర్, లక్ష్మయ్య, శశి, నాగరాజు, వెంకన్న, మల్లేష్, నర్సింగ్‌రావు, ఇబ్రహీంపట్నం ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారని నర్సింహ తెలిపారు.



పొంచి ఉన్న ప్రమాదం

- ట్రాన్స్‌ఫార్మర్‌ల వద్ద కానరాని రక్షణ చర్యలు
- కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్, వేలాడుతున్న ఫ్యూజు బాక్సులు
- భయాందోళనలో ప్రజలు, పట్టించుకోని విద్యుత్ శాఖ అధికారులు

నవతెలంగాణ-సరూర్‌నగర్

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి. ట్రాన్స్‌ఫార్మర్లకు ఫ్యూజ్ బాక్స్‌లకు రక్షణ ఏర్పాట్లు చేయకపోవడంతో ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంది. ట్రాన్స్‌ఫార్మర్ల మూలంగా మూగజీవాలు, చిన్నారులు ప్రమాదాల బారినపడే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సరూర్‌నగర్ డివిజన్ చౌడి వద్ద, జూనియర్ కళాశాల ముందు ట్రాన్స్‌ఫార్మర్ వైర్లు వేలాడుతున్నాయని ఫ్యూజ్ బాక్సుకు మూతలు లేక ప్రమాదకరంగా ఉన్నాయి. డాక్టర్స్ కాలనీ రోడ్ నెంబర్ 4 ఫ్యూజ్ బాక్స్ కవర్ ఏర్పాటు చేయాలని సంక్షేమ సంఘం నాయకులు విద్యుత్ అధికారులకు విజ్ఞప్తి



చేశారు. డివిజన్ పరిధిలోని ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద రక్షణ ఏర్పాట్లు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

భోగి మంటలు, గొబ్బెమ్మలు, పతంగులు

- ఆనందోత్సాహాల్లో ముగిసిన భోగి పండుగ
- భోగిమంటల కార్యక్రమంలో ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి సతీమణి కమలాసుధీర్ రెడ్డి

నవతెలంగాణ-వనస్థలిపురం

మూడు పండుగల క్రాంతి సంక్రాంతికి మొదట భోగి పండుగతో భోగి మంటలు, రంగురంగుల ముగ్గుల మధ్య లో గొబ్బెమ్మలు, ఆకాశంలో ఎగురుతున్న పతంగులతో ఆనందోత్సాహాల మధ్య భోగి పండుగ కొనసాగింది. ఇందులో భాగంగా శనివారం తెల్లవారుజామున వనస్థలిపురం డివిజన్ పరిధిలోని చింతలకుంట ప్రాంతంలో ఏర్పాటు చేసిన భోగిమంటల కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, జై చంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ కమలాసుధీర్ రెడ్డి పాల్గొని భోగిమంట వెలిగించి పండగ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పండుగలు ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని, ఆనందమైన వేడుకల్లో చిన్నా ఆయినవి తెలుగు సంస్కృతికి నాంది పలికే ముఖ్యమైన పండుగలని కొనియాడారు. ఈ సంబరాల్లో స్థానిక కాలనీవాసులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





దుర్గమ్మకు మెరుగైన వైద్యం అందించాలి

సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.చంద్రమోహన్

నవతెలంగాణ-ఎల్బీనగర్

ఆటోనగర్‌లో ఇసుక లారీ బస్టాండ్ దగ్గర ఢీకొట్టడంతో గాయపడి ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్న జనిగే దుర్గమ్మ అనే జీహెచ్ఎంసీ కార్మికురాలు వెంటనే కోలుకోవాలని శనివారం ఈఎస్ఐ హాస్పిటల్లో చికిత్స పొందుతున్న దుర్గమ్మను సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.చంద్రమోహన్, జిల్లా ఉపాధ్యక్షులు కీసర నర్సిరెడ్డి, జీహెచ్ఎంసి ఎంప్లాయిస్ యూనియన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఆలేటి ఎల్లయ్య, జిల్లా ఉపాధ్యక్షులు చుక్కమ్మ పరామర్శించారు. ఈ సందర్భంగా చంద్రమోహన్, కిసర నర్సిరెడ్డిలు మాట్లాడుతూ ఎల్బీనగర్ నియోజకవర్గంలో ఉన్న జీహెచ్ఎంసి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈనెల 20న నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. నిత్యం జీహెచ్ఎంసీ కార్మికులు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదాలకు గురిఅయిన కార్మికులకు ప్రమాద బీమా ఇన్సూరెన్స్ కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రమాదనికి గురైన కార్మికులకు వైద్యానికి అయ్యే ఖర్చును జీహెచ్ఎంసి చెల్లించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.చంద్రమోహన్, జిల్లా ఉపాధ్యక్షులు కీసరి నర్సిరెడ్డి, జీహెచ్ఎంసీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఆలేటి ఎల్లయ్యలు డిమాండ్ చేశారు. దుర్గమ్మ కాలు కోల్పోయే ప్రమాదం ఎదుర్కొంటుందని, ఇప్పటికే చాలామంది కార్మికులు తమ ప్రాణాలను కోల్పోయారని, అధికారులు జాగ్రత్త చర్యలు తీసుకోవడంలేదు అన్నారు. ప్రభుత్వం నుండి ఆ కార్మిక కుటుంబాలకు సహకారం అందడం లేదు అన్నారు. జీహెచ్ఎంసీ కార్మికులకు జీహెచ్ఎంసీ ద్వారా ప్రమాద బీమా కల్పించి తగిన నష్టపరిహారం చెల్లించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈనెల 20న జీహెచ్ఎంసి జోనల్ ఆఫీస్ ముందు ప్రమాదాల గురైన కార్మికులకు నష్టపరిహారం ఇవ్వాలని



జీహెచ్ఎంసీ కార్మికుల కనీస వేతనాలు 26 వేల రూపాయలకు పెంచాలని, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కార్మికులకు ఇవ్వాలని అనేక డిమాండ్స్‌తో ధర్నా నిర్వహించనున్నట్లు సీఐటీయూ నాయకులు తెలిపారు. అనేక మంది కార్మికులు డబుల్ బెడ్ రూమ్‌ల కొరకు దరఖాస్తు చేసుకొని సంవత్సరాల తరబడి ఎదురు చూస్తున్నారు అన్నారు. అర్హులైన జీహెచ్ఎంసీ కార్మికులందరికీ డబల్ బెడ్‌రూమ్‌లు ఇవ్వాలని పేర్కొన్నారు. కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని కోరారు. జోనల్ కార్యాలయం ముందు జరిగే ధర్నాలను జయప్రదం చేయాలని కోరారు. కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఉపాధ్యక్షులు టి.చుక్కమ్మ, అంజమ్మ, పద్మ, ప్రమీల, రవి, శ్రీరాముడు, వెంకటేష్ పాల్గొన్నారు.

నవతెలంగాణ 9
మల్కాజిగిరి
ఆదివారం 15 జనవరి 2023

ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు

- మేయర్ మేకల కావ్య



నవతెలంగాణ-జవహర్‌నగర్

ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో పండుగలు జరుపుకోవాలని మేయర్ మేకల కావ్య అన్నారు. జవహర్‌నగర్ కార్పొరేషన్ ప్రజలకు వారు సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు ఒక ప్రకటనలో తెలిపారు. కార్పొరేషన్ ప్రజలు ఆనందోత్సవాల మధ్య, సకుటుంబ సమేతంగా సంతోషంగా సంక్రాంతి పర్వదినాలను జరుపుకోవాలన్నారు. సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలని, పండుగలు ఐక్యమత్యాని చాటుతాయన్నారు.

అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పది



నవతెలంగాణ-కాప్రా

అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పది అని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, బీఎల్ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకులు బండారి లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం కాప్రా డివిజన్ పరిధిలోని నిర్మల్ నగర్‌లో రామాలయంలో సికిందర్ ఆధ్వర్యంలో జరిగిన అన్నదాన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడారు. అన్నదానం చేయడం ద్వారా అందరి ఆకలి తీర్చిన వారిమవుతామని అన్నారు. ఇలాంటి మంచి కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో బైరి నవీన్ గౌడ్, సికిందర్, మహేష్ గౌడ్, రహీమ్, అల్లం గణేష్ యాదవ్, విచెందర్, సతీష్ దండు, ముక్కురం, రవి, కార్తిక్, సురేష్, కష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పంతంగి టోల్‌ప్లాజాకు సంక్రాంతి తాకిడి..

- ప్రత్యేక చర్యలు చేపట్టిన ట్రాఫిక్ అధికారులు
- ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు అన్ని చర్యలు : డీసీపీ

నవతెలంగాణ-సిటీబ్యూరో

సంక్రాంతి పండుగ నేపథ్యంలో గ్రేటర్ వాసులు ఊరు బాటపట్టారు. దీంతో యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలోని పంతంగి టోల్‌ప్లాజాకి వాహనాల తాకిడీ భారీగా పెరిగింది. గత మూడు రోజుల్లో లక్షలల్లో వాహనాలు టోల్‌ప్లాజాను దాటాయి. గురు, శుక్ర, శనివారాల్లో రాత్రి నుంచి తెల్లవారు జాము వరకు వాహనాలు కిక్కిరిసిపోయాయి. పంతంగి, బీబీనగర్ టోల్‌ప్లాజా మీదుగా ప్రయాణించిన వాహనాల సంఖ్యను రాచకొండ ట్రాఫిక్ అధికారులు శనివారం విడుదల చేశారు. పంతంగి టోల్ గేట్ (హైదరాబాద్ - విజయవాడ) చౌటుప్పల్ మీదుగా 12న 56,595 వాహనాలు వెళ్లాయి. అందులో కార్లు - 42, 844, ఆర్టీసీ బస్సులు - 1,300, ప్రయివేటు బస్సులు - 4,913, గూడ్స్‌తోపాటు ఇతర వాహనాలు - 7,538 ఉన్నాయి. ఇక 13న 67,577 వాహనాలు టోల్‌ప్లాజా మీదుగా వెళ్లగా అందులో కార్లు - 53,561, ఆర్టీసీ బస్సులు - 1,851, ప్రయివేటు బస్సులు - 4,906, ఇతర వాహనాలు - 7,259లున్నాయి.



బీబీనగర్ టోల్ గేట్ (హైదరాబాద్ - వరంగల్)

13న మొత్తం వాహనాలు - 25231 (కార్లు - 17844, బస్సులు - 872) వరంగల్ వైపు నుంచి హైదరాబాద్‌కు చేరిన వాహనాలు మొత్తం వాహనాలు - 13334గా నమోదయ్యాయి. ఇదిలావుండగా ఎల్‌బీనగర్‌లోని విజయవాడ బస్టాండ్ వద్ద ప్రయాణికుల తాకిడి అధికంగా కనిపించింది. పంతంగి టోల్ గేట్ వద్ద రాత్రి 10 నుంచి అర్ధరాత్రి 1 గంటల మధ్య భారీ వాహనాలు వెళ్లాయి.

రోడ్లపై నిల్చోరాదు: డీసీపీ డి.శ్రీనివాస్



సంక్రాంతి పండుగ నేపథ్యంలో గ్రేటర్ వాసులు తమ సొంత గ్రామాలకు వెళ్తున్నారని, దాంతో టోల్ ప్లాజాల వద్ద వాహనాల రద్దీ పెరిగిందని రాచకొండ ట్రాఫిక్ డీసీపీ డి.శ్రీనివాస్ తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ.. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు అన్ని చర్యలు చేపట్టినట్టు పేర్కొన్నారు. ట్రాఫిక్ విభాగం, ఆర్టీసీ సంస్థ నుంచి ప్రత్యేక బృందాలను రంగంలోకి దించామన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సిబ్బం దిని అలర్ట్ చేశామన్నారు. ముఖ్యంగా ప్రయాణికులు రోడ్లపై నిల్చోవ ద్దన్నారు. బస్ షెల్టర్ల వద్దే బస్సుల కోసం వేచి చూడాలని, అనధికార వాహనాల్లో ప్రయాణించొద్దని కోరారు. వాహన దారులు, డ్రైవర్లు రోడ్లపైకి వచ్చే ముందే వాహనం కండిషన్‌ను పరిశీలించు కోవాలన్నారు. బస్టాండ్‌లలో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా చూడాలని, క్రమ పద్ధతిలో వాహనాలను నిలపాల న్నారు. రహదారులపై వెళ్తున్న వాహనాలతో సాధారణ ప్రయా ణికులకు ఇబ్బం దులు కలిగించొందన్నారు. అంతరాయం కలిగిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రయా ణికులు, వాహన దారులు ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని డీసీపీ కోరారు.

నిషేధిత మాంజా విక్రేయదారుల అరెస్ట్



- జవహర్‌నగర్ పీఎస్ పరిధిలో ఆరుగురు, ఎల్బీనగర్ పీఎస్ పరిధిలో మరో ఆరుగురు అరెస్టు

నవతెలంగాణ-జవహర్‌నగర్

నిషేధిత మాంజాను విక్రయిస్తున్న దుకాణాదారులను పోలీసులు పట్టుకుని మాంజాను స్వాధీనం చేసుకున్నారు. జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆరుగురిని పోలీసులు పట్టుకోగా, ఎల్బీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మరో ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. జవహర్‌నగర్ సీఐ కె. చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. పోలీస్ స్టేషన్ పరిధిలోని వలు ప్రాంతాల్లో సంక్రాంతి పండుగను దృష్టిలో పెట్టుకుని ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు పోలీసులు. ఈ క్రమంలో 29 షాపుల్లో తనిఖీలు నిర్వహించగా 6 షాపుల్లో గాలి పటాలు, నిషేధిత మాంజా ఉండలు అమ్ముతున్నారు. దాంతో వారిని పోలీసులు అరెస్టు చేశారు. నిందితులు బిమగొండ నగేశత్, జంగ్, ఎర్రం శ్రీనివాస్, బోనగిరి మహేష్, కానుకుంట విశాల్, వెంకటస్వామిలుగా గుర్తించి పోలీస్ స్టేషన్ కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అలాగే ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిషేధిత మాంజా విక్రయిస్తున్న మరో ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు.

శరవేగంగా ఎయిర్‌పోర్టు మెట్రో నిర్మాణ ముందస్తు కార్యక్రమాలు

నవతెలంగాణ-సిటీబ్యూరో



ఎయిర్‌పోర్ట్ మెట్రో పనులను వేగవంతం చేయడానికి సమాంతరంగా అనేక ముందస్తు నిర్మాణ కార్యకలాపాలు ప్రారంభించడం జరిగిందని, అవి శరవేగంగా సాగుతు న్నాయని హైదరాబాద్ ఎయిర్ పోర్ట్ మెట్రో లిమిటెడ్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. జనరల్ కన్సల్టెంట్ (జీసీ) కోసం బిడ్‌ల సమర్పణకు ఈ నెల 20 చివరి తేదీ కాగా, ఈ నిపుణులైన ఇంజినీరింగ్ కన్సల్టెంట్లు వచ్చే నెల మొదటి వారంలో నియమితుల వుతారు. ఈలోగా మెట్రో అలైన్‌మెంట్‌ను పక్కాగా సరిదిద్దడానికి, స్టేషన్ల స్థానాలను నిర్ణయించడానికి సర్వే పనులు ముమ్మరంగా సాగుతు న్నాయి. శాటిలైట్ ఆధారిత డిఫరెన్షియల్ గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్, ఎలక్ట్రానిక్ టోటల్ స్టేషన్ అనే రెండు పద్ధతులు ఉపయోగించి, ఖచ్చితమైన కోఆర్డినేట్‌లను తెలుసుకోవడం కోసం సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామ్‌ల సాయంతో సర్వే పని జోరుగా జరుగుతోంది.

శంషాబాద్ పట్టణానికి సమీపంలోని ఫోర్ట్ గ్రాండ్ అండర్‌పాస్ వరకు ఇప్పటివరకు 21 కిలోమీటర్ల మేర సర్వే పూర్తయింది. ఈ నెలాఖరులోగా మొత్తం సర్వే పూర్తి కానుందని, ఆ తర్వాత అలైన్మెంట్‌ను తెలియజేసేలా పెగ్ మార్కింగ్ ప్రారంభిస్తామని ఎన్వీఎస్ రెడ్డి ప్రకటించారు. స్టేషన్ స్థానాలను గుర్తించడానికి ఢిల్లీ మెట్రో వారు తయారు చేసిన డీపీఆర్‌మామూలు రైల్వే ఇంజనీరింగ్ పద్ధతిని అనుసరించగా, నానక్రామ్‌గూడ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, కోకాపేటలలో గత కొన్ని సంవత్సరాలుగా జరిగిన భారీ వాణిజ్య, నివాస అభివృద్ధిని గుర్తించడం ద్వారా ఇప్పు డు ఒక వినూత్న విధానాన్ని అవలంబిస్తున్నాయని ఆయన అన్నారు. నానక్‌రాంగుడా, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, కోకాపేట, నార్సింగి, రాజేంద్రనగర్, శంషాబాద్ వంటి ప్రాంతాల అభివృద్ధికి హెచ్‌ఎండీఏ మాస్టర్ ప్లాన్‌ను దృష్టిలో ఉంచు కొని, నగరాన్ని దాని శివార్లలోకి విస్తరించడం, పని ప్రదేశాలకు అరగంట కంటే తక్కువ ప్రయాణ దూరంలో సరసమైన ధరలకు గృహాలను అందించాలనే సీఎం కేసీఆర్ దార్శనికతకు అనుగుణంగా ఎయిర్ పోర్ట్ మెట్రోను రూపొందిస్తున్నామని ఎండీ పేర్కొన్నారు. ట్రాఫిక్ సర్వేలో స్థానిక ట్రాఫిక్ పోలీసు ఇన్‌స్పెక్టర్లను జతచేయడం వల్ల స్టేషన్ స్థానాలను సరిగా గుర్తించడంలోను, స్టేషన్ యాక్సెస్ సౌకర్యాలను తక్కువ ఖర్చుతో రూపొందించడంలోను మంచి ఫలితాలను ఇస్తోందని ఆయన అన్నారు.

17న సంగీత దర్శకుడు కోటి సాలూరికి సినారె ఆళ్ల స్వర్ణకంకణ పురస్కారం



నవతెలంగాణ-కల్చరల్

%శ22:20, 14/01/2023రి వీఎ జీక్ష్మిఉ%: విఖ్యాత కవి డాక్టర్ సి.నారాయణరెడ్డి సినీ గీత రచయిత గా సినీ రంగ ప్రవేశం చేసి 61 వత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భం గా సినీ సంగీత దర్శకుడు కోటి సాలూరి కి సినారె అళ్ల స్వర్ణ కంకణం బహుకరణ సభ ఈ నెల 17 న సాయంత్రం రవీంద్రభారతి ప్రధాన వేదిక క పై నిర్వహిస్తున్నామని వంశీ ఆర్ట్ థియేటర్స్ అధినేత వంశీ రామ రాజు పత్రికా విలేకరులకు తెలిపారు. అమెరికా కు చెందిన డాక్టర్ అళ్ల శ్రీనివాస రెడ్డి స్వర్ణ కంకణం నెలకొల్పారని నాటి కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కే.వీ.రమణ పాల్గొనగా అమెరికా నుంచి అళ్ల శ్రీనివాస రెడ్డి, ప్రసాద్ తోటకూర లతో పాటు సినీ దర్శకులు రేలంగి నరసింహారావు,కోదండరామి రెడ్డి, బి.గోపాల్,కవి వెనిగేళ్ల రాం బాబు, లక్ష్మీ తుమ్మల, తదితరులు పాల్గొంటారు. అమెరికా లో స్థిరపడ్డ గాయని ఆకునూరి శారద నిర్వహణ లో బాల కమేశ్వర రావు, వినోద్ బాబు, రమణ శీలం,రామ కృష్ణ ల సినీ గాన విభావరి సుధామయి వ్యాఖ్యానం తో ఉంటుందని రామ రాజు వివరించారు

మల్లాపూర్ డివిజన్‌లో సంక్రాంతి వేడుకలు



నవతెలంగాణ-కాప్రా

మల్లాపూర్ డివిజన్ పరిధిలోని తిరుమల మిల్లీనియం అపార్ట్‌మెంట్ వాసులు సంక్రాంతి పండుగా సందర్భంగా ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలకు ముఖ్య అతిథులుగా స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా గంగిరెద్దుల విన్యాసాలు అపార్ట్‌మెంట్ వాసులతో కలిసి తిలకించారు. అనంతరం ముగ్గుల పోటీల్లో పాల్గొన్న వారికి బహుమతుల రూపంలో మొక్కలను కార్పొరేటర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో తండా వాడుగౌడ్, రాపోలు శ్రీనివాస్, అపార్ట్‌మెంట్ వాసులు పాల్గొన్నారు.

సంక్రాంతి పండుగ సందర్భంగా మల్లాపూర్ డివిజన్, ఎస్వీ నగర్ కాలనీలో బీఆర్ఎస్ నాయకుడు నిమ్మల శ్రవణ్ రెడ్డి ఆధ్వర్యంలో కేసీఆర్ చిత్రాలతో పతంగులు ఎగిరేసే కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి , డివిజన్ అధ్యక్షులు పల్లా కిరణ్ కుమార్ ప్రధాన కార్యదర్శి తాండ వాసుదేవ్ గౌడ్, కాలనీ అధ్యక్షులు నెమలి రవి కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొని పతంగులను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో నిమ్మల వెంకటరెడ్డి, నెమలి శ్రవణ్, శ్యామసుందర్ రెడ్డి, సీతాల విజయ్ బేతల మల్లేష్, అల్లాడి కష్ణా యాదవ్, చిగుళ్ల మల్లేష్, భూమండ్ల శ్రీశైలం, రాజు, రాపోలు శ్రీనివాస్, నర్సింగరావు, కుమార్ యాదవ్, సూర్య శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు

మాజీ మేయర్‌ను కలిసిన ఆటో యూనియన్ సభ్యులు



నవతెలంగాణ-కాప్రా

మాజీ మేయర్ రామ్మోహన్, కార్పొరేటర్ శ్రీదేవి యాదవ్‌లను గట్స్ ఐజీ కాలనీ ఆటో యూనియాన్ సభ్యులు ముత్యాలు, నజీర్, నర్సింగరావు, వెంకట్ రెడ్డి, అశోక్, నాగేష్, రమేష్, కుమార్, కృష్ణలు శనివారం భోగి పండుగ సందర్భంగా కలిసి శుభాకాంక్షలు తెలియ జేశారు. నూతనంగా ఎన్నికైన సభ్యులకు బొంతు దంపతులు శుభాకాంక్షలు తెలియజేసి సన్మానించారు.

కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ

మాజీ మేయర్ బొంతు రామ్మోహన్,చర్లపల్లి కార్పొరేటర్ శ్రీదేవి యాదవ్‌ను భోగి పండుగ సందర్భంగా మారుతి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు పలుగుల మహేందర్, ఐక్య వేదిక మేడ్చల్ జిల్లా అధ్యక్షులు హనుమంత్ నాయక్, కాలనీ జనరల్ సెక్రటరీ సుధాకర్, ట్రెజరీ తాళ్ల శ్రీనివాస్ , ఆర్గనైజింగ్ సెక్రటరీ మల్లేష్ గౌడ్, టెంపుల్ చైర్మెన్ చందు నాయక్, ఉపాధ్యక్షులు రమణ , శ్రీనివాస్ , మధుసూధన్ రెడ్డి , పబ్బా జగదీష్, కిషన్ నాయక్ తదితర నేతలు పాల్గొన్నారు.





చక్రిపురం కాలనీలో నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-కాప్రా

చక్రిపురం సంక్షేమ సంఘం కార్యాలయంలో కాలనీ క్యాలెండర్‌ను కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు మొగిలి రాఘవరెడ్డి, ప్రధాన కార్యదర్శి కట్కూరి బుచ్చిరెడ్డిలు శనివారం ఆవిష్కరించారు. విద్యా ఇంజనీరింగ్ అధినేత డి మల్లారెడ్డి, వీఎస్ రెడ్డి రెడ్డిస్ చికెన్ మార్ట్ వెంకట్ రెడ్డి, శ్రీ రత్న రెస్టారెంట్ చిట్టిబాబు, అర్క హెల్త్ కేర్ డాక్టర్ బాబు రాజు సహకారంతో క్యాలెండర్ ముద్రించారు. ఈ కార్యక్రమంలో కాలనీ ఉపాధ్యక్షులు డీఎం కొండారెడ్డి, సోమసాని అశోక్, కోశాధికారి అర్జున్ వరాల, ఉప కోశాధికారి సంతోష్, జాయింట్ సెక్రెటరీ జగన్మోహన్ రెడ్డి, జి మురళి, ప్రచార కార్యదర్శి ఎర్రయ్య, వెంకటేష్ గుప్తా, సలహాదారులు మాన్సింగ్, ఎం వేణుగోపాల్ రెడ్డి, గంగిరెడ్డి, పి వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చక్రిపురం కాలనీ అధ్యక్షులు మొగిలి రాఘవరెడ్డి సంక్షేమ సంఘం తరపున కాలనీవాసులందరికీ నూతన సంవత్సర, సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.



రామంతపూర్‌లోని జనప్రియ అపార్ట్‌మెంట్‌లో నిర్వహించిన ముగ్గులపోటీల్లో పాల్గొన్న యువతులు. జనప్రియ మేనేజింగ్ కమిటీ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు.

నవతెలంగాణ-సిటీబ్యూరో

గాలిపటాలు పంపిణీ చేసిన బీఆర్ఎస్ నాయకులు



నవతెలంగాణ-కాప్రా

చర్లపల్లి డివిజన్‌లో శుభోదయ నగర్ కాలనీ బాల్ రెడ్డి ఆఫీస్ దగ్గర నగర మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ చిత్రాలతో రూపొందించిన గాలిపటాలను బీఆర్ఎస్ డివిజన్ నాయకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సంక్రాంతి పండుగ సందర్భంగా సాంప్రదాయంగా ఎగురవేసే గాలిపటాలను పంపిణీ చేయడం, అందరూ కలిసి ఒకే చోట ఎగురవేయడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగిళ్ల బాల్ రెడ్డి, బొడిగ ప్రభు గౌడ్, బతుల శ్రీకాంత్ యాదవ్, బుచన్నగరి శ్రీకాంత్ రెడ్డి, రాజు గౌడ్, ధనుంజయ్ గౌడ్, తోటకూర సురేష్ రెడ్డి, గణేష్ గౌడ్, రెహమాన్, రామకృష్ణ తదితరులున్నారు.



నాగారంలో శనివారం జరిగిన ముగ్గుల పోటీలను నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి ,కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్ గౌడ్‌లు పరిశీలించారు.

నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్



దమ్మాయిగూడాలోని రాజీవ్ గృహ కల్ప కాలనీలో శనివారం పతంగులు ఎగుర వేస్తున్న యువకులు

నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

IN THE COURT OF THE HON'BLE PRL JUNIOR CIVIL JUDGE, R.R DISTRICT AT MAHESHWARAM
O.S.NO. 322 OF 2021

Between:-
Gaddamidi @Thota Narsimha .....Petitioner/Plaintiff
AND
Gaddamidi @ Thota Yadamma & others ....Respondents/Defendants

To,
Rao Raj Kumar S/o Late Rama Rao, Aged about 65 years, Occ: Business, R/o. H.No.9-6-76 Reddy Colony, Champapet, Saroor Nagar Mandal, Ranga Reddy, Dist. Telangana State. ....Defendant No.7

Please take Notice that my client Gaddamidi @ Thota Narsimha has filed the above case for partition and Separate possession in respect of the suit schedule property on the file of the Junior Civil Judge, cum XVII Addl. M.M. Court at Maheshwaram Ranga Reddy District. The above said case is posted to 19-01-2023 for your appearance on 19-01-2023 at 10.30 A.M. personally or through on advocate or Else the matter will decided Ex-Party

SCHEDULE OF PROPERTY

All the Agriculture land total Admeasuring Ac.3-02gts in Sy No.78/ Situated at Pulimamidi Village, Kandukur Mandal, Ranga Reddy Dist. Bounded by NORTH: Agriculture Land of G.Ramulu. SOUTH: Agriculture Land of G.Badraji. EAST: Agriculture Land of Sathish kumar. WEST: Road& Akhanpally Village, Shivar.

(BY THE ORDER OR THE COURT)
E.ESRAYAL, Advocate

PUBLIC NOTICE

The Public are hereby informed that a case is filed in O.S.NO.150/2022 on the file of the Hon'ble III Senior Civil Judge Court, at Secunderabad CCC complex. Notifying 1) M/s Laxmee Narsimha Construction,2) A. Harinath S/o A. Bikshapathi. 3) M. Rangaiah Goud S/o M. Sataiah Goud, 4) A. Harshavardhan S/o A.Harinath, all R/o Kavadiguda, Secunderabad. The parties No.1 to 4 are called upon to appear before the Hon'ble Court on 06-03-2023 for settlement of issues, in a suit for specific performance on an agreement of sale for property located at H.No.12-10-194 & 195, Sri Sai Ram Nilayam, Seethaphalmandi, Secunderabad, Failure by the parties to appear before the Hon'ble Court, may results in Ex-parte Orders being issued by the Hon'ble Court. Public having knowledge of the parties whereabouts, are requested to inform the above parties of this public notice.

J.C. Francis & Associates
Advocate
11-3-389/B, chappal Bazar, Kachiguda, Hyderabad 500027
9133175857

IN THE COURT OF THE HON'BLE PRL JUNIOR CIVIL JUDGE, R.R.DISTRICT AT MAHESHWARAM
I.A. No. 958 OF 2021
IN
O.S.NO. 322 OF 2021

Between:-
Gaddamidi @ Thota Narsimha ....Petitioner/Plaintiff
AND
Gaddamidi @ Thota Yadamma & others ....Respondents/Defendants

To,
Rao Raj Kumar S/o Late Rama Rao, Aged about 65 years, Occ: Business, R/o H.No.9-6-76, Reddy Colony, Champapet, Saroor Nagar Mandal, Ranga Reddy, Dist. Telangana State. ....Respondent No.7

Please take Notice that my client Gaddamidi @ Thota Narsimha has filed the above case for partition and Separate possession in respect of the suit schedule property on the file of the Junior Civil Judge, cum XVII Addl. M.M. Court at Maheshwaram Ranga Reddy District. The above said case is posted to 19-01-2023 for your appearance on 19-01-2023 at 10.30 A.M. personally or through on advocate or Else the matter will decided Ex-Party

SCHEDULE OF PROPERTY

All the Agriculture land total Admeasuring Ac.3-02gts in Sy. No.78/ Situated at Pulimamidi Village, Kandukur Mandal, Ranga Reddy Dist. Bounded by NORTH: Agriculture Land of G.Ramulu. SOUTH: Agriculture Land of G.Badraji.EAST: Agriculture Land of Sathish kumar. WEST Road & Akhanpally Village, Shivar.

(BY THE ORDER OR THE COURT)
E.ESRAYAL, Advocate

IN THE COURT OF THE HON'BLE I ADDL. SENIOR CIVIL JUDGE RANGA REDDY DISTRICT, AT L.B. NAGAR.
O.S.NO. 527 OF 2020

Between:
Mohammed, S/o Late. Mehboob Ali ....Plaintiff
AND
The Tahsildar &another ....Defendant

NOTICE

To,
Chintamaani Sree Lakshmi Ranganayakamma,W/o Hanumantha Rao, R/o Chaitanyapuri, Kothapet Village, Hyderabad, Telangana State. ....Defendant No.2

Madam,

Please take notice that the above named plaintiff have filed the Suit being O.S.NO. 527 OF 2020, for Declaration, Injunction & Specific Performance against Defendants and the said Suit is stand posted to 13-02-2023 at 10.30 A.M., for your appearance. If any person or persons have got any objections, they may appear before the above said Hon'ble Court on the above said date and time, failing which the matter will be decided as per law.

("By Order Of the Court")
ADVOCATE
(SYED KAREEMULLAH)
(AP/2011/2006).
Off: Flat No. 102, First Floor, City Prime Complex in Premises No. 22-2-199, Komatwadi, I/s Dabeerpura, Hyderabad, Telangana State-500024.

IN THE COURT OF THE HON'BLE I ADDL. SENIOR CIVIL JUDGE RANGA REDDY DISTRICT,AT L.B. NAGAR.
I.A.NO. 344 OF 2020
IN
O.S.NO. 527 OF 2020

Between:
Mohammed, S/o Late. Mehboob Ali ....Petitioner/Plaintiff
AND
The Tahsildar & another ....Respondent / Defendant

NOTICE

To,
Chintamaani Sree Lakshmi Ranganayakamma,W/o Hanumantha Rao, R/o Chaitanyapuri, Kothapet Village, Hyderabad, Telangana State. .....Respondent No.2

Madam,

Please take notice that the above named petitioner have filed the above I.A. No. 344 Of 2020 in O.S.NO. 527 OF 2020, for Interim Injunction Petition against Respondents and the said I.A. is stand posted to 13-02-2023 at 10.30 A.M., for your appearance. If any person or persons have got any objections, they may appear before the above said Hon'ble Court on the above said date and time, failing which the matter will be decided as per law.

("By Order Of the Court")
(SYED KAREEMULLAH)
(AP/2011/2006).
Off: Flat No. 102, First Floor, City Prime Complex in Premises No. 22-2-199, Komatwadi, I/s Dabeerpura, Hyderabad, Telangana State-500024.

గుండాల మోడల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం

నవతెలంగాణ-అడిక్ మెట్



ముషీరాబాద్ నియోజకవర్గంలో గుండాల మోడల్ ఫౌండేషన్ ఎనిమిదవ వార్షికోత్సవం సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఫౌండేషన్ ఫౌండర్ వనజారాణి సత్యనారాయణ హాజరై మాట్లాడుతూ తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రజలకు అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. ప్రభుత్వ హాస్పిటల్స్‌లో ఉచితంగా మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలు తమవంతుగా ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ నాయకులు మనోజ్ కుమార్, మోహన్, శంకర్, మోహన్ దాస్, నర్సింగరావు, తదితరులు పాల్గొన్నారు.

పీజేఆర్ ఫౌండేషన్ క్రికెట్ పోటీల్లో బోరబండ టీం విజేత

నవతెలంగాణ-బంజారాహిల్స్



మాజీ సీఎల్పీ నాయకులు పి.జనార్దన్ రెడ్డి 76వ జయంతిని పురస్కరించుకుని పీజేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఖైరతాబాద్‌శాఖ గ్రౌండ్స్‌లో ఈ నెల 12,13 వ తేదీల్లో మూడో జీజేఆర్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంటు నిర్వహించారు. ఇందులో మొత్తం 62 టీంలు పాల్గొనగా విజేతగా బోరబండ టీం నిలిచింది. ఈ టీంకు సీసీకు రూ.25 వేలతోపాటు రన్నర్‌గా నిలిచిన నాయక్ సీసీ టీంకు రూ.10వేల నగదుతోపాటు ట్రోఫీలను పీజేఆర్ ఫౌండేషన్ చైర్మన్, కార్పొరేటర్ విజయారెడ్డి అందజేశారు. అనంతరం ఖైరతాబాద్ నియోజకవర్గంలోని రామకృష్ణ నగర్ ఎర్ర మంజీల్లో రామకృష్ణ నగర్ యువకులు ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులను ప్రధానం చేశారు.

దురాలోచనలను భోగి మంటల్లో కలపాలి

- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత
- కేబీఆర్ పార్కు వద్ద భోగి వేడుకలు

నవతెలంగాణ-బంజారాహిల్స్

దురాలోచలను భోగి మంటల్లో కలపాలనీ, దేశ ప్రజలు దురాలోచనలను విడనాడాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. శనివారం బంజారాహిల్స్ కేబీఆర్ పార్క్ ప్రధాన గేటు వద్ద భారత్ జాగృతి ఆధ్వర్యంలో జరిగిన భోగి వేడుకల్లో ఎమ్మెల్సీ పాల్గొని మాట్లాడారు. తెలంగాణ జాగృతి భారత జాగృతిగా రూపొందిన తర్వాత మొట్టమొదటి కార్యక్రమంగా సంక్రాంతి సంబురాలు చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. హరిదాసులు, బసవన్నల దీవెనలతో భారతదేశం వర్ధిల్లాలని కవిత ఆకాంక్షించారు. అందరూ నెగటివ్ ఆలోచనలను వదిలేసి, దేశం కోసం, సమాజం కోసం పాటుపడాలని సూచించారు. శతాబ్దాల క్రితం మారిషస్ వెళ్లి అక్కడ స్థిరపడిన తెలుగు సమాజం ప్రతినిధులు ఈ కార్యక్రమంలో అతిథులుగా పాల్గొన్నారు. మారిషస్ దేశంలో తెలుగు సంస్కృతిని కాపాడేందుకు తరతరాలుగా కృషి చేస్తున్న మారిషస్ తెలుగు సంఘం ప్రతినిధులకు, అక్కడ జరగనున్న తెలుగుమహాసభలకు తమ సహకారం ఉంటుందని ఎమ్మెల్సీ కవిత తెలిపారు. నగరంలోనే పూర్తి గ్రామీణ వాతావరణాన్ని ఏర్పాటు చేసి భోగి వేడుకలు నిర్వహించిన భారత్ జాగృతి నగర ప్రతినిధులను ఎమ్మెల్సీ కవిత అభినందించారు. ఈ కార్యక్రమంలో టీఎస్ ఫుడ్స్ కార్పొరేషన్ ఛైర్మన్ మేడె రాజీవ్ సాగర్, భారత్ జాగృతి ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి, బీఆర్ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్ యాదవ్, భారత్ జాగృతి హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు అనంతుల ప్రశాంత్, మారిషస్ తెలుగు మహాసభ ప్రతినిధులు, స్థానిక కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి, మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





అభివృద్ధిలో కాంట్రాక్టర్లు భాగస్వామ్యం కావాలి

- ఉచిత విద్యుత్‌ను అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ
- రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి
- తెలంగాణ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-సిటీబ్యూరో



తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని రాష్ట్ర విద్యుత్ శాఖామంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి పిలుపునిచ్చారు. తెలంగాణ విద్యుత్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ రూపొందించిన 2023 డైరీ, క్యాలెండర్‌ను ఆయన శనివారం సూర్యాపేటలోని క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్కే.మాజిద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి జగదీష్ రెడ్డి మాట్లాడుతూ కొత్త జిల్లాల ఏర్పాటు విద్యుత్ కాంట్రాక్టర్లతోపాటు యావత్ రైతాంగానికి ఎంతో దోహదపడుతుందన్నారు. సుదూర ప్రాంతాల నుంచి ట్రాన్స్‌ఫార్మర్స్ ఇతర పరికరాలు సరఫరా చేసే భారం తప్పిందన్నారు. కొత్త జిల్లాల ఏర్పాటుతో విద్యుత్‌శాఖ జిల్లాల వారీగా స్టోర్స్ ప్రారంభించడంతో మారుమూల ప్రాంతాలకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లతోపాటు ఇతర పరికరాలు సరఫరా సులభ తరమైందన్నారు. ఇలాంటి అంశాలు విద్యుత్ కాంట్రాక్టర్లు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. యావత్ దేశంలో వ్యవసాయానికి 24 గంటల నిరంతర ఉచిత విద్యుత్ నందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అన్నారు. అందుకు సీఎం కేసీఆర్ సంకల్ప సిద్ధియే తార్కాణమని కొనియాడారు. తెలంగాణ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ పేరుతో సకల సమాచారంతో డైరీ, క్యాలెండర్లు రూపొందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యుత్ లైసెన్సింగ్ బోర్డ్ డైరెక్టర్ పర్వతాలు, అసోసియేషన్ సూర్యాపేట ప్రెసిడెంట్ వేణుగోపాల్, హుజుర్‌నగర్ ప్రెసిడెంట్ జానకి రామిరెడ్డి, నల్గొండ ప్రెసిడెంట్ యాదగిరి, సత్తిరెడ్డి, వహీద్, నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ను విమర్శించే స్థాయి బీజేపీ నాయకులకు లేదు



- బీఆర్ఎస్ గాంధీనగర్ డివిజన్ అధ్యక్షులు రాకేష్ కుమార్

నవతెలంగాణ-అడిక్ మెట్

గాంధీనగర్ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్‌కు ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ను విమర్శించే స్థాయి లేదనీ, అభివృద్ధికి అడ్డుపడితే బస్తీలో తిరగనివ్వమని బీఆర్ఎస్ గాంధీనగర్ డివిజన్ అధ్యక్షులు రాకేష్ కుమార్ తెలిపారు. శనివారం గాంధీనగర్ బీజేపీ నాయకులు వినయ్ కుమార్ వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ గాంధీనగర్ ఎమ్మెల్యే కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వినయ్ కుమార్ కు ఎమ్మెల్యేని విమర్శించే స్థాయి లేదన్నారు. ముందుగా తమ స్థాయి తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు రాజీనామాలు కొత్తేమీ కాదనీ, ప్రజా సమస్యలపై పోరాడుతూ రాజీనామాలపై వెలసిన పార్టీ అన్నారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్ రాజీనామా చేస్తే రూ.500 కోట్లు వస్తాయన్న బీజేపీ నాయకులు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి రాజీనామా చేస్తే ఎన్ని వేల కోట్లు వస్తాయో చెప్పాలన్నారు. ముషీరాబాద్ నియోజకవర్గం అభివృద్ధి పథంలో నడుపుతూ రెండు గ్రంథాలయాలు, ప్రభుత్వ మహిళా కళాశాల, నియోజకవర్గం అభివృద్ధికి వందల కోట్లు తీసుకొచ్చిన ఘనత ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు దక్కుతుందన్నారు. రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా ఉన్న లక్ష్మణ్ కు నియోజకవర్గంపై కనీస అవగాహన లేదన్నారు. తమ ఎమ్మెల్యే నియోజకవర్గంలో ప్రతి బస్తీ ప్రతి గల్లీలో పర్యటించారని తెలిపారు. ముఠా గోపాల్ పర్యటించని బస్తీని మీరు చూపిస్తూ దేనికైనా సిద్ధంగా ఉన్నామని సవాల్ విసిరారు. అభివృద్ధి పనులకు అవసరమయ్యే వ్యయంపై ప్రత్యేక ప్రాణాళిక రచించాలన్నారు. ఎవరో పైరవీలు చేస్తూ ఫోన్లు చేస్తే నిధులు రావన్న సత్యాన్ని గ్రహించాలన్నారు. ఏ విధంగా నిధులు వస్తాయి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి గతంలో ఎమ్మెల్యేగా ఉన్నారు ఆయనను అడిగి తెలుసుకోవాలన్నారు. మళ్లీ ఎమ్మెల్యే పై ఇష్టానుసారంగా మాట్లాడితే మిమ్మల్ని బస్తీల్లో తిరగనివ్వమని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు ముఠా నరేష్, ప్రధాన కార్యదర్శి పోతుల శ్రీకాంత్, ఎర్రం శ్రీనివాస్ గుప్తా, మారిశెట్టి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మూడో అంతస్తు నుంచి దూకిన డెలివరీ బాయ్..

నవతెలంగాణ-బంజారాహిల్స్

డెలివరీ బాయ్ మూడో అంతస్తు నుంచి కిందకు దూకాడు. ఈ ఘటన బంజారాహిల్స్ హిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. తన కస్టమర్ కుక్క తన వద్దకు దూసుకురావడంతో భయపడిపోయి మూడో అంతస్తు నుంచి దూకేశాడు. దీంతో ఫుడ్ డెలివరీ బాయ్‌కు తీవ్రంగా గాయాలు అయ్యాయి. తలకు బలమైన దెబ్బ తగలడంతో ప్రాణాలు నిలుపుకోవడానికి ఆస్పత్రిలో పోరాడుతున్నాడు. కేసు నమోదుచేసుకున్న పోలీసులు ఈ ఘటనపై విచారణ జరుపుతున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి... ఫుడ్ పార్శిల్ డెలివరీ చేయడానికి వెళ్లిన ఫుడ్ డెలివరీ బాయ్ మీదకు ఒక్కసారిగా కస్టమర్ కుక్క దూసుకురావడంతో భయాందోళనకు గురై అతను మూడో అంతస్తు నుంచి దూకేశాడు. ఈ క్రమంలోనే తీవ్రంగా గాయాలు అయ్యాయి. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ప్రాణాపాయ స్థితిలోనే ఉన్నాడని వైద్యులు తెలిపారు. ఈ మొత్తం విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు కస్టమర్ పై పోలీసులు కేసు నమోదు చేశారు. డెలివరీ బాయ్ ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడనీ, ఇంకా ఐసీయూలోనే ఉన్నాడని పోలీసులు తెలిపారు. రోడ్డు నెంబర్ 6లోని లుంబినీ ర్యాక్ క్యాజిల్ భవనంలో నివసిస్తున్న శోభనా నాగాని అనే కస్టమర్ ఆన్‌లైన్‌లో ఫుడ్ ఆర్డర్ చేశారు. ఆర్డర్ తీసుకున్న తర్వాత.. స్విగ్గీ డెలివరీ బాయ్ మహ్మద్ రిజ్వాన్ పార్శిల్ ఇవ్వడానికి వెళ్లి డోర్ కొట్టాడు. 11 ఏండ్ల జర్మన్ షెపర్డ్ కుక్క తలుపు తెరవగానే మొరగడంతో పాటు డెలివరీ బాయ్ మీదకు దూసుకొచ్చింది. దీంతో భయపడిపోయిన అతను మూడో అంతస్తు నుంచి దూకేశాడు. తాను కుక్కకు భయపడి తిరిగి పరుగెత్తుతుండగా కుక్క తనను వెంబడించిందని బాధితుడు పోలీసులకు చెప్పాడు. ఈ క్రమంలోనే ఆలోచించకుండా భయంతో భవనంపై నుంచి దూకినట్టు పోలీసులకు తెలిపాడు. శోభన కిందకు పరుగెత్తి రక్తపు గాయాలతో పడి ఉన్న అతడిని చూసి నిమ్స్‌కు తరలించారు. తలకు గాయాలైన రిజ్వాన్ పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. ఇంకా అతను ఐసీయూలోనే ఉన్నాడని సమాచారం. కాగా, రిజ్వాన్ మూడేళ్లుగా డెలివరీ ఏజెంట్‌గా పని చేస్తున్నాడు. బాధితురాలి సోదరుడి ఫిర్యాదు మేరకు పోలీసులు శోభనపై ఐపీసీ సెక్షన్ 336 (ఇతరుల ప్రాణాలకు లేదా వ్యక్తిగత భద్రతకు ముప్పు), 289 (జంతువు విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం) కింద కేసు నమోదు చేశారు.

సంక్రాంతి సంబురాల్లో 'బ్రహ్మముడి' సీరియల్ తారాగణం సందడి



నవతెలంగాణ-అంబర్‌పేట

తెలుగింటి పండుగ సంక్రాంతి. లోగిళ్లలో ఆడపిల్లలు వేసే ముగ్గులు.. వాటిపై అందంగా అలంకరించబడిన గొబ్బిళ్లు..హరిదాసుల కీర్తనలు.. కుర్రకారును రంజిపజేసే కోడి పందాలు, గాలిపటాలు.. ఎన్నో, ఎన్నెన్నో విశిష్టతలు. సంప్రదాయ వైభవానికి ప్రతీకలన్నట్టుగా ప్రతి ఇంటా సంబురాలు జరుగుతుంటాయి. ఆధునికత పేరిట ఆశలు అంతరిక్షంలో ఉన్నా, మనవైన మూలాలను గుర్తుచేసే సంక్రాంతి వస్తుందంటే సంబురాలు పండుగకు ముందుగానే ప్రారంభమైపోతుంటాయి. అచ్చ తెలుగు పల్లెల్లో కనిపించే ఈ పండుగ వైభవాన్ని సిటీజనులకు రుచి చూపడానికి స్టార్ మా ఇప్పుడు సంక్రాంతి ఫెస్టివల్‌ను నిజాంపేటలో నిర్వహించింది. శనివారం నిజాంపేటలో నిర్వహించిన ఈ వేడుకల్లో త్వరలో స్టార్‌మాలో ప్రసారం కానున్న 'బ్రహ్మముడి' సీరియల్ తారాగణం సందడి చేసింది. నిజాంపేట వాసులతో పూర్తిగా మమేకమైన 'బ్రహ్మముడి' తారాగణం, వారితో కలిసి రంగవల్లులు వేశారు. గాలి పటాలను ఎగురవేయడమే కాదు, పండుగకు ముందుగానే సంక్రాంతి లక్ష్మి శోభను నగరానికి తీసుకువచ్చారు. బిగ్‌బాస్, కోయిలమ్మ ఫేమ్ మానస్, దీపిక రంగరాజు ప్రధాన పాత్రలు పోషిస్తున్న ఈ సీరియల్‌లో బిగ్ బాస్ ఫేమ్ హమీదా కూడా ఓ కీలకపాత్రలో నటిస్తుంది. ఈ సీరియల్ ఈ నెల 24వ తేదీ నుంచి ప్రతి రోజూ 7.30 గంటలకు సోమవారం నుంచి శనివారం వరకూ ప్రసారం కానుంది. సంపన్నులైన దుగ్గిరాల కుటుంబానికి ముగ్గురు వారసులు. పెద్దవాడు రాజ్యవర్థన్. తాను చేసే పని ఏదైనా సరే ఓ స్టేటస్ ఉండటం మాత్రమే కాదు, పర్‌ఫెక్ట్‌గా చేయాలని కోరుకుంటాడు. కానీ అతనికి తాను చేసుకునే అమ్మాయి మంచి ముత్యం లాంటిది కావాలనేది కోరిక. రెండోవాడు రాహుల్. ప్లేబాయ్. మూడోవాడు కళ్యాణ్, కవితాలోకంలో విహరిస్తుంటాడు. ఈ కుటుంబానికి తన కూతుళ్లను కోడళ్లుగా చేయాలని తలిచే ఓ మధ్యతరగతి తల్లి ప్రయత్నాలు, ఆ క్రమంలో చోటు చేసుకునే ఘటనల సమాహారం 'బ్రహ్మముడి'. ఉత్కంఠత రేపే కథనం, భావోద్వేగాలను తట్టి లేపే సంభాషణలతో ఈ సీరియల్ త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రాబోతుంది.



చిన్నారులకు గాలిపటాలు పంపిణీ

నవతెలంగాణ-అడిక్ మెట్

మకర సంక్రాంతి పండుగ సందర్భంగా గాంధీనగర్ డివిజన్‌లోని అన్నానగర్ బస్తీ చిన్నారులకు కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ గాలిపటాలను పంపిణీ చేశారు. సంతోషకరమైన వాతావరణంలో పిల్లలపై తగు జాగ్రత్తలు తీసుకుంటూ ఈ సంక్రాంతి పండుగ సంబురాలను అందరూ జరుపుకోవాలని కోరుకుంటూ డివిజన్ ప్రజలు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సురేష్ (సూరి) రహమత్ అలీ, ఆనంద్ రావు, డేవిడ్, ప్రశాంత్, సతీష్, సంధ్య రాణి, పూర్ణ, బస్తీవాసులు లక్ష్మి, యాకయ్య, యాదగిరి, నర్సింహ తదితరులు పాల్గొన్నారు

నగరంలో శోభన్‌బాబు విగ్రహం ఏర్పాటుకు కృషి

- నగర డిప్యూటీ మేయర్ శ్రీలతా శోభన్‌రెడ్డి
- తార్నాక చౌరస్తాలో శోభన్‌బాబు జయంతి

నవతెలంగాణ-ఓయూ



నగరంలో సినీ నటుడు శోభన్ బాబు విగ్రహం ఏర్పాటుకు కృషి చేస్తానని నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతాశోభన్ రెడ్డి పేర్కొన్నారు. సినీ నటుడు శోభన్ బాబు జయంతిని శోభన్ బాబు సేవా సమితి తెలంగాణ చైర్మన్ టి.రామకృష్ణ, అధ్యక్షులు పద్మారావు, ప్రధాన కార్యదర్శి బి.లాల్ బహదూర్ శాస్త్రి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఎమ్మెస్సార్ వర్మ ఆధ్వర్యంలో శనివారం తార్నాక చౌరస్తాలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్, బీఆర్ఎస్ కార్మిక విభాగం అధ్యక్షుడు మోతె శోభన్ రెడ్డి, శోభన్ బాబు సేవా సమితి చైర్మన్ రామకృష్ణ శోభన్ బాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేసి అన్నం ప్యాకెట్లను పలువురికి అందజేశారు. నటుడు శోభన్ బాబు జయంతిని ప్రతి ఏడాదీ జరుపుకోవడం సంతోషంగా ఉందని డిప్యూటీ మేయర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అశోక్, రవిచారి, గంగాధర్, సూర్యనారాయణ, రామ్మోహన్ గౌడ్, లింగం, వినోద్ రెడ్డి, డివికే రెడ్డి, కాజీపేట శ్రీనివాస్, మహిళా వింగ్ కన్వీనర్ బి.ప్రేమలత, అన్నపూర్ణ, పద్మావతి, శ్రీదేవి, రమాదేవి, జోష్మన్, శాంత కుమారి, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

గరికపాటికి భారత్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు



నవతెలంగాణ-హిమాయత్ నగర్

భారత్ వరల్డ్ రికార్డ్స్ అధ్యక్షులు లయన్ కె.వి.రమణారావు, భారత్ ఆర్ట్స్ అకాడెమీ అధ్యక్షురాలు లయన్ లలితారావు, జాతీయ సమన్వయ కర్త మాగంటి విష్ణుతేజలు గరికపాటి నరసింహారావు ఇంటి వద్ద భారత్ వరల్డ్ రికార్డ్స్‌లో నమోదు చేసిన ధవపత్రాన్ని అందజేశారు. పద్మశ్రీ గరికపాటి నరసింహారావు అవధాని, రచయిత ఉపన్యాసకుడు, తెలుగు రాష్ట్రాల్లో గరికపాటి నర్సింహారావు గురించి తెలియని వారు లేరంటే అతిశయోక్తి కాదని ఆయనను కొనియాడారు. గోదావరి జిల్లాలో వెంకట సూర్యనారాయణ, వెంకట రమణమ్మ దంపతులకు జన్మించి ఎంఏ, ఎంఫిల్, పీహెచ్ డి పూర్తి చేసి సుమారు 30 ఏండ్లపాటు ఉపాధ్యాయుడిగా పని చేశారని గుర్తు చేశారు. రచయితగా, అవధానిగా మంచి ఉపన్యాసకుడిగా కీర్తి గడించి మంచి చెడులను విడమరిచి చెబుతూ ఎంతో మందిని ఆకర్షిస్తూ యువతరాన్ని, భవిష్యత్ తరాల వారిని సన్మార్గంలో నడిచేలా తన ఉపన్యాసాలు, బోధనల ద్వారా చైతన్య పరుస్తున్న గరికపాటి నరసింహారావు సమాజానికి, ప్రజలకు చేస్తున్న సేవలను గుర్తిస్తూ వారి పేరును ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన భారత్ వరల్డ్ రికార్డ్స్‌లో నమోదు చేసి ధవపత్రాన్ని కలశపూడి శ్రీనివాసరావు, మాగంటి వసుధల సమక్షంలో అందజేసినట్లు శనివారం వారు ఒక ప్రకటన పేర్కొన్నారు.



ఓయూ సీఎస్‌లో సంక్రాంతి సంబురాలు

నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ ఎల్.రమేష్ నాయక్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబురాలను ఘనంగా నిర్వహించారు. పోలీసులు స్టేషన్ ఆవరణలో ముగ్గుల వేసి, బొమ్మెమ్మలు పెట్టి పండుగ వాతావరణం తలపించేలా చేశారు. అనంతరం ఇన్‌స్పెక్టర్ రమేష్ నాయక్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మన సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణకు కృషి చేయాలన్నారు. మన సంప్రదాయలను భవిష్యత్తు తరాలకు అందజేయాల్సిన బాధ్యత మన పై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డీఐ ఆంజనేయులు, ఎస్ఐ లక్ష్మి నారాయణ, రాజేంద్రన్, భార్గవి, క్రాంతి కుమార్, రవి, భిక్షం, నరేష్, మహిళలు ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.



మకర సంక్రాంతి సందర్భంగా చిన్నారులకు గాలిపటాలు పంపిణీ చేస్తున్న గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకులు ఆశిష్ కుమార్ యాదవ్ తదితరులు. నవతెలంగాణ-సుల్తాన్ బజార్

దక్షిణాది ప్రజల సమస్యల్ని పట్టించుకోని ప్రధాని దక్షిణాది దేశాల సమస్యను ఎలా పరిష్కరిస్తారు?

నవతెలంగాణ-ఓయూ



దేశంలోని దక్షిణాది ప్రజల సమస్యల్ని పట్టించుకోని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దక్షిణాది దేశాల సమస్యలను ఎలా పరిష్కరిస్తారని గ్లోబల్ సౌత్ ఫోరం చైర్మన్ ప్రొ.గాలి వినోద్ కుమార్ విమర్శించారు. శనివారం దక్షిణ భారత సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్ధమాన దేశాలు ఎదుర్కొంటున్న నిరక్షరాస్యత, ఆర్థిక సంక్షోభం, ధరల పెరుగుదల, వాతావరణ మార్పులు, అప్పుల భారం, కోవిడ్ 19 మహమ్మారి దుష్పలితాలను పరిష్కరించడానికి గ్లోబల్ సౌత్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేస్తామన్న ప్రధానమంత్రి ప్రకటన హాస్యాస్పదంగా ఉందన్నారు. ముందుగా దేశంలోని సమస్యలను పరిష్కరించి తర్వాత గ్లోబల్ సౌత్ దేశాల సమస్యల గురించి ఆలోచించాలన్నారు. దక్షిణాది రాజధాని అయిన హైదరాబాద్‌ను దేశ రెండో రాజధాని చేయడంలోనూ, దక్షిణాది రాష్ట్రాల నీటి పంపకాలు సంపద పంపిణీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడం, ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, తెలంగాణకు ప్రత్యేక ప్యాకేజీ, దక్షిణాది రాష్ట్రాల ఇండస్ట్రియల్ కారిడార్ల నిర్మాణం, దక్షిణాది రాష్ట్రాల ప్రత్యేక అభివృద్ధి మండలికి నిధుల కేటాయింపు, దక్షిణాది భాషల అభివృద్ధి మండలి, దక్షిణాదికి ప్రత్యేక రిక్రూట్మెంట్ బోర్డ్, దక్షిణాదికి ప్రత్యేక పార్లమెంటు, సుప్రీంకోర్టు బెంచ్‌ల ఏర్పాటు ఏమీ చేయని నరేంద్ర మోడీ దక్షిణాది దేశాలను అభివృద్ధి చేస్తామనడం దక్షిణాది దేశాల ప్రజలను మోసం చేయడమే అన్నారు.

రేపు 'వందేభారత్' రైలు ప్రారంభం



- 22న నెక్లెస్ రోడ్డు పీపుల్స్ ప్లాజాలో 'భారతమాత' హారతి కార్యక్రమం
- కేంద్ర పర్యాటక, సాంస్కృతిక, ఈశాన్య రాష్ట్రాల మంత్రి కిషన్ రెడ్డి

నవతెలంగాణ-అంబర్‌పేట

కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నం వరకు రేపు "వందేభారత్ " రైలును ప్రారంభించనున్నట్టు కేంద్ర పర్యాటక, సాంస్కృతిక, ఈశాన్య రాష్ట్రాల మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. బర్కత్‌పురాలోని బీజేపీ నగర కార్యాలయంలో ఏర్పాటు చేసిన హైదరాబాద్ సెంట్రల్ జిల్లా, మహంకాళి సికింద్రాబాద్ జిల్లాల సమావేశంలో రాజ్యసభ సభ్యులు డా.కె.లక్ష్మణ్‌తో కలిసి హాజరై మాట్లాడారు. తెలంగాణలె అన్ని రంగాల్లో రైల్వే వ్యవస్థలో విపరీతమైన మార్పులు తేవడం గొప్ప పరిణామం అన్నారు. ఈ నెల 22వ తేదీన నెక్లెస్ రోడ్డులోని పీపుల్స్ ప్లాజాలో " భారతమాత " హారతి కార్యక్రమం ఉంటుందనీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయ్యాలని కోరారు. రాజ్యసభ సభ్యులు డా. కె. లక్ష్మణ్ మాట్లాడుతూ "వందేభారత్" రైలు తెలంగాణకు రావడం అదృష్టంగా భావించాలన్నారు. హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు డా. ఎస్.గౌతమ్ రావు మాట్లాడుతూ వందేభారత్ రైలు ప్రారంభం సందర్భంగా ప్రతి బీజేపీ కార్యకర్త సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వచ్చి ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి గోలి మధుసూధన్ రెడ్డి, గద్వాల జిల్లా ఇన్‌చార్జి వెంకట్ రెడ్డి, రాష్ట్ర నాయకులు పాపారావు, కార్పొరేటర్లు మహాలక్ష్మి రామన్ గౌడ్, అమృత, పద్మ వెంకట్ రెడ్డి, ఉమా రమేష్ యాదవ్, సరళ, కొంతం దీపక, జిల్లా ప్రధాన కార్యదర్శులు క్రిష్ణగౌడ్, సారంగ పాని, తదితరులు పాల్గొన్నారు.

నిరాశ్రయులు, నిరుపేదలకు దుస్తులు పంపిణీ

నవతెలంగాణ-అడిక్‌మెట్





సంక్రాంతి పండుగ సందర్భంగా స్కై ఫౌండేషన్ ఆధ్వర్య ంలో నిరాశ్రయులకు పేదలకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రెసి డెంట్ వై.సంజీవ కుమార్, వైస్ ప్రెసిడెంట్ ఓ.పావని, తదితరులు పాల్గొన్నారు.

చైనా మాంజా విక్రేతపై కేసు నమోదు

నవతెలంగాణ - బాలానగర్

చైనా నిషేధిత మాంజాను విక్రయిస్తున్న ఓ వ్యక్తిపై బాలానగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ కె.భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం సౌభాగ్యనగర్ ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఫుట్ పాత్‌పై 28 ఏండ్ల అబ్దుల్ సాజిద్ చైనా మాంజా విక్రయిస్తున్నట్టు పోలీసులకు స్థానికులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నిందితున్ని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా తాను డ్రైవర్‌గా పని చేస్తున్నానని, సంక్రాంతి పండుగ సందర్భంగా గాలిపటాలతో పాటు చైనా తయారీ మాంజాలను విక్రయిస్తున్నట్టు అతను అంగీకరించాడు. నిందితుని వద్ద నుంచి 4 చైనా మాంజా చక్రాలను పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు



నవతెలంగాణ- మేడ్చల్

చెరుకులోని తియ్యదనం, పాలలోని తెల్లదనం,గాలిపటంలోని రంగుల అందం ప్రజల అందరీ జీవితాలలో వెలుగులు నింపాలని మేడ్చల్ మున్సిపల్ 23వ వార్డు కౌన్సిలర్ కౌడె మహేష్ కురుమ అన్నారు. ప్రజలకు, మేడ్చల్ మున్సిపాల్టీ మండల ప్రజాప్రతినిధులకు, అధికారులకు, అనధికా రులకు, మీడియా మిత్రులకు, పుర ప్రముఖులకు, బీఆర్ఎస్ నాయకులకు, కార్యకర్తలకు ఆయన మకర సంక్రాంతి పర్వదిన శుభాకాంక్షలు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సంక్రాంతి సిరి సంపదలతో కనుమ కనువిందుగా జరుపుకుని ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నట్టు తెలియజేశారు.

'మన ఊరు మన బడి'తో విద్యాలయాలు అభివృద్ధి

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- కేపీహెచ్‌బీలో ఎన్టీఆర్ ప్రభుత్వ పాఠశాల నిర్మాణ పనులకు శంకుస్థాపన

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

మన ఊరు మనబడి కార్యక్రమం ద్వారా విద్యాలయాలను కూడా అభివృద్ధి పరచుకుంటున్నామని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శనివారం కేపీహెచ్‌బీ డివిజన్ పరిధిలోని కేపీహెచ్‌బీ కాలనీ రమ్యా గ్రౌండ్‌లో నూతనంగా చేపట్టనున్న శ్రీ నందమూరి తారక రామారావు ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవన నిర్మాణ పనులను ఆయనతో పాటు శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, ఎమ్మెల్సీ నవీన్ కుమార్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ హరీష్, స్థానిక కార్పొరేటర్ మందడి శ్రీనివాస్రావు, స్థానికులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కష్ణారావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్.. మంత్రి కేటీఆర్ సహాయ సహకారాలతో నియోజకవర్గాన్ని ఇప్పటికే వేల కోట్ల రూపాయలతో అభివద్ధి పరుచుకున్నామని తెలిపారు. పేద విద్యార్థులు ఎదురుచూస్తున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కల నేడు నెరవేరబోతుందని, ఇందుకు సహకరించిన ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ లకు ప్రత్యేక కతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ మన ఊరు మన బడి కార్యక్రమం



ద్వారా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం జరుగు తుందన్నారు. మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు శత జయంతి వేడుకల సమయంలో ప్రభుత్వ పాఠశాలకు ఆ మహానుభావుడి పేరు పెట్టడం చాలా సంతోషకరమన్నారు. సామాజిక బాధ్యత తో సమాజ హితం తన వంతు గా ఈ స్కూల్ భవన నిర్మాణానికి తన సొంతంగా కోటి రూపాయలు కే.పి.హెచ్.బి. కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు ఇవ్వడం చాలా గొప్ప విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు, డి.ఈ.ఓ విజయ కుమారి, ఎంఈఓ ఆంజనేయులు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

బూత్ స్థాయిలో ఇన్‌చార్జ్‌లను నియామకం

బీఆర్ఎస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు ప్రతీ కార్యకర్త సన్నద్ధంగా ఉండాలని కేపీహెచ్‌బీ డివిజన్ కార్పొరేటర్ మందడి శ్రీనివాస్ రావు అన్నారు. సీఎం కేసీఆర్, కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదేశాల మేరకు కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు, డివిజన్ అధ్యక్షులు కృష్ణారెడ్డిలు బూత్ స్థాయిలో ఇన్‌చార్జ్‌లను నియమిస్తూ ప్రణాళిక సిద్ధం చేశారు. శనివారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు క్యాంప్ కార్యాలయంలో ఆ నివే దికను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు మాట్లాడుతూ పార్టీ పటిష్టతకు కషి చేసే విధంగా ఎమ్మెల్యే చర్యలు తీసుకుంటున్నారన్నారు. గతంలో ఎన్నడూ జరగలేని అభివద్ధి కార్యక్రమాలు ముఖ్యమంత్రి కేసీఆర్, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుల ఆధ్వర్యంలో జరిగాయని గుర్తు చేశారు.





యువత క్రీడల్లో రాణించాలి

- ఎమ్మెల్యే కేపీ వివేకానంద
- జీపీఎల్ సూపర్ సిక్స్ క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

యువత విలువైన సమయాన్ని వృథా చేయకుండా చదువు పాటు క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుం దని ఎమ్మెల్యే కేపీ వివేకానంద సూచించారు. సంక్రాంతి పర్వదినం పురస్కరించుకొని రంగారెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని గురుమూర్తి నగర్ గ్రౌండ్‌లో శనివారం నిర్వహిం చిన జీపీఎల్ సూపర్ సిక్స్ క్రికెట్ టౌర్నమెంట్‌ను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా టోర్నమెంట్‌లో పాల్గొన్న టీమ్ సభ్యులకు ఎమ్మెల్యే శుభాకాం క్షలు తెలుపుతూ విజేతలుగా నిలిచిన టీంలకు మెమెం టోలు, బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత అన్ని రంగాల్లో రాణించి నప్పుడే దేశం అభివృద్ధి పథంలో నడుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు వసీం, శన్ను, రమ్మి గౌడ్, ఓవైస్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి పండుగను ఆనందంగా జరుపుకోవాలి

- ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ
- ఎమ్మెల్యే నివాసం వద్ద భోగి మంటలు



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

సంక్రాంతి పండుగను ప్రజలంతా ఆనందంగా జరుపుకోవాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. భోగి పండుగ పర్వదినం సందర్భంగా శనివారం వివేకానందనగర్‌లోని ఎమ్మెల్యే నివాసం వద్ద కుటుంబ సమేతంగా భోగిమంటలు వేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలకు, ప్రజాప్రతినిధులకు,కార్పొరేటర్లకు, బీఆర్ఎస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, అధికారులకు, అనాధికారులకు, పార్టీ అనుబంధ సంఘాల సభ్యులకు, మిత్రులకు, శ్రేయాభిలాషులకు, బంధుమిత్రులకు భోగి పండుగ శుభాకాం క్షలు తెలియజేశారు. పండుగలను కుటుంబ సభ్యులతో కలిసి ఆనందోత్సాహల మధ్య జరుపుకోవాల న్నారు. ఇం ట్లోని పాత వస్తువులను భోగి మంటల్లో వేస్తుంటారు అంటే పనికిరాని చెత్త ఆలోచనలకు స్వస్తి పలికి.. కొత్తమార్గంలోకి పయనించాలని దీని అర్థం అన్నారు. కాలంతో వచ్చే మార్పులను ఆహ్వానించడానికి సిద్ధంగా ఉండాలని.. బోధించేదే భోగి పండుగ అని తెలియజేసారు.

తెలుగు సాంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి



- నారాయణ పాఠశాల ప్రిన్సిపాల్ స్వరాజ్యలక్ష్మి

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

తెలుగు సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకగా సంక్రాంతి పండగ నిలుస్తుందని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం చింతల్లోని నారాయణ పాఠశాల ప్రిన్సిపాల్. స్వరాజ్యలక్ష్మి అన్నారు. సంక్రాంతి పర్వదినం పురస్కరించుకొని పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు సంక్రాంతి రంగవల్లుల ముగ్గులతో పాటు భోగి మంటలు, గొబ్బెమ్మల మధ్య సాంప్రదాయ రీతిలో దినుసులు పేర్చటం చేశారు. హరిదాసు కీర్తనలతో, గంగిరెద్దుల నత్యాలతో పాఠ శాల కోలాహలంగా సందడిగా మారింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్ననాటి నుంచే విద్యార్థులకు ప్రతీ పండుగ విశిష్టతను తెలియజేస్తూ పాఠశాలలో ఆయా అంశాలతో కూడిన కార్యక్రమాలను నిర్వహిస్తూ విద్యార్థులను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తున్నామన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపల్ రాజేశ్వరి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు. పాల్గొన్నారు.

పతంగులను పంపిణీ చేసిన కార్పొరేటర్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

సంక్రాంతి పండగను డివిజన్‌లోని అందరూ సంతోషంగా జరుపుకోవాలని కార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా డివిజన్ పరిధిలోని మగ్దూం నగర్ కార్పొరేటర్ కార్యాలయం ప్రాంగణంలో యువకులకు. పార్టీ కార్యకర్తలకు వారు పతంగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత ప్రతీ పండు గను రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ఘనంగా నిర్వహిస్తున్నదని అన్నారు. రానున్న రోజుల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ ముందు చూపుతో ప్రతీ పండగ చరిత్రలో నిలిచి పోయే విధంగా చేస్తా రని ఆశాభావం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ యూత్ నాయ కులు కొలుకుల జైహింద్, ఎస్. లక్ష్మణ్, దినేష్, సాయి, నరసింహ, కార్తీక్ తది తరులు పాల్గొన్నారు.



సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకోవాలి

- రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి శోభన్ నాయక్
- ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, ఐద్వా ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు



నవతెలంగాణ- మేడ్చల్

పండుగలు, సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన అవసరం ప్రతీ ఒకరిపై ఉందని రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి శోభన్ నాయక్ అన్నారు. శనివారం మండల పరిధిలోని రావల్ కోల్ గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, ఐద్వా, గొర్రెలు మేకల పెంపకదారుల సంఘం ఆధ్వర్యంలో ముగ్గులు, స్లో బైక్ రేసింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా శోభన్ నాయక్ మాట్లాడుతూ నేడు దేశంలో,రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న ఆకత్యాలను ముగ్గుల ద్వారా తెలుపడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. రైతులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు సైతం ముగ్గుల ద్వారా తెలపడం పట్ల అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీలో విజేతలుగా నిలిచిన మహిళలు వరలక్ష్మికి ప్రథమ, మౌనికకు ద్వితీయ, మహేశ్వరికి తృతీయ, కీర్తనలకు కన్సలేషన్ ప్రైజ్ కింద పట్టు చీరలను బహుమతిగా అందజేశారు. ఈ ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలందరికీ బహుమతులను నిర్వాహకులు అందజేశారు. అలాగే స్లో బైక్ రేసింగ్‌లో ప్రథమ స్థానం సాధించిన రాజుకు, ద్వితీయ స్థానం సాధించిన మల్లేష్‌కు, తృతీయ బహుమతి స్థానం సాధించిన నందుకు హెల్మెట్ లను బహుమతిగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి నరేష్, గొర్రెలు మేకలు పెంపకదారుల సంఘం జిల్లా కార్యదర్శి కొమురయ్య, మేడ్చల్ మండల వైస్ ఎంపీపీ గోపని వెంకటేష్, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

అవన్నీ ప్రభుత్వ హత్యలే

- బాధ్యత వహించి మంత్రి రాజీనామా చేయాలి
- నగర టీడీపీ మహిళా నాయకుల డిమాండ్

నవతెలంగాణ-సిటీబ్యూరో

మలక్ పేట ప్రభుత్వ ఆస్పత్రిలో ఒకే రోజు ఇద్దరు బాలింతలు మృతి చెందడం దురదృష్టకరమని టీడీపీ రాష్ట్రకార్యదర్శులు కొర్రా దేవి, అన్నపూర్ణ, తెలుగు మహిళా అధ్యక్షురాలు సిహెచ్. విజయశ్రీ అన్నారు. శనివారం నగర టీడీపీ కార్యాలయంలో వారు మాట్లా డారు. మలక్ పేట ప్రభుత్వాస్పత్రిలో ఒకే రోజున ఇద్దరు బాలింతలు మృతి చెందడంతో బంధువుల ఆందోళనతో మలక్ పేట ప్రభుత్వాసుపత్రి వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నా యని గుర్తు చేశారు. వైద్యుల నిర్లక్ష్యంతోనే ఇద్దరు బాలింతలు మృతి చెందారని ఆరోపించారు. సిరి వెన్నెల, శివాని ఇద్దరు బాలింతలకు సిజేరియన్ చేసిన తర్వాత అస్వస్థతకు గురవ్వడంతో గాంధీ ఆస్పత్రికి తరలించారని, అక్కడ చికిత్స పొందుతూ వైద్యుల నిర్లక్ష్యంతో ఇద్దరు మృతి చెందారన్నారు. కొద్ది రోజుల క్రితం ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఆస్పత్రిలో నలుగురు మహిళలు మృతి చెందారన్నారు. ఈ మరణాలకు సిజేరియన్ ఆపరేషన్లే కారణమని తెలుస్తోందన్నారు. ఇవన్నీ ప్రభుత్వ హత్యలేనని, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు బాధ్యత వహించి మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వాసుపత్రుల్లో ఇలాంటి పరిస్థితులుంటే కంటి వెలుగు అంటూ ప్రజలను మభ్య పెడుతున్నారన్నారు. కంటి వెలుగు పథకంతో ఇంకా ఎన్ని ప్రాణాలు తీస్తారోనని ఆందోళన వ్యక్తం చేశారు.



బాధితునికి ఆర్థిక సాయమందించిన లక్ష్మారెడ్డి



నవతెలంగాణ-కాప్రా

కొన్ని రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ చర్లపల్లి డివిజన్‌కు చెందిన విక్రమ్‌ను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, బీఎల్ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకులు బండారి లక్ష్మారెడ్డి శనివారం వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. అనంతరం బాధితునికి వారు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్య పరంగా అన్ని విధాలుగా ఆదుకుంటాం అన్నారు. భవిష్యత్తులో అండగా ఉంటామని హామీ ఇచ్చారు. బండారి లక్ష్మారెడ్డితో పాటు పరామర్శించిన వారిలో బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు నేమూరి మహేష్ గౌడ్, జంపాల్ రెడ్డి, రహీం తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన పారిశుధ్య కార్మికురాలు మృతి



నవతెలంగాణ-హయత్‌నగర్

రోడ్డు ప్రమాదంలో గాయపడిన పారిశుధ్య కార్మికురాలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం హయత్ నగర్ డివిజన్ పరిధిలోని హన్మగల్ లో నివాసం ఉంటున్న జెనిగ దుర్గమ్మ(48) ఈనెల 10న తన విధుల్లో భాగంగా ఆటో నగర్ వద్ద ఉన్న ఇసుక లారీల అడ్డా వద్ద రోడ్డును ఊడుస్తున్నది. ఈ క్రమంలో గుర్తు తెలియని వాహనం ఆమెను ఢీ కొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆమెను ఈఎస్ఐ హాస్పిటల్ కు తరలించారు. అక్కడ ఆమె చికిత్స పొందుతుండగా శనివారం పరిస్థితి విషమించి మృతి చెందింది. విషయం తెలుసుకున్న స్థానిక కార్పొరేటర్ కళ్లెం జీవన్ రెడ్డి సంతాపం తెలియజేశారు.

సీఎం కేసీఆర్ గాలిపటం ఆవిష్కరణ

నవతెలంగాణ- సుల్తాన్‌బజార్

బీఆర్ఎస్ పార్టీ గోషామహల్ నియోజకవర్గం ఇన్‌చార్జి కార్యాలయం ఆఫీస్‌లో బీఆర్ఎస్ జాంబాకు డివిజన్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, మహిళా నాయకురాలు ప్రియా గుప్తా ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ ,ఎమ్మెల్సీ కవిత చిత్రపటం ఉన్న గాలిపటాన్ని శనివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో విజయ ముదిరాజ్, కైసర్ భాయ్, ప్రదీప్ కుమార్, జోగి గుప్తా పాల్గొన్నారు.



కళ్యాణ మహోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

గాజులరామారం డివిజన్ పరిధిలోని ఉషోదయ కాలనీ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద శనివారం భోగి పండుగ సందర్భంగా నిర్వహించిన శ్రీ గోధా రంగనాథ స్వామి కళ్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కస్తూరి బాలరాజు, పాక్స్ డైరెక్టర్ శ్రీనివాస్ యాదవ్, ఆలయ కమిటీ సభ్యులు సోమిరెడ్డి, సురేంద్ర నాథ రెడ్డి, కష్టా రెడ్డి, కాలనీ జెనరల్ సెక్రెటరీ సతీష్ బాబు, చిన్న చౌదరి .తదితరులు పాల్గొన్నారు.





జీడిమెట్ల 132 డివిజన్ పరిధిలో..

కుత్బుల్లాపూర్ : జీడిమెట్ల 132 డివిజన్ పరిధిలోని పేట్ బషీరాబాద్ ఎస్.సి.ఎల్ కాలనీ సౌత్ లో శ్రీ దేవి భూదేవి సమేత శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి సహిత శ్రీ అభయాంజనేయ స్వామి దేవస్థానం వద్ద భోగి పండుగ సందర్భంగా నిర్వహిం చిన శ్రీ గోదా రంగనాథ స్వామి కళ్యాణ మహోత్సవంలో శనివారం ఎమ్మెల్యే కేపీ వివేకానంద ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఎం.ఎస్. రాజు , సాంబశివ రాజు, వార్డుసభ్యులు, ఇందిరారెడ్డి, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

సెమీస్‌లో సాత్విక్ జోడీకి నిరాశ

కౌలాలంపూర్: మలేషియా ఓపెన్ సూపర్-1000 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత్ పోరాటం ముగిసింది. పురుషుల సింగిల్స్‌లో ఒక్కరు మినహా మిగతా వారంతా తొలిరౌండ్‌లోనే నిష్క్రమించగా.. పురుషుల డబుల్స్ సెమీస్‌కు చేరి ఆశలు రేపిన చిరాగ్ శెట్టి-సాత్విక్ సాయిరాజ్ జోడీ ఓటమిపాలయ్యారు. శనివారం జరిగిన డబుల్స్‌లో భారత జోడీ 16-21, 21-11, 15-21తో చైనాకు చెందిన లియాంగ్-వాంగ్‌ల చేతిలో పోరాడి ఓడారు. తొలి గేమ్‌ను ఓడినా.. రెండో గేమ్‌లో పుంజుకొని ఆ గేమ్‌ను గెలుచుకున్నారు. నిర్ణయాత్మక మూడో గేమ్‌లోనూ పోరాడినా 15-21తో ఓడి టోర్నీనుంచి నిష్క్రమించారు. పురుషుల సింగిల్స్‌లో హెచ్‌ఎస్ ప్రణయ్ రాయ్ క్వార్టర్‌ఫైనల్స్లో ఓడగా.. మహిళల డబుల్స్‌లో త్రీషా-గాయత్రి గోపీచంద్ జోడీ ప్రి క్వార్టర్స్‌కు చేరడమే గొప్ప ప్రదర్శన. మరో సెమీస్‌లో మలేషియాకు చెందిన ఆర్డియాంటో-అల్ఫియన్ జోడీ 21-17, 21-17తో కొరియా జోడీపై నెగ్గి ఫైనల్లోకి దూసుకెళ్లారు. ఇక పురుషుల సింగిల్స్ ఫైనల్లోకి అక్సెల్సన్(డెన్మార్క్), నర్రాకో(జపాన్) దూసుకెళ్లారు. సెమీస్‌లో అక్సెల్సన్ 21-7, 21-15తో సునేయమా(జపాన్)పై, నర్రాకో 21-17, 19-21, 21-17తో విటిడ్‌స్యామ్(థాయ్‌లాండ్)పై విజయం సాధించారు. ఇక మహిళల సింగిల్స్ ఫైనల్లోకి యమగుచి (జపాన్), సన్-యన్-అన్(కొరియా) దూసుకెళ్లారు. సెమీస్‌లో యమగుచి 21-18, 21-16తో తైజు-యింగ్(తైపీ)పై, సన్ 21-12, 19-21, 21-9తో చెన్-యుఫీ(చైనా)పై గెలిచారు.

శివాలెత్తిన సెహ్రావత్

● దక్షిణాఫ్రికాపై ఏడు వికెట్ల తేడాతో గెలుపు ● ఐసిసి అండర్-19 మహిళల ప్రపంచకప్



జోహాన్స్‌బర్గ్ : ఐసిసి అండర్-19 మహిళల ప్రపంచకప్ గ్రూప్-డిలో ఉన్న భారత జట్టు శుభారంభం చేసింది. ఐసిసి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న తొలి అండర్-19 మహిళల ప్రపంచకప్‌లో భారత్ ఏడు వికెట్ల తేడాతో ఆతిథ్య దక్షిణాఫ్రికాను చిత్తుచేసింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా మహిళల జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 166పరుగులు చేసింది. ఛేదనలో భారతజట్టు 16.3ఓవర్లలో కేవలం 3వికెట్లు కోల్పోయి 170పరుగులు చేసి గెలిచింది. టాస్ గెలిచి తొలిగా బ్యాటింగ్ ఎంచుకున్న దక్షిణాఫ్రికా జట్టు పవర్‌ప్లే 6 ఓవర్లలోనే 70 పరుగులు చేసింది. లారెన్స్(61; 44బంతుల్లో 9ఫోర్లు, సిక్సర్), ల్యాండ్మన్(32) బ్యాటింగ్‌లో రాణించారు. షెఫాలీ వర్మకు రెండు, సోనమ్, చోప్రాకు ఒక్కో వికెట్ దక్కాయి. ఛేదనలో టీమిండియాకు కెప్టెన్ షెఫాలీ వర్మ(45; 16బంతుల్లో 9ఫోర్లు, సిక్సర్) ఆకాశమే హద్దుగా చెలరేగి ఆడింది. మరో ఓపెనర్ శ్వేతా సెహ్రావత్(92నాటౌట్; 57బంతుల్లో 20ఫోర్లు) విధ్వంస ఇన్నింగ్స్ ఆడింది. వీరిద్దరూ కలిసి తొలి వికెట్‌కు 7 ఓవర్లలో 77పరుగులు జతచేశారు. ఆ తర్వాత త్రిషా(15), సౌమ్య తివారి(10) నిరాశపరిచినా.. సెహ్రావత్ ఒంటిచేత్తో మ్యాచ్‌ను ముగించింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ సెహ్రావత్‌కు లభించింది.

గ్రూప్-డి తొలి లీగ్ మ్యాచ్‌లో యుఏఇ మహిళల జట్టు 6వికెట్ల తేడాతో స్కాట్లాండ్‌పై ఘన విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన స్కాట్లాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 9వికెట్లు నష్టపోయి 99పరుగులు చేయగా.. యుఏఇ జట్టు 16.2ఓవర్లలో 4వికెట్లు కోల్పోయి 100పరుగులు చేసి గెలిచింది. మహికా గౌర్(33నాటౌట్) బ్యాటింగ్‌లో రాణించింది.టిక గ్రూప్-ఏలో బంగ్లాదేశ్ మహిళల జట్టు 7వికెట్ల తేడాతో ఆస్ట్రేలియాపై, శ్రీలంక జట్టు 7 వికెట్ల తేడాతో అమెరికాపై విజయం సాధించాయి.

స్కోర్‌బోర్డు..

దక్షిణాఫ్రికా(అండర్-19) మహిళలు: రెన్స్‌బర్గ్ (సి)ఘోష్ (బి)యాదవ్ 23, లారెన్స్ (రనౌట్) త్రిషా/ఘోష్ 61, సియో (బి)షెఫాలీ వర్మ 0, రెనెకె (సి)త్రిషా (బి)షెఫాలీ 11, ల్యాండ్స్‌మన్ (ఎల్‌బి)చోప్రా 32, కరాబో మెసో (నాటౌట్) 19, మినే స్మిత్ (నాటౌట్) 16, అదనం 4. (20 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి) 166పరుగులు.

వికెట్ల పతనం: 1/56, 2/61, 3/89, 4/126, 5/142

బౌలింగ్: షబ్నమ్ 1-0-20-0, సోనమ్ యాదవ్ 4-0-47-1, అర్చనా దేవి 3-0-18-0, షెఫాలీ వర్మ 4-0-31-2, సోనియా 3-0-19-0, పర్షవీ చోప్రా 4-0-15-1, సౌమ్య తివారి 1-0-16-0

ఇండియా(అండర్-19) మహిళలు:

శ్వేత సెహ్రావత్ (నాటౌట్) 92, షెఫాలీ వర్మ (సి)నాయుడు (బి)స్మిత్ 45, త్రీషా (స్టంప్) మెసో (బి)నాయుడు 15, తివారీ (సి)రెన్స్‌బర్గ్ (బి)ల్యాండ్మన్ 10, సోనియా (నాటౌట్) 1, అదనం 7. (16.3 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి) 170పరుగులు.

వికెట్ల పతనం: 1/77, 2/106, 3/165

బౌలింగ్: అయందా హుబి 4-0-36-0, నాయుడు 3-0-32-1, రెనెకె 4-0-40-0, నిని 1-0-26-0, స్మిత్ 2-0-15-1, ల్యాండ్మన్ 2.3-0-20-1.

ఆస్ట్రేలియాతో తొలి రెండు టెస్టులకు భారత జట్టు ఎంపిక

సూర్య,ఇషాన్‌లకు చోటు!



న్యూఢిల్లీ: ఆస్ట్రేలియా జట్టు వచ్చే నెలలో భారత్‌లో పర్యటించనుంది. ఇందులో భాగంగా నాలుగు టెస్టులు, మూడు వన్డేలు ఆడనుంది. ఫిబ్రవరి 9న నాగ్‌పూర్‌లో తొలి టెస్టు ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో తొలి రెండు టెస్టుల కోసం ఎంపిక చేసిన భారత జట్టును బీసీసీఐ ప్రకటించింది. టీ20ల్లో అద్భుత ప్రదర్శనతో సెలక్టర్ల దృష్టిని ఆకర్షించిన స్టార్ బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్, వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్‌లకు టెస్టు జట్టులో చోటు లభించింది.

ఈ నెల 1న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రిషబ్ పంత్ ఈ సిరీస్‌కు దూరమయ్యాడు. పంత్ మరో ఆరు నెలలపాటు జట్టుకు దూరమయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో అతడి స్థానాన్ని ఇషాన్ కిషన్‌తో భర్తీ చేశారు. అలాగే, గాయంతో గతేడాది జట్టుకు దూరమైన ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజాకు తిరిగి జట్టులో స్థానం లభించింది. గాయం నుంచి పూర్తిస్థాయిలో కోలుకోని స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా జట్టులో చోటు కోసం మరికొంత కాలం ఆగక తప్పకపోవచ్చు. ఇక, బ్యాకప్ కీపర్‌గా కేఎస్ భరత్‌కు చోటు కల్పించారు. సౌరాష్ట్ర కెప్టెన్ జయదేవ్ ఉనద్కట్ టెస్టు జట్టులో తన స్థానం నిలుపుకున్నాడు. కేఎల్ రాహుల్, అక్షర్ పటేల్ చోటు నిలుపుకున్నారు.

ఆస్ట్రేలియాతో తొలి రెండు టెస్టులకు భారత జట్టు:

రోహిత్ శర్మ (కెప్టెన్), కేఎల్ రాహుల్ (వైస్ కెప్టెన్), శుభమన్ గిల్, చతేశ్వర్ పుజారా, విరాట్ కోహ్లీ, శ్రేయాస్ అయ్యర్, కేఎస్ భరత్ (వికెట్ కీపర్), ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), రవిచంద్రన్ అశ్విన్, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, రవీంద్ర జడేజా, మహ్మద్ షమీ, మహ్మద్ సిరాజ్, ఉమేశ్ యాదవ్, జయదేవ్ ఉనద్కట్, సూర్యకుమార్ యాదవ్.

నెదర్లాండ్స్, న్యూజిలాండ్ శుభారంభం

● హాకీ ప్రపంచకప్



రూర్కెలా(ఒరిస్సా): హాకీ ప్రపంచకప్‌లో భాగంగా శనివారం జరిగిన పోటీల్లో గ్రూప్-సిలో నెదర్లాండ్స్, న్యూజిలాండ్, గ్రూప్-బిలో జర్మనీ, బెల్జియం జట్లు శుభారంభం చేశాయి. రూర్కెలాలోని బిర్సాముండా హాకీ ఇంటర్నేషనల్ స్టేడియంలో జరిగిన పూల్-సి హాకీ తొలి మ్యాచ్‌లో న్యూజిలాండ్ 3-1గోల్స్ తేడాతో చిలీపై ఘన విజయం సాధించింది. మరో మ్యాచ్‌లో నెదర్లాండ్స్ జట్టు 4-0తో మలేషియాను చిత్తు చేసింది. నెదర్లాండ్స్ యువ ఆటగాడు టన్ బియాన్ పెనాల్టీ కార్నర్స్‌ను అద్భుతంగా గోల్స్‌గా మలిచాడు. మ్యాచ్ మరికొద్ది క్షణాల్లో ముగుస్తుందనగా జొర్రిట్ క్రూస్ మరో గోల్ కొట్టి నెదర్లాండ్స్ ఆధిక్యతను 4-0కు పెంచాడు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ జొర్రిట్ క్రూస్(నెదర్లాండ్స్)కు లభించింది. దీంతో నెదర్లాండ్స్, న్యూజిలాండ్ జట్లకు మూడేసి పాయింట్లు దక్కాయి. ఇక భువనేశ్వర్ వేదికగా జరిగిన పూల్-బిలో బెల్జియం జట్టు 5-0తో దక్షిణ కొరియాను చిత్తుచేసింది. మరో మ్యాచ్‌లో జర్మనీ జట్టు 3-0తో జపాన్‌ను ఓడించి శుభారంభం చేసింది.

యుకి-సాకేత్‌కు బ్యాంకాక్ ఓపెన్ ఛాలెంజర్స్ టైటిల్



నాన్థబురి(థాయ్‌లాండ్): భారత పురుషుల డబుల్స్ టెన్నిస్ జోడీ, టాప్‌సీడ్ యుకీ బాంబ్రీ-సాకేత్ మైనేని బ్యాంకాక్ ఓపెన్ ఛాలెంజర్స్ టైటిల్‌ను కైవసం చేసుకున్నారు. శనివారం జరిగిన ఫైనల్లో భారత డబుల్స్ జోడీ 2-6, 7-6(7), 14-12తో క్రిస్టోఫర్-రంగ్‌కాట్(ఇండోనేషియా-ఆస్ట్రేలియా) జోడీపై ఉత్కంఠ పోటీలో పోరాడి నెగ్గారు. ఈ మ్యాచ్ సుమారు గంటా 50నిమిషాలసేపు సాగింది. దీంతో వీరు కెరీర్‌లో 6వ ఏటిపి ఛాలెంజర్స్ టూర్ టైటిల్‌ను కైవసం చేసుకున్నారు. గత ఏడాది నుంచి భారత టెన్నిస్ జోడీ జతకట్టి డబుల్స్‌లో బరిలోకి దిగుతున్నారు. వీరిద్దరూ ఫైనల్‌కు చేరిన ఆరు సందర్భాల్లో ఐదుసార్లు టైటిళ్లను సాధించడం విశేషం. 28ఏళ్ల యూకీ డబుల్స్‌లో 90వ, 35ఏళ్ల సాకేత్ మైనేని 74వ ర్యాంక్‌లో ఉన్నారు. వీరిద్దరూ జతకట్టి తొలిసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ పురుషుల డబుల్స్‌లో వైల్డ్‌కార్డ్ ఎంట్రీతో బరిలోకి దిగనున్నారు.

బిల్డప్పులు సరే... కంటెంట్ ఎక్కడ?

నవచిత్రం

'ఆర్‌ఆర్‌ఆర్' సినిమాతో అంతర్జాతీయ స్థాయిలో మరోసారి సత్తా చాటిన తెలుగు సినిమా ప్రతిష్టాత్మక ఆస్కార్ అవార్డ్‌కి ఒక్క అడుగు దూరంలో మాత్రమే ఉంది. దీంతో దేశవ్యాప్తంగానే కాదు యావత్ ప్రపంచం దృష్టి మొత్తం ఇప్పుడు తెలుగు సినిమాపై కేంద్రీకృతమైంది. ఈ నేపథ్యంలో సంక్రాంతికి విడుదలైన సినిమాలపై అందరిలోనూ మరింత ఆసక్తితో పాటు భారీ అంచనాలు ఏర్పడ్డాయి. దీనికి తోడు గతంలో మాదిరిగానే అగ్ర హీరోల సినిమాలు సంక్రాంతి బరిలోకి దిగి మరింత హీట్ పెంచితే, ఈ హీట్‌ని రెట్టింపు చేస్తూ తమిళ అగ్ర హీరోల సినిమాలు సైతం పోటీకి సై.. అంటూ దిగాయి. పండగ సందర్భంగా రోజుకి ఆరు షోలు వేయడంతో ఈ సినిమాలను చూసేందుకు ప్రేక్షకులు, ఆయా హీరోల అభిమానులు తెల్లవారుజాము నుంచే క్యూలు కట్టారు. కరోనా గడ్డుకాలం తర్వాత థియేటర్లు ప్రేక్షకులతో కిక్కిరిసిపోవడం శుభ పరిణాయం. అయితే భారీ అంచనాల నేపథ్యంలో సంక్రాంతి బరిలోకి దిగిన చిరంజీవి 'వాల్తేరు వీరయ్య', బాలకృష్ణ 'వీరసింహారెడ్డి', విజయ్ 'వారసుడు', అజిత్ 'తెగింపు'తోపాటు సంతోష్‌శోభన్ నటించిన 'కళ్యాణం కమనీయం' సినిమాలు ప్రేక్షకులను, ఆయా హీరోల ఫ్యాన్స్‌ని అలరించాయో లేదో ఓ లుక్కేద్దాం..


'వీరసింహారెడ్డి'లో బాలకృష్ణ




'వారసుడు'లో విజయ్, 'తెగింపు'లో అజిత్, 'కళ్యాణం కమనీయం'లో సంతోష్ శోభన్


'వాల్తేరు వీరయ్య'లో చిరంజీవి

తెగింపు

ఈ ఏడాది సంక్రాంతి బరిలోకి ముందుగా అజిత్ నటించిన 'తెగింపు' (ఈనెల 11) సినిమా విడుదలైంది. బ్యాంక్ మోసాలు, ఆ ట్రాపులో పడి కష్టార్జితాన్ని పోగొట్టుకుని ఏడ్చే మధ్య తరగతి వాళ్ళ జీవితాలు.. ఈ పాయింట్ ఆధారంగా దర్శకుడు హెచ్.వినోద్ సినిమాని అలరించే విధంగా తెరకెక్కించడంలో విఫలమయ్యారు. నటన పరంగా అజిత్ తన పాత్రకు పూర్తి న్యాయం చేసినప్పటికీ కథ,కథనాలు అంతగా ఆకట్టుకోకపోవడం, గిబ్రాన్ అందించిన నేపథ్య సంగీతం బాబోయ్ అనిపించేలా ఉండటంతో ఈ సినిమా చూడటం కూడా 'తెగింపు' కింద లెక్కే అన్న చందంగా ప్రేక్షకులు థియేటర్ల నుంచి బయటికి వచ్చారు. ఇందులో మంచి బిల్డప్పులతో బోలెడన్ని ఫ్యాన్ మూమెంట్స్ ఉన్నప్పటికీ పసలేని కథ వల్ల అజిత్ ఫ్యాన్స్ ఉత్సాహం సైతం నీరుగారిపోయింది.

వీరసింహారెడ్డి

ఈ సినిమా తర్వాత బాలకృష్ణ 'వీరసింహారెడ్డి' (ఈనెల 12)గా బరిలోకి దిగారు. రాయలసీమ నేపథ్యంలో సిస్టర్ సెంటిమెంట్‌తో కథ, కథనాన్ని అల్లుకున్న దర్శకుడు మలినేని గోపీచంద్ కంటెంట్ కంటే కటౌట్‌నే బాగా నమ్ముకున్నారు. దీంతో బలహీనమైన కంటెంట్‌కి అదిరిపోయే ఫ్యాన్ మూమెంట్స్‌ని జత చేసి మెప్పించే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో మితిమీరిన హింసకి, బూతులకు పెద్ద పీట వేశారు. ఈ సినిమా చూస్తున్న క్రమంలో అసలు సెన్సార్ వాళ్ళు ఎందుకు వీటికి కట్స్ ఇవ్వలేదనే ప్రశ్న ప్రతి ఒక్కరికీ కలుగకమానదు. వీటికితోడు సన్నివేశానికి సంబంధంలేని డైలాగుల్ని జొప్పించడం, అవసరం ఉన్నా లేకపోయినా తమన్ ఇచ్చిన బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ సైతం అందరికీ చిరాకు తెప్పించింది. ఇక ఈ సినిమా చూస్తున్నంత సేపు 'సమరసింహారెడ్డి', 'నరసింహనాయుడు', 'సింహా', 'లెజెండ్', 'అఖండ' సినిమాలన్ని ఒకేసారి గుర్తుకొస్తాయి. అయితే కథ ఎలా ఉన్నప్పటికీ బాలయ్య గెటప్, ఆయన డైలాగ్స్ చెప్పిన విధానం, బిల్డప్ షాట్స్‌కు అభిమానులు ఫిదా అయిపోతారంతే.

వాల్తేరు వీరయ్య

'వీరసింహారెడ్డి'గా బాలయ్య సిస్టర్ సెంటిమెంట్‌తో పోటీలోకి దిగితే, 'వాల్తేరు వీరయ్య' (ఈనెల13)గా చిరంజీవి బ్రదర్ సెంటిమెంట్‌తో రంగంలోకి అడుగుపెట్టారు. వాల్తేరు వీరయ్యగా చిరంజీవి, ఆయన తమ్ముడిగా రవితేజ తమ తమ పాత్రలతో మెప్పించినప్పటికీ రొటీన్ కథ నీరసాన్ని తెప్పించింది. చిరంజీవిని చూస్తున్నంత సేపూ 'ముఠామేస్త్రీ', 'ఘరానా మొగుడు', 'గ్యాంగ్‌లీడర్' వంటి తదితర సినిమాలు ఒక్కొక్కటిగా మన మదిలో మెదులుతాయి. ఇద్దరు స్టార్లని పెట్టుకుని దర్శకుడు బాబీ వీక్ లైన్‌తో సన్నివేశాలను అల్లుకోవడం బాధాకరం. అక్కడక్కడ కొన్ని మెరుపులు ఉన్నప్పటికీ వీక్ సీన్స్ వల్ల అవి కూడా తేలిపోయాయి. అయితే ఫ్యాన్ మూమెంట్స్ మాత్రం అటు చిరంజీవి, ఇటు రవితేజ అభిమానుల్ని బ్రహ్మాండంగా అలరించాయి.

వారసుడు

ఇక ఈనెల 14న విజయ్ 'వారసుడు'గా సంక్రాంతి పోటీలో అమీతుమీ తేల్చుకునేందుకు దిగారు. గాడి తప్పిన అన్నలను దారిలోకి తీసుకొచ్చే తమ్ముడి కథగా రూపొందిన ఈ సినిమా సైతం రొటీన్ పాయింట్‌తో అలరించలేక పోయింది. ఈ పాయింట్‌తో ఇప్పటికే ఎన్నో సినిమాలు వచ్చినప్పటికీ దర్శకుడు వంశీ పైడిపల్లి కొత్తగా చూపించే ప్రయత్నం చేస్తాడనే నమ్మకంతో చూసిన ప్రేక్షకులందర్నీ నిరాశపర్చాడు. ఇందులోనూ ఫ్యాన్ మూమెంట్స్‌కి కొదవలేదు. తమ హీరోకి సంబంధించిన బిల్డప్ షాట్స్ వచ్చినప్పుడు అభిమానుల హంగామా అంతా ఇంతా కాదు.

కళ్యాణం కమనీయం

పెద్ద సినిమాలకు దీటుగా సంతోష్ శోభన్ నటించిన 'కళ్యాణం కమనీయం' (ఈనెల14)న ప్రేక్షకుల ముందుకొచ్చింది. ప్రస్తుత ట్రెండ్‌లో ఉద్యోగం లేని భర్తకి ఉండే కష్టాల నేపథ్యంలో ఈ చిత్రం రూపొందింది. నూతన దర్శకుడు అనిల్‌కుమార్ సైతం వీక్ పాయింట్‌తో ప్రేక్షకులను మెప్పించే ప్రయత్నం చేసి విఫలమయ్యారు.

■ 'వీరసింహారెడ్డి', 'వాల్తేరు వీరయ్య' చిత్రాల్లో కథానాయికగా నటించిన శృతిహాసన్, 'వారసుడు'లో నాయికగా నటించిన రష్మిక మందన్నా కేవలం పాటలకే పరిమితమయ్యారు.

'వీరసింహారెడ్డి', 'వాల్తేరు వీరయ్య' ఈరెండు చిత్రాల్లో సిస్టర్, బ్రదర్ సెంటిమెంట్ ఉన్నప్పటికీ ఈ రెండూ కూడా సవతి తల్లి నేపథ్యంతోనే ఉన్నాయి. ఇక విజువల్ ట్రీట్ పరంగా 'వీరసింహారెడ్డి', 'వాల్తేరు వీరయ్య', 'వారసుడు', 'తెగింపు'.. ఏ సినిమాకి ఆ సినిమా తగ్గేదేలా అన్నట్టు ఉన్నాయి. సినిమాలను ఆమాత్రం ప్రేక్షకులు చూడటానికి కారణం రిచ్‌గా ఉన్న సినిమాటోగ్రఫీని కారణమని ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. అలాగే ఆయా నిర్మాణ సంస్థలు సైతం మేకింగ్ విషయంలో ఎక్కడా కాంప్రమైజ్ కాలేదని కూడా స్పష్టమవుతోంది. బిల్డప్పుల పరంగా 'వీరసింహారెడ్డి', 'వాల్తేరు వీరయ్య', 'వారసుడు', 'తెగింపు' ఈ చిత్రాలన్ని ఆయా హీరోల ఫ్యాన్స్‌కి మాత్రం డబుల్ ధమాకా ఇచ్చాయి.

కటౌట్ కాదు.. కంటెంటే కింగ్

ఆన్ హోల్.. భారీ బడ్జెట్‌తో, భారీ అంచనాలతో వచ్చిన ఈ సినిమాలు సంక్రాంతి సందర్భంగా వచ్చిన సెలవులు కారణంగా, అభిమానుల సందడి కారణంగా భారీ కలెక్షన్లను రాబట్టుకోవచ్చేమోగాని కథ పరంగా మాత్రం అందర్నీ నిస్సందేహంగా నిరుత్సాహపరిచాయి. అంతర్జాతీయ స్థాయిలో తెలుగు సినిమా రెపరెపలాడుతున్న తరుణంలో ఇప్పటికీ రొటీన్ రొడ్డకొట్టుడు కథలతో కొత్త సీసాలో పాత సారా అన్న చందంగా మెప్పించే ప్రయత్నం చేస్తే ఫలితం కూడా అలాగే ఉంటుందని, కటౌట్ కంటే కంటేంటే కింగ్ అని మేకర్స్ తెలుసుకోవాలి.

- రెడ్డి హనుమంతరావు

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.



అంతర్జాతీయంగా సత్తాచాటాలంటే
అనువాదాలు తప్పనిసరి

ఏ రంగమైన విస్తరించాలి అంటే సంగమం తప్పనిసరి. సాహిత్యంలో కూడా పదాలతో పాటు సాహిత్య ఆదాన-ప్రదానాలు జరగాలి. ఒకప్పటితరం ప్రపంచ సాహిత్యం అనువాదాలుగా తీసుకొచ్చింది. ఇప్పటితరం మన సాహిత్యాన్ని ప్రపంచ సాహిత్యంలోకి భాగం చెయ్యడానికి అనువాదాల్ని తీసుకెళ్తుంది. తెలుగు- కన్నడ మధ్య అనువాద బంధాన్ని బలోపేతం చేస్తున్న అనువాదకుల్లో డా. నాగశేషు ఒకరు. వారితో ముఖాముఖి...

మీ నేపథ్యము, సాహిత్యం వైపు జరిగిన ప్రయాణం గురించి వివరించండి?

మాది తెలుగు-కన్నడ విభజన రేఖతో ముడిపడివున్న సరిహద్దు గ్రామాల్లో ఒకటైన గరినేకులపల్లి మా ఊరు (అనంతపురం జిల్లా, రామగిరి మండలం). మా ఊరు కర్ణాటకకు సరిహద్దుకి అర కిలోమీటర్ దూరంలోనే ఉంటుంది. మా ఊర్లో ప్రాథమికోన్నత వరకే పాఠశాల ఉండడం వల్ల నా ఉన్నత పాఠశాల విద్య పక్కనే ఉన్న కర్ణాటకలో సాగింది. మాది పూర్తిగా గొర్రెలు కాసే వృత్తి. రమ్యమైన రంగస్థల పద్యాలతో మొదలై అలాఅలా గురజాడ, శ్రీశ్రీ, జాషువా, వేమన, సర్వజ్ఞ, కువెంపు వంటివారి సాహిత్యాలలోకి తెలియకుండానే ఆరాదిస్తూ పోయను. అస్తిత్వ నేపథ్యంలో భాగంగా మా రాయలసీమ సాహిత్యంతో ప్రయాణం చేస్తున్నాను.

అనువాదకులుగా మారడానికి భౌగోళికపరంగా మీ ప్రాంతం కారణంగా చెప్పుకోవచ్చా?

ఒకింత అయ్యుండొచ్చు. భౌగోళికంగా కర్ణాటకతో మాకు సాంస్కృతిక, సామాజిక అనుబంధాలన్ని పెనవేసుకొని ఉంటాయి. మా సరిహద్దులో కన్నడకంటే తెలుగునే ఎక్కువగా మాట్లాడతారు. అయినా అక్కడి తెలుగువారిపై తప్పకుండా కన్నడ ప్రభావం ఉంటుంది. మాట్లాడే మాటల్లోనూ ఆ ప్రభావం కనిపిస్తుంది. మా ప్రాంత ప్రజలకు నాటి హైదరాబాద్, నేటి అమరావతి రాజధానిల కంటే బెంగుళూరుతోనే ఎక్కువ అనుభంధం కలిగి ఉంటారు. చాలామంది అసలు వాటిని చూసి కూడా ఉండరు. ప్రభుత్వ వ్యవహారాలు తప్పితే మిగతా అంతా మా జీవితాలు కర్ణాటకతోనే ముడిపడి ఉంటాయి. స్వతహాగా నేను తెలుగువాడిని. అయినా తెలుగు-కన్నడ రెండిటిని చదువుకున్నాను. అందువల్లే అనువాద సాహిత్యం, తులనాత్మక సాహిత్యం రెండు చేయగలుగుతున్నాను.

ఒక అనువాదకుడిగా తెలుగులో ఇప్పుడు వస్తున్న అనువాదాలు పాఠకుల్లో ఎంత మేరకు విజయవంతం అవుతున్నాయని భావిస్తున్నారు?

తెలుగులోకి జరుగుతున్న అనువాదాలపట్ల కొద్దో గొప్పో సంతృప్తిగా ఉన్నా తెలుగు నుంచి వెళ్తున్న అనువాదం విషయంలో ఏమంత సంతృప్తికరంగా జరగలేదనిపిస్తుంది. ఈ అనువాదాల విషయంలో మనం ఇంకా వెనుకబడే ఉన్నామనిపిస్తుంది. ఇతరభాష నుంచి ఏ అనువాదం వచ్చినా తెలుగువారు అమితంగా ఇష్టపడి సోషల్ మీడియాలో గొప్పగా పంచుకుంటున్నటువంటి సందర్భాలు మనందరం చూస్తున్నాం. అంటే అనువాద రచనల్ని తెలుగుపాఠకులు బాగా ప్రోత్సహిస్తున్నారనే విషయం అర్థమవుతుంది. భాషకు ఇదొక శుభపరిణామంగా భావించవచ్చు.


తెలుగు-కన్నడల అనువాదకులుగా ఈ రెండుభాషల మధ్య జరిగిన అనువాదాలకు మీరు చేస్తున్న కొనసాగింపు ఏంటి?

మనలో చాలామందికి ఆంగ్ల సాహిత్యాన్ని, వారి సంస్కృతిని గురించి తెలుసుకోవాలనే ఉన్నంత కుతూహలం, ఉబలాటం మన సంస్కృతిని, సాహిత్యాన్ని, చరిత్రను ఇతరులకు తెలియజేయాలనే తపన లేకపోవడం చాలా బాధాకరం. ప్రత్యేకించి మనం మనకు ఇరుగుపొరుగున ఉన్న సాహిత్యాలను ముందుగా తెలుసుకోవాలి. సహచర భాషా సాహిత్యాల్లోని సంగీతం, నాటకరంగం, చరిత్ర, సంఘసంస్కర్తలు, ప్రాచీన, ఆధునిక సాహిత్యాల గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ముఖ్యంగా తెలుగు-కన్నడ సాహిత్యాల గురించి ప్రస్తావిస్తే ఆ అనుబంధం ఈనాటిది కాదు. అనుబంధాన్ని అనేకమంది బలోపేతం చేయడానికి చాలావరకు కృషి చేశారు. చేస్తున్నారు. వారిలో రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ, వీరకేసరి సీతారామశాస్త్రి, టి.ఎస్. వెంకన్నయ్య, తంగిరాల వెంకట సుబ్బారావు, శ్రీధర్ మూర్తి, ఆర్.వి.ఎస్. సుందరం, జి.ఎస్ మోహన్, జానుమద్ది హనుమత్ శాస్త్రి... మొదలైనవారి కృషి అనన్యమైనది. ఈ కోవలోనే రంగనాథ రామచంద్రరావు, ముకుంద రామారావు, కుం. వీరభద్రప్ప, కొలుకులూరి ఆశాజ్యోతి, రామనాథం నాయుడు, అజయ్ వర్మ అల్లూరి, స. రఘునాథ లాంటి వారు కూడా అనేక అనువాదాలు చేస్తున్నారు. అయితే నేను ప్రత్యేకించి తులనాత్మక సాహిత్యంతోపాటు అనువాదాలను కూడా సమాంతరంగా చేస్తున్నాను. ఇంతవరకు కన్నడ సాహిత్యంలో బీరప్పల సంస్కృతి, కత్తిని, కలాన్ని పట్టి సమాంతరంగా రాణించిన బహుజనస్త్రీల సాహిత్య, జీవిత విశేషాల గురించి అధ్యయనం చేసి తెలుగువారికి చెప్పే ప్రయత్నం చేశాను. తెలుగు కన్నడ ప్రాచీన కవయిత్రుల సాహిత్యం గురించి అంతవరకు ఆ ప్రయత్నం జరగలేదు. ఈ సోదర భాషల మధ్య ఉన్న ఖాళీలు నావంతుగా పూరించే లక్ష్యంగా ప్రయత్నిస్తున్నా.

తులనాత్మకత, అనువాదాలు మధ్య తెలుగు భాషకు ఇప్పటివరకు లబ్ధి చేకూరింది ఎంత అంటే ఏమి చెబుతారు?

అనువాదాలు ఏ భాషకైన ప్రయోజనమే చేకూరుస్తాయి. అది తెలుగుభాషకు ఎంతమేరకు లబ్ధి చేకూరింది అన్న విషయం చర్చించాల్సివస్తే తెలుగు సాహిత్యం ప్రారంభమే అనువాదంతో మొదలైంది. ఆ ప్రవాహం ప్రాచీన సాహిత్యంతో పరుగులు పెట్టిన తర్వాత కాలంలో కాస్త మందగించాయి. తెలుగులో వచ్చిన ఆధునిక సాహిత్యంలోని బలమైన వాదాల సాహిత్యాలు పరభాషల్లోకి విరివిగా తీసుకొచ్చినట్లైతే అప్పుడు తెలుగు రచయితలకు లబ్ధి చేకూరు తుంది. కందుకూరి. గురజాడ, జాషువా, విశ్వనాథ, సినారె, కాళోజీ, దాశరథి లాంటి రచయితల రచనలు కూడా విరివిగా ఇతరభాషల్లోకి అనువాదాలు చేస్తే అప్పుడు మన రచయితలకు కూడా అంతర్జాతీయ స్థాయిలో గౌరవం లభిస్తుంది. ఈ విషయంలో కేంద్ర సాహిత్య అకాడమీ తప్పితే మిగతా సంస్థలు వాటికి ఆదరణ కలిగించ లేదనే చెప్పాలి.

> కన్నడ రచయితలతో పోల్చితే తెలుగు రచయితలు వాడే అన్య భాషాపదాలు ఎక్కువ. అందులో సంస్కృత, ఆంగ్లభాషా పదాలే అధికం. అనువాదమప్పుడు ఒకింత సమస్యగానే ఉంటుంది. ప్రపంచీకరణ వల్ల ఇప్పుడు అన్ని భాషల్లోకి అన్యభాషా పదాలు ప్రవేశిస్తున్నాయి. వాటికి సమానార్థక నూతన పదసృష్టి జరుగుతుంది. వీటి నుంచి కూడా అనువాదకుడికి ఇబ్బందులు ఉంటాయి.



మీ "తగటు", "ఇరుగు-పొరుగు" తులనాత్మక వ్యాసాలు తెలుగువాళ్లకు కన్నడపై ఏ విధమైన అవగాహనని ఏర్పరచుతాయని నమ్ముతున్నారు?

ఒక రచయిత ఆలోచనలను రెండుభాషల్లోకి అందించే ప్రయత్నం ఎప్పుడూ కొత్తదే. నేను రాసిన "ఇరుగు-పొరుగు" "తగటు" అనే పుస్తకాలు పూర్తిగా తులనాత్మకమైనవి. కన్నడ భాషలో ఉన్న 'బండాయ' సాహిత్యాన్ని తెలుగుభాషలో వచ్చిన దళిత, బహుజన, మైనార్టీ వాదాలతో పోల్చి చూసే ప్రయత్నం చేశాను. అలాగే ఇరుభాషల్లోని శృంగార కవితల్ని, పత్రికల్లో మహిళలు చేసిన కృషిని, స్వాతంత్రం పూర్వం కన్నడ నవలల్లో స్త్రీ పాత్రల చిత్రణని తులనాత్మక కోణంలో చెప్పాను. కన్నడ సాహిత్యాన్ని తెలుగువారి అవగాహనలోకి తెచ్చుకొనేందుకు ఈ పుస్తకాలు ఉపకరిస్తాయని భావిస్తున్నా.

పస్తుతం ఆంగ్లంకి జరిగే అనువాదాలు అధికంగా ఉన్నాయి. ఇతర ప్రాంతీయ భాషల్లోకి జరిగే అనువాదాలు తక్కువగా ఉన్నాయి. రెండింటిలో వేటివల్ల భాషకు అధిక ప్రయోజనం చేకూరుతుంది?

ఎన్ని భాషల్లోకి అనువాదం జరిగితే అంత ప్రయోజనం మూలభాషకి. అంతర్జాతీయంగా ఉన్న పాఠకులను ఆకర్షించడానికి ఆంగ్లం మధ్యమంగా ఉపయోగపడుతుంది. ఆ భాషద్వారా ఇతర భాషల్లోకి అనువదించడానికి సులువవుతుంది. అంతర్జాతీయతతో పాటు జాతీయంగా కూడా అనువాదాలు జరగాలి. ఆంగ్లంతో పాటు అన్ని ప్రధాన భారతీయభాషల్లోకి కూడా విరివిగా అనువాదం జరగాలి. వీటివల్ల రచయితకంటే భాషకు అధిక ప్రయోజనం చేకూరుతుంది.

అన్ని భాషల్లోనూ అన్యభాషా పదప్రయోగాలు ఎక్కువగానే వచ్చి చేరుతున్నాయి. అనువాదం చేస్తున్నప్పుడు వీటివలన సులభతరమవుతుందా క్లిష్టతరమవుతుందా?

అనువాదం ఎప్పుడూ సంక్లిష్టమేనదే. మూలభాష నుండి లక్ష్యభాషలోకి అనువాదం అంత సులువైన పనేంకాదు. లక్ష్యభాషలోని పదజాలంపై సున్నితమైన అవగాహనతోపాటు ప్రాంతీయత, మాండలికాలపై సుక్ష్మత తప్పనిసరి. ఒకోసారి మూలభాషలోని పదానికి లక్ష్యభాషలోని సమాంతర పదానికి భావపొంతన కుదరకపోవచ్చు. తిట్లు కూడా ఒక భాషలో ఉపయోగించినంత సులభంగా ఇంకొక భాషలో ఉపయోగిస్తే అది వివాదమయ్యే పరిస్థితి కూడా ఉంటుంది. మూలభాష చదువుతున్నప్పుడు కలిగే భావోద్వేగం, సన్నివేశాలు, పాత్రల ఉన్నతం, హృదయాన్ని కరిగించే సందర్భాలు, అమాయకత్వం, మూర?త్వం లక్ష్యభాషలో అంతే స్థాయిలో పండించాలంటే రచయిత ప్రసవవేదన అనుభవించాల్సి ఉంటుంది. ఎందుకంటే రచయితకున్నంత స్వేచ్ఛ అనువాదకుడికి ఉండదు.

కన్నడ రచయితలతో పోల్చితే తెలుగు రచయితలు వాడే అన్య భాషాపదాలు ఎక్కువ. అందులో సంస్కృత, ఆంగ్లభాషా పదాలే అధికం. అనువాదమప్పుడు ఒకింత సమస్యగానే ఉంటుంది. ప్రపంచీకరణ వల్ల ఇప్పుడు అన్ని భాషల్లోకి అన్యభాషా పదాలు ప్రవేశిస్తున్నాయి. వాటికి సమానార్థక నూతన పదసృష్టి జరుగుతుంది. వీటి నుంచి కూడా అనువాదకుడికి ఇబ్బందులు ఉంటాయి. భాషల్లో నూతనంగా కలిగే మార్పులపై అనువాదకుడికి నిరంతర అవగాహన ఏర్పరుచుకొని ఉండాలి.

అనువాదాలు విరివిగా జరగాలంటే ఏం చేయాలి?

అనువాదం అనేది నిరంతరం జరగాల్సిన ప్రక్రియ. ఒక రచయిత ఆలోచనలను విశ్వవ్యాప్తం చేయడం అంటే చిన్నవిషయం కాదు. అందుకు ప్రతి విశ్వవిద్యాలయంలోనూ అనువాద పీఠాలు, అనువాదశాఖలు ఏర్పాటు చేసి పూర్తిగా అనువాదాలకే ఆ విభాగాలను పరిమితం చేయాలి. అప్పుడు జాతీయంగా, అంతర్జాతీయంగా మన తెలుగు సత్తా చాటుతుంది. అంతర్జాలం అన్ని రంగాల్లో ప్రభావం చూపుతున్న తరణంలో సాహిత్య సంస్థలు కూడా సదవకాశంగా భావించి అనువాదాలపై దృష్టి సారించాలి. ఇందుకు పాఠకుల నుంచి కంటే ప్రభుత్వాల సహకారం అధికంగా ఉండాలి.

అనువాదకులుగా అక్కడికి ఇక్కడికి ఏమి తేడాలు గమనించారు?

సాహిత్యం విషయంలో అన్నింటిలోనూ కన్నడవారు ముందున్నారు. ప్రతుల అమ్మకం నుంచి పత్రికలువాళ్ళు ఇచ్చే పారితోషకం వరకు. అక్కడ భాష విషయంలో అందరు ఐఖ్యత-సఖ్యత పాటిస్తారు. భాషకు సంబంధించి ఎవరు కృషి చేసిన గుర్తించి, ప్రోత్సహించడంలో ముందుంటారు. రచయితలతో సమానంగా అనువాదకుల్ని భావిస్తారు. ఇప్పుడిప్పుడే తెలుగులో ఆ వాతావరణం ఏర్పడుతుంది.



అనువాదకుడిగా భవిష్యత్తులో ఎటువంటి ప్రణాళికలు ఉన్నాయి?

ప్రస్తుతం కందుకూరి వీరేశలింగం సంఘ సంస్కరణ దృక్పథం అనే పుస్తకాన్ని కన్నడలోకి అనువదిస్తున్నాను. కన్నడంలోని కవిరాజమార్గాన్ని తెలుగులోకి అనువదించాలని వున్నా.. కన్నడతో పోల్చితే తెలుగులో LGBT ('గే' సాహిత్యం) సాహిత్యం చాలా తక్కువగా వచ్చింది. వాటిని కూడా అనువదించాలి. చూడాలి. ఎంతమేరకు సఫలీకృతుణ్ణి అవుతానో.

- బి. మదన మోహన్ రెడ్డి, 9989894308
పరిశోధక విద్యార్థి,
హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయం

నిజాక్షరాలు

కొన్ని వ్యవస్థలు
వ్యక్తిగతాలను భుజాన వేసుకుని
గాలిలో దీపాలు ముట్టించి
వెలుగుల్ని చీకట్లోనే మగ్గిస్తూ
అన్యాయం చేస్తున్నాయి
ఆత్మద్రోహం చేసుకుంటూ

ఆకలి చేసే తప్పుకు
తెలివితక్కువోళ్ల
క్షుద్బాధ తీర్చుకునుటకై నాల్గు రాళ్ల
తస్కరిస్తే వాళ్ళ తోళ్ళు వల్చేస్తారు
అమానవీయంగా గుడ్లురుముతూ

అదే
ఉన్నోళ్ల నేలతల్లినే తార్చుతూ
నడి మైదానంలో వెలకడుతుంటే
వాళ్ళ అరికాళ్ళు కందకుండా
అరచేతులుంచుతున్నారు
హంగూ హోదా ఒక్కటేనంటూ
రక్షణ గోడగా

కులాల పోరులో
ఆదిపత్యకులాలు సామాన్యుడి నెత్తిపై
కరాళ నృత్యం చేస్తున్నాయి

చివరకు మట్టినే నమ్ముకున్న
మట్టిజనుల నోట్లో ఆ మట్టినే కొట్టి
అదే మట్టిలో కలిపేస్తున్నాయి

వీటినడుమ
పత్రికల పక్షపాతపు
కక్షల హోరులో నిజాక్షరాలు
దుమ్ము కొట్టుకుపోతున్నాయి

- నాగముని. యం, 9490856185

దేశానికి పట్టుకొమ్మ టీ - హబ్

అనామకంగా మొదలై
ఆకాశమంతా ఎదిగి
తెలంగాణ అంటే టీ హబ్ గా
నామకరణం సార్థకమైనది

గడ్డి నుండి గగనం వరకు
గగనమే లక్ష్యంగా.. దూకుడుగా..
ఆవిష్కరణ తోరణాలు కడుతున్నవి

స్టార్టప్ సాఫీగా
ఇన్నోవేషన్ ఇంక్యుబేషనుతో
టీ హబ్ రాకెట్ లా దూసుకుపోతున్నది

నిన్న మొన్న బెంగళూరే నెలవుగా వున్న..!
నేడు హైదరాబాదే బ్రాండ్
హబ్ గా కొలవై వెలుగై నిలుస్తున్నది

స్విగ్గీ, ఉడాన్, క్రెడ్
మీషో, ఓయో... వగైరా కంపెనీలు
హైదరాబాద్ నగరానికి
మిలియన్ డాలర్ల మార్కెట్లుగా
వన్నె తెచ్చుచున్నవి

ఉద్యోగ ఉపాధికి పునాదులుగా
ఎందరికో బంగరు భవిష్యత్తుకు భరోసై
యువత ఆలోచనలకు వాస్తవరూపమై
దినదిన ప్రవర్ధమానంగా అభివృద్ధి చెందుతూ..

దేశంలోనే అతిపెద్ద స్టార్టప్‌గా
అంకురాలకు అమ్మగా
ఆవిష్కరణలకు పట్టుకొమ్మగా
ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద హబ్
సంచనాల పతకమును ఎగురవేస్తున్నది

సకల ఆలోచనల సమాగమంతో
కేసీఆర్ దార్శనికతకు
కెటిఆర్ నిబద్ధతకి, సంకల్పానికి
ప్రతిరూప దైవనిలయముగా
దేశ విదేశీయుల పెట్టుబడులు
ప్రోత్సాహక ఊతమై
అంతర్జాతీయ స్థాయిలో
తెలంగాణకే సగర్వంగా
హైటెకులో జాబ్ లకు హబ్ గా
భారత దేశానికే టీ - హబ్
తలమానికంగా విరజిల్లుతున్నది

- డాక్టర్ పగిడిపల్లి సురేందరు
80748 46063

సంక్రాంతి - నవకాంతి



అందరం ఒకచోట
కలిసుంటె సంక్రాంతి.
అపుడపుడు కలిసుంటె
అదో కాంతి..
అపుడో...ఎపుడో కలుసుకుంటె...
ఓ చిరుకాంతి.
అందరంకలిసి
నవ్వుకుంటుంటె అగుపిస్తుంది
వెన్నెలకాంతి.
మనందరం కలిసి
నడుస్తుంటె...
అదో మహాకాంతి.
మనమే ఓ దారివేస్తుంటె..
అదో అద్భుత కాంతి.
మనదారెంటె అందరూ
నడుస్తుంటె... మహాద్భుతకాంతి.

ఒక్కదుగ వుంటేనే..
ఇంతకాంతి విరిస్తె...
మనమెప్పటికిలాగె
కలిసుంటుంటె..,
అదేకదా క్రాంతి.
ఏడాదికోమారు కాదు సంక్రాంతి..!
మనం కలిసిన ప్రతిసారి సంక్రాంతి.
నిజం.

- అనుముల ప్రభాకరాచారి

చలి

చలి, చలి, చలి...
చలి అంటే వణుకు
చలి అంటే బెణుకు!
దవుడలు అదిరేలా చలి
వొళ్ళు పగిలేలా చలి!!

అడవిలో పులి అంటే భయం
ఇంట్లో చలి అంటే భయం !
మడుగులో మొసలికి బలం
మార్గశిరంలో చలి మరీ అధికం!!

చలి అంటే అత్తభయంకు మించి
వణుకుతున్న కోడళ్ళు
కొంకర్లు పోయి వెక్కిరిస్తున్న చేతి వేళ్ళు
ఆకుల్లో దాక్కొని
ముడుచుకుపోయిన పూమొగ్గలు
మఫ్లర్లతో మూసుకపోయిన నోళ్ళు!!

కాగిన నూనెలో వేగిన
మిర్చీ బజ్జీ రమ్మంటోంది
కప్పులో సల సల మసిలిన కాఫీ
పిలుస్తుంది
మాటి మాటికి టీ తెమ్మంటే
ఇంటావిడ విసుక్కుంటుంది!!

అన్నీ...... చూస్తూ.....
గల గల నవ్వుతుంది చలి !



ఓ చలీ....
మంటేసుకొని మేము
చుట్టూ కూర్చున్నపుడు
నీవు ఒంటరై పోతావు

పొయ్యిపై పెట్టిన
నీళ్ళ కదువను చూసి
కన్నీరు పెట్టుకుంటావు
నిన్ను ఖాతరు చేయరని
దుప్పటిపై యుద్ధమే ప్రకటిస్తావు
నిన్ను కప్పేస్తుందని
పల్లెల్లోని గొంగళ్లను చూసి
ముడుచుకు పోతావు
గొంగలి పురుగులా!!

ఓ చలీ .....
అయినా నేను
ఉదయించే సూర్యుడిని అడిగా
వేకువనే రమ్మనీ !!



- జగ్గయ్య.జి, 9849525802

ఐనా నాకేమీ తెలుసమ్మా..

నాకేమీ తెలుసమ్మా ఈ సమాజం గురించి
నేను పుట్టడం మీకు ఇష్టం లేదని తెలుసు
నన్ను చదివించే స్తోమత మీకు లేదని తెలుసు
ఎన్నాళ్లున్నా నిను మీకు భారమని తెలుసు

ఐనా నాకేమీ తెలుసమ్మా.



మీరు చెప్పిన వాడితో తలవంచి
తాళి కట్టించుకోవడమే తెలుసు
తాగొచ్చి కొడితే ఆ దెబ్బలను మీకు
కనబడకుండా దాచడమే తెలుసు
సిగరేటు గాయాల్ని
గంజి వొలికిందని చెప్పడమే తెలుసు
దెబ్బలకు వాచిన మొఖానికి,
వేవిళ్ల ముసుగేయడం తెలుసు

ఐనా నాకేమీ తెలుసమ్మా.

భర్త గుర్తోచ్చి ఉలిక్కిపడి,
కడుపులో బిడ్డ తన్నాడని అబద్ధం చెప్పడం తెలుసు
కడుపులో ఉన్నది మగ బిడ్డ కాకపోతే
జరిగే పరిణామాలు తెలుసు
ఒకవేళ ఆడపిల్ల అయితే దాని జీవితం కూడా నాలాగే అని తెలుసు
రాచి రంపాన పెట్టే అత్తని మరో తల్లిగా భావించడం తెలుసు
ఐనా నాకేమీ తెలుసమ్మా.
ఈ సమాజం ఎప్పుడు మారుతుందో..
నాకేమి తెలుసు..



- ఇనుగుర్తి సాయికీర్తి